మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493

సహాయ

మీడియా సర్వీసు రి.

3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 23 సోమవారం డిసెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 98

Navabhoomi daily fallows..





# అల్లు అర్జున్ ఇంటిపై రాళ్ల దాడి



- జూబ్లిహిల్స్‌లోని అల్లు అర్జున్ నివాసంపై ఓయు జేఏసీ రాళ్లదాడి
- సంధ్య థియేటర్‌లో తోపులాట ఘటనకు, రేవతి మృతికి అల్లు అర్జున్ కారణమంటూ ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో అర్జున్ ఇంటిముందు ఆందోళన
- ఇంటి లోపలకి వెళ్లేందుకు విద్యార్థులు యత్నం..ఇంటిపై రాళ్లు
- రేవతి చావుకు అల్లు అర్జున్ కారణమంటూ నినాదాలు
- రేవతి కుటుంబానికి రూ.కోటి సాయం ప్రకటించాలని డిమాండ్
- ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకుల అరెస్ట్..స్టేషన్‌కు తరలింపు

2




హైదరాబాద్-నవభూమిబ్యూరో

పుష్ప 2 సినిమా హీరో అల్లు అర్జున్ ఇంటిపై రాళ్ల దాడి జరిగినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంపై ఓయు జేఏసీ రాళ్ల దాడికి పాల్పడింది. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట కేసులో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం, ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో అల్లు అర్జున్ ఎపిసోడ్ రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా అసెంబ్లీలో సంధ్య థియేటర్ వద్ద తోపులాట ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించడం, అల్లు అర్జున్ వైఖరిని తప్పుపట్టడంపై అల్లు అర్జున్ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. రేవంత్ వ్యాఖ్యలపై స్పందించిన అల్లు అర్జున్ తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని, శాసనసభలో రేవంత్ చెప్పినవన్నీ అవాస్తవాలని సీఎం పేరు ప్రస్తావించకుండా చెప్పారు. తనపై ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందన్నారు. అల్లు అర్జున్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలంటూ కాంగ్రెస్ శ్రేణులు తెలంగాణ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ దశలో అల్లు అర్జున్ ఇంటిపై రాళ్ల దాడి జరిగింది. ఓయూ జెఎసి విద్యార్థులు ఈ ఆందోళనకు దిగినట్లు తెలుస్తోంది.
సంధ్య థియేటర్‌లో తోపులాట ఘటనకు, రేవతి మృతికి అల్లు అర్జున్ కారణమంటూ ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో అల్లు అర్జున్ ఇంటిముందు ఆందోళన నిర్వహించారు. ఇంటి

# నారా దేవాన్ష్ ప్రపంచ రికార్డు

- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో దేవాన్ష్‌కు చోటు..
- చెక్‌మేట్ మారథాన్ పేరిట ప్రపంచ రికార్డ్
- చెస్‌లో వేగంగా పావులు కదపడంతో దేనాన్ష్ రికార్డు
- దేనాన్ష్‌కు తాత చంద్రబాబు,తండ్రి లోకేశ్ అభినందనలు

2



**అమరావతి-నవభూమి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మనవడు, మంత్రి నారా లోకేష్ తనయుడు నారా దేవాన్ష్ ప్రపంచ రికార్డు సాధించాడు. చదరంగంలో వేగంగా పావులు కదపడంలో నారా దేవాన్ష్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 9 ఏళ్ల నారా దేవాన్ష్ వేగవంతమైన చెక్‌మేట్ సాల్వర్ – 175 పజిల్స్ ప్రపంచ రికార్డును సాధించాడు. దీంతో ప్రతిష్టాత్మకమైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నారా దేవాన్ష్ చోటు దక్కించుకున్నాడు. ప్రపంచ రికార్డు తాలూకు ధ్రువపత్రాన్ని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు అందజేశారు. వ్యూహాత్మకమైన ఆటతీరుతో నారా దేవాన్ష్ "చెక్‌మేట్ మారథాన్" పేరుతో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. నారా దేవాన్ష్ ఈ ఘనత సాధించినందుకు నారా, నందమూరి కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశాయి.మరోవైపు నారా దేవాన్ష్ ఇటీవల మరో

# రాజకీయపు రంగే!



- ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై దాడి వెనుక ఓ పార్టీ
- ఇంటిపై రాళ్లదాడి రాజకీయపు కుట్రే..
- నిందితుల్లో ఒకరికి బీఆర్ఎస్‌తో సంబంధాలు
- కేటీఆర్‌తో నిందితుడు దిగిన ఫోటో లభ్యం
- అల్లు అర్జున్‌కు జాతీయ స్థాయిలో ఉన్న ఇమేజ్‌ను రాజకీయంగా వాడుకోజూస్తున్న రాజకీయ పార్టీ
- డీజీపీని అప్రమత్తం చేసిన సీఎం రేవంత్

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

సినీనటుడు అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడి ఘటనపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. రాష్ట్ర డీజీపీ జితేంద్రకి ఫోన్ చేసి సీఎం రేవంత్ మాట్లాడారు. అల్లు అర్జున్ ఇంటిపై దాడి ఘటనలో రాజకీయ ప్రోద్బలం ఉండే అవకాశం ఉందని డీజీపీని సీఎం రేవంత్ అప్రమత్తం చేశారు. మరోవైపు, అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసిన నిందితులలో ఒకరు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో దిగిన ఫొటోను సీఎం రేవంత్ రెడ్డికి ఇంటెలిజెన్స్ విభాగం అందించింది. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీపడొద్దని సీఎం రేవంత్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రముఖుల భద్రత విషయంలో సీరియస్ గా వ్యవహరించాలని ఆదేశించారు. వారిపై చర్యలు తీసుకోవాలంటూ సీఎం రేవంత్ ఆదేశాలు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సినీనటుడు అల్లు అర్జున్ నివాసంపై జరిగిన దాడి ఘటనపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సినీ ప్రముఖుల ఇళ్ల పై దాడి ఘటనను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదన్నారు. 'శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిందిగా రాష్ట్ర డీజీపీ, నగర పోలీసు

## సీసీటీవీ ఫుటేజీల్లో దొరికిన అల్లు అర్జున్

హైదరాబాద్-నవభూమిబ్యూరో 2

అల్లు అర్జున్ అరెస్ట్ నటించిన పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట చోటు చేసుకున్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ తొమ్మిదేళ్ల బాలుడు శ్రీతేజ్

# అమరావతికి బిగ్ షాక్!

## రుణం ఇవ్వొద్దంటూ ప్రపంచ బ్యాంక్‌కు మరో ఫిర్యాదు..!

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీ రాజధాని అమరావతికి బాలారిష్టాలు తప్పడం లేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా అమరావతి రాజధాని నిర్మాణం ప్రారంభమైనా మధ్యలో వైసీపీ సర్కార్ రావడంతో ఐదేళ్లుగా అక్కడ పనులు నిలిచిపోయాయి. అదే సమయంలో అమరావతికి గతంలో ప్రపంచ బ్యాంక్ ఇవ్వాల్సిన రుణాన్ని అడ్డుకునేలా అందిన ఫిర్యాదులతో అది కూడా ఆగిపోయింది. చివరకు మళ్లీ ప్రపంచ బ్యాంక్ ను ఒప్పించి తిరిగి రుణానికి ఆమోదముద్ర వేయించుకున్న కూటమి సర్కార్ కు మరో షాక్ తప్పలేదు. అమరావతికి గతంలో ఏడీబీతో కలిసి రూ.3500 రుణం ఇచ్చేందుకు సిద్ధమైన ప్రపంచ బ్యాంక్.. ఇక్కడ రైతుల నుంచి భూములు అక్రమంగా తీసుకున్నారన్న ఫిర్యాదులతో వెనక్కి తగ్గింది. ముఖ్యంగా కేంద్రం భూసేకరణ చట్టం అమల్లో ఉండగా.. ఇక్కడ రైతుల నుంచి భూసమీకరణ పేరుతో మరో చట్టం తెచ్చి అప్పటి చంద్రబాబు సర్కార్ భూములు తీసుకుందనే ఫిర్యాదులు ప్రపంచ బ్యాంక్ కు అందాయి. అలాగే అమరావతి రాజదాని కృష్ణానది వరద ముంపు ప్రాంతంలో ఉందనే ఫిర్యాదూ రావడంతో ప్రపంచ బ్యాంక్ క్షేత్రస్థాయిలో పర్యటించింది. రైతులతో మాట్లాడాక అలాంటిదేమీ లేదని తేల్చి రుణం ఇచ్చేందుకు సిద్ధమైనా జగన్ సర్కార్ వద్దని చెప్పేసింది. దీంతో ప్రపంచ బ్యాంక్ అమరావతికి రుణ ప్రతిపాదనను విరమించుకుంది. ఇప్పుడు మరోసారి దాదాపు ఇలాంటి కారణాలతోనే మరో ఫిర్యాదు అందింది.

# కేసీఆర్ సైలెంట్!

- కేటీఆర్‌కు ఏసీబీ,ఈడీ కేసుల ఉచ్చు..
- నేడో రేపో అరెస్టు చేసే అవకాశాలు
- జరుగుతున్న పరిణామాలపై కేసీఆర్ మౌనం
- కవిత అరెస్టు సమయంలోనూ ఇదే పరిస్థితి
- మౌనం వెనుక గులాబీ బాస్ వ్యూహ రచన?

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

బిగుసుకుంటున్న ఉచ్చు..కేసీఆర్ ఫుల్ సైలెంట్ ! ఆనాడు కేసీఆర్ ని టచ్ చేయడానికి కూడా జాతీయ నాయకత్వాలు సైతం జడిసి దూరం జరిగిన పరిస్థితి ఉండేది. కేసీఆర్ లో అదే గొప్ప గుణం. ఆయన ఎక్కడ ఫైర్ అవాలో బాగా తెలిసిన వారు. అపుడు ఆయన నిప్పు కణిక లాగానే కనిపిస్తారు. ఉదాహరణకు తెలంగాణా ఉద్యమం. ఆనాడు కేసీఆర్ ని టచ్ చేయడానికి కూడా జాతీయ నాయకత్వాలు సైతం జడిసి దూరం జరిగిన పరిస్థితి ఉండేది. అలా ఉద్యమాన్ని కొన్నేళ్ళ పాటు నడిపి చివరికి విజయాన్ని ముద్దాడి తెలంగాణాను సాధించిన ఘనత కేసీఆర్ ది. ఆ మీదట రెండు సార్లు సీఎం గా పనిచేసి తనదైన శైలిలో పాలన చేశారు. ఆయన మీడియా ముందుకు వస్తే చాలు చెడుగుడు ఆడేవారు. ప్రత్యర్థుల మీద ఆయన మాటలతో శర సంధానమే చేసేవారు. కేసీఅర్ ని తట్టుకోవడం కష్టమే అన్న భావన అయితే అంతటా ఉండేది. అదే విధంగా అసెంబ్లీలో అయితే కేసీఆర్ ప్రసంగం చేస్తే ఇక విపక్షంలో ఎవరు ఉన్నా మళ్ళీ మాట్లాడనీయకుండా చేసేవారు. ఆయన రాజకీయం అలాంటిది. అటువంటి కేసీఆర్ మీడియాకు దూరంగా ఉంటున్నారు. అంతే కాదు ఫార్మ్ హౌస్ లోనే ఉంటున్నారు. ఆయన ఏడాది కాలంలో ఒకే ఒకసారి అసెంబ్లీకి వచ్చారు. ఇక ఆయన జనంలోకి తొందరలో వస్తారు అని ఒక వైపు వార్తలు వస్తుంటే ఆయన రెస్ట్ తీసుకోవడానికి

# ఇక స్థానిక సమరం

2

# ఆళ్ల నాని సైకిలెక్కితే.. టీడీపీకి పంక్చర్!




- బలరాం, ఈశ్వరి దంపతులు ఒకింత ఆగ్రహం..వరుసగా రాజీనామాల పర్వం
- ఆళ్లనాని టీడీపీలో చేరితే వైసీపీలోకి జంప్..ఎమ్మెల్యే సైతం అధిష్టానానికి నిరసన

2

# అప్పు ఇస్తే పదేళ్ల జైలు

- రూ.కోటి జరిమానా.. కేంద్రం కొత్త చట్టం
- లోన్‌యాప్‌లను అరికట్టేందుకు కీలకనిర్ణయం
- ప్రభుత్వ సంస్థల అనుమతి లేకుండా రుణాలిచ్చే వారికి
- 2-7 ఏళ్ల జైలు శిక్ష..రూ.కోటి వరకు జరిమానా

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

అప్పు చేయడం తప్పు కావొచ్చు. కానీ, ఇప్పుడు అప్పులివ్వడమూ నేరం కిందే చూస్తారు. అప్పులిచ్చినందుకు గాను కనీసం పదేళ్ల జైలు శిక్ష పడేలా కేంద్రం కొత్త చట్టం తీసుకువస్తోంది. అప్పు చేయడం తప్పు కావొచ్చు. కానీ, ఇప్పుడు అప్పులివ్వడమూ నేరం కిందే చూస్తారు. అప్పులిచ్చినందుకుగాను కనీసం పదేళ్ల జైలు శిక్ష పడేలా కేంద్రం కొత్త చట్టం తీసుకువస్తోంది. ఆన్ లైన్ మోసాలు, అధిక వడ్డీ వేధింపులను అరికట్టేందుకు కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. కొద్ది సంవత్సరాలుగా అనుమతిలేని ఆన్ లైన్ యాప్స్ ఆగడాలు ఎక్కువవుతు న్నాయి. ఆన్ లైన్లో చిన్నచిన్న మొత్తాలు అప్పుగా ఇచ్చి అధిక వడ్డీకింద వంద రెట్లు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నాయి.





# రేవతి కుటుంబాన్ని నేను పరామర్శించా.. సీఎం రేవంత్ రెడ్డికి జగపతి బాబు క్లారిటీ



**హైదరాబాద్-నవభూమి:** సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మరణిస్తే సినిమా వాళ్లు ఒక్కరైనా వెళ్లి పరామర్శించారా అని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలపై సినీ నటుడు జగపతి బాబు స్పందించారు. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించానని బయటపెట్టారు. కానీ ఈ విషయాన్ని తానెక్కడ పబ్లిసిటీ చేసుకోలేదని వివరించారు. ఈ మేరకు ఒక వీడియోను రిలీజ్ చేశారు." సినిమా షూటింగ్ ముగించుకుని ఊరి నుంచి రాగానే బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్లానని జగపతిబాబు ఆ వీడియోలో తెలిపారు. చికిత్స పొందుతున్న బాలుడి తండ్రి, సోదరిని పలకరించాలని అనిపించి అక్కడికి వెళ్లానని చెప్పారు. అందరి ఆశీస్సులతో త్వరగానే బాలుడు కోలుకుంటాడని వారికి భరోసా ఇచ్చానని పేర్కొన్నారు. అందరికంటే ఎక్కువ ఎఫెక్ట్ అయ్యింది ఆ కుటుంబమే కాబట్టి తన వంతుగా సపోర్టు చేయాలని అనుకున్నానని తెలిపారు. కాకపోతే దాన్ని పబ్లిసిటీ చేయలేదని క్లారిటీ ఇచ్చారు. అందుకే ఈ విషయం ఎవరికీ తెలియలేదని అన్నారు. దానిపై క్లారిటీ ఇచ్చేందుకే ఈ వీడియో పెడుతున్నానని చెప్పారు. సంధ్య థియేటర్ తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన విషయంలో సినీ ప్రముఖులపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. జైలు నుంచి వచ్చిన అల్లు అర్జున్‌ను చూసేందుకు సినిమా వాళ్లు ఇంటి ముందు క్యూ కట్టారని మండిపడ్డారు. అల్లు అర్జున్‌కు కాళ్లు పోయాయా? చేతులు పోయాయా? కిడ్నీలు పాడయ్యాయా? ఎందుకు ఆయన్ను పరామర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఒక ప్రాణం పోతే సినిమా వాళ్లు ఒక్కరైనా వెళ్లి పరామర్శించారా అని మండిపడ్డారు

## ఓరి నీ కక్కుర్తి తగలెయ్య.. చనిపోయిన వ్యక్తిని కూడా వదల్లేదు కదా.. మరీ ఇంత ఘోరమా..?

**హైదరాబాద్-నవభూమి:**ఓ వ్యక్తి చనిపోయి.. మూడు నెలలవుతోంది. అయినా సరే ఆయన పేరు మీద పింఛన్ మాత్రం నెలనెలా డ్రా అవుతోంది. ఈ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంతకీ ఎవరు డ్రా చేస్తున్నారని ఆరా తీస్తే.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోస్టల్ శాఖ బీపీఎం కక్కుర్తి పడ్డట్టు అసలు విషయం తెలిసి.. అందరూ షాక్ అయ్యారు. ఈ ఘటన.. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండలంలో చోటుచేసుకుంది.

మనుషుల కక్కుర్తి ఎంతవరకు వెళ్లిందంటే.. బతికున్న మనుషులనే కాదు చనిపోయిన వారిని కూడా మోసం చేస్తున్నారు. అలాంటి ఘటనే కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో చోటుచేసుకుంది. పోస్టల్ శాఖ బీపీఎం అవినీతిని అధికారులు బట్టబయలు చేశారు. 3 నెలలుగా అధికారుల కళ్లుగప్పి మృతి చెందిన ఓ వ్యక్తి ఆసరా పింఛన్ డబ్బులు కాజేసిన పోస్టల్ శాఖ బీపీఎం కక్కుర్తిని బయట పెట్టారు. వాంకిడి మండల కేంద్రానికి చెందిన షేక్ మహబూబ్ అనే వ్యక్తి ఆగస్టు నెలలో మృతి చెందాడు. దీంతో.. ఆయనకు వచ్చే పింఛన్ డబ్బులను తన తల్లికి పెన్షన్ మంజూరు కోసం కుమారులు దరఖాస్తు చేసుకున్నారు. దాన్ని ప్రాసెస్ చేసే క్రమంలో.. షేక్ మహబూబ్ అనే వ్యక్తిపై ప్రతి నెలా పింఛన్ డ్రా చేసినట్లు అధికారులు తెలపటంతో కుటుంబ సభ్యులంతా షాక్ అయ్యారు. షేక్ మహబూబ్ అనే వ్యక్తి పేరిట జూలై, ఆగస్టు, సెప్టెంబర్, నెలలకు సంబంధించిన మొత్తం రూ.6048 పింఛన్ డ్రా చేసినట్టు మృతుడి కుటుంబ సభ్యులకు అధికారులు రికార్డులు చూపించారు. దీంతో విషయం తెలిసిన కుటుంబ సభ్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## వడ్డీతో సహా ఆ డబ్బులు కట్టండి.. వర్మకు ఏపీ సర్కారు షాక్

**అమరావతి-నవభూమి:** వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ రోజుకో రకంగా వార్తల్లో నిలుస్తున్నారు. సోషల్ మీడియాలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై అభ్యంతరకర పోస్టుల కేసులో హైకోర్టులో ఆయన ఊరట లభించింది. కానీ, ఇప్పటికే వ్యూహం సినిమాలో పలువురు టీడీపీ నేతల ఫోటోలు ఉపయోగించి వ్యంగంగా చూపినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కానీ రామ్ గోపాల్ వర్మ మాత్రం ఈ కేసు విచారణకి హాజరు కావడం లేదు. అయితే, ఈ కేసుని మరింత లోతుగా విచారిస్తోంది ఏపీ ప్రభుత్వం. ఈ క్రమంలో మరోసారి రామ్ గోపాల్ వర్మకి కూటమి సర్కారు షాక్ ఇచ్చింది. వ్యూహం సినిమాని ఏపీలో ప్రసారం చెయ్యడానికి ఏపీ ఫైబర్ నెట్‌కు విక్రయించగా.. ఈ క్రమంలో సినిమాకి వ్యూస్ లేకపోయినా రూ. 1.15 కోట్లు చెల్లించినట్లు గుర్తించారు. దీంతో ప్రభుత్వం వ్యూహం చిత్ర యూనిట్ ఈ సొమ్ము వడ్డీతో సహా చెల్లించాలని నోటీసులు ఇచ్చింది. ఒకవేళ 15 రోజుల్లో ఈ డబ్బు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

## తిరుమల శ్రీవారి భక్తులకు రిలీఫ్..

**తిరుమల-నవభూమి:**తిరుమల పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మిక నగరాలకు ఆదర్శంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించిన ఆయన.. పలు కీలక వివరాలు వెల్లడించారు. అనధికారిక దుకాణాల కారణంగా తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్న ఈవో.. భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని హాకర్లు, అనధికారిక దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిరుమలలో ప్రసాదాల తయారీకి రిలయన్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని.. ముడిసరుకులను వారే సరఫరా చేస్తారని టీటీడీ ఈవో చెప్పారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుడు కొలువైన తిరుమలలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. తిరుమలలో ప్రక్షాళన ప్రారంభించామన్న ఈవో.. ఈ క్రమంలోనే అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. టీటీడీ ఈవో శ్యామలరావు ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలను ప్రస్తావించారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు అనధికారిక దుకాణాల ద్వారా ఇబ్బందులు పడుతున్నారని ఈవో చెప్పారు. ఈ నేపథ్యంలో.. తిరుమలలోని అనధికార షాపులు, హాకర్లపై కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తాము బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ ఆరు నెలల కాలంలో తిరుమలలో సామాన్య భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు టీటీడీ ఈవో వెల్లడించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, సూచనలకు అనుగుణంగా సామాన్య భక్తులకు ప్రాధాన్యమిస్తున్నామని.. తిరుమల పవిత్రత కాపాడేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సర్వదర్శనం భక్తులు క్యూలైన్లలో వేచి ఉండే సమయాన్ని తగ్గించినట్లు చెప్పారు. అలాగే తిరుపతి లడ్డూ నాణ్యత, పారిశుద్ధ్యం, క్యూలైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు.

## ఆళ్ల నాని సైకిలెక్కితే.. టీడీపీకి పంక్చర్!

**అమరావతి-నవభూమిబ్యూరో:**అటు టీడీపీ నాయకత్వం సైతం ఆళ్ల నాని చేరికపై గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఆళ్ల నాని టీడీపీలో చేరిక వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తోంది. అయితే ఆళ్ల నాని చేరికను స్థానిక టీడీపీ నాయకత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఆళ్ల నాని తీవ్రంగా ఇబ్బంది పెట్టారని, అలాంటి వ్యక్తిని ఎలా చేర్చుకుంటారని టీడీపీ క్యాడర్ పార్టీ అధిష్టానాన్ని ప్రశ్నిస్తోంది. ఏలూరు టీడీపీ ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ సైతం ఆళ్ల నాని చేరికను వ్యతిరేకిస్తున్నారు. ఇదిలా ఉంటే ఆళ్ల నాని టీడీపీలో చేరితే కొంతమంది స్థానిక టీడీపీ నేతలు పార్టీని వీడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆళ్ల నాని టీడీపీలో చేరితే ఏలూరు మాజీ మునిసిపల్ చైర్మన్ ఈశ్వరీ బలరాం పార్టీకి దూరం అవుతారనే ప్రచారం జరుగుతోంది. వైసీపీలో అధికారంలో ఉన్నపుడు బలరాం, ఈశ్వరి దంపతులు వైసీపీలో కీలకంగా ఉన్నారు. ఎడా చైర్ పర్సన్ గా కూడా పనిచేశారు. రెండవసారి కంటిన్యూ చేయకుండా ఆళ్ళ నాని అడ్డుకున్నారన్న కారణంతో వారు వైసీపీకి గుడ్ బై కొట్టి టీడీపీలో చేరారు. గత ఎన్నికల్లో ఆళ్ళ నాని ఓటమికి బలరాం గట్టిగానే కష్టపడ్డారు. అలాంటి నేతను తిరిగి పార్టీలో చేర్చుకోవడంపై బలరాం, ఈశ్వరి దంపతులు ఒకింత ఆగ్రహం ఉన్నారని సమాచారం. ఆళ్ల నాని టీడీపీలోకి వస్తే మాత్రం సహకరించేది లేదని చాలా మంది టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇందులో తొలి బోణి మాత్రం ఈశ్వరీ బలరాం దంపతులదే అంటున్నారు. ఏలూరు జిల్లా వైసీపీ రాజకీయాలు చూస్తోన్న కోటగిరి శ్రీధర్‌తో ఈశ్వరీ బలరాంకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ సాన్నిహిత్యం మేరకే ఈశ్వరీ బలరాం దంపతులు వైసీపీలోకి వెళ్తున్నారని అంటున్నారు. ఏది ఏమైనా ఆళ్ల నాని చేరితే మాత్రం ఏలూరు రాజకీయంలో రచ్చ జరిగే అవకాశం కనిపిస్తోంది.

## సినిమాను తలపించేలా బోరబండ ఆటో డ్రైవర్ హత్య కేసు



**హైదరాబాద్-నవభూమి:** తన కూతురును కిడ్నాప్ చేశారనే కారణంతో ఓ ఆటో డ్రైవర్‌పై తల్లిదండ్రులు పగ పెంచుకున్నారు. వారు అనుకున్నదే తడవుగా పక్క ప్లాన్ చేసి ఆ ఆటో డ్రైవర్‌ను అంతమొందించారు. ఈ ఘటన ఏడాదిన్నర తర్వాత వెలుగుచూసింది. ఆటో డ్రైవర్‌ను హత్య చేసిన తల్లిదండ్రులను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. 2023 మార్చి నెలలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్ కనపడటం లేదని అతని బంధువులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందడంతో పోలీసులు దర్యాప్తు జరిపారు. అయితే సినిమాను తలపించేలా ఆటో డ్రైవర్ హత్య కేసు ఉంది. ఏడాదిన్నర తర్వాత వెలుగులోకి ఈ ఘటన వచ్చింది. సినిమాల్లో అవకాశం కల్పిస్తానని నమ్మబలికి బాలికను ఆటో డ్రైవర్ కిడ్నాప్ చేశారు. కూతురిని కిడ్నాప్ చేసిన ఆటో డ్రైవర్‌కి బాలిక తల్లిదండ్రులు స్కెచ్ వేశారు. స్నాప్ చాట్ ద్వారా భార్యతో కలిసి హనీ ట్రాప్ చేశారు. ఆటో డ్రైవర్ కుమార్‌ను రహస్య ప్రదేశానికి బాలిక తల్లి పిలిచింది. భర్తతో కలిసి ఆటో డ్రైవర్ హత్యకు పాల్పడ్డారు. బండ రాయితో కాళ్లు చేతులు కట్టిపడేసి నాగార్జునసాగర్ ఎడమ కాలువలో విసిరేసి తల్లిదండ్రులు వెళ్లారు. కోదాడ పీఎస్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేశారు. 2023 మార్చి నెలలో జూబ్లీహిల్స్ పీఎస్‌లో మిస్సింగ్ కేస్‌గా నమోదైంది. అనంతరం బోరబండకు బదిలీ చేశారు. ఆటో బంపర్‌ను గుర్తుపట్టిన మృతుడి బంధువులు నిందితులను పట్టుకున్నారు. ఈ హత్య కేసు వెలుగు చూడటంతో తల్లిదండ్రులను బోరబండ పోలీసులు అరెస్టు చేశారు.

## అల్లు అర్జున్ ఎపిసోడ్.. బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్-నవభూమి:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బాసటగా నిలిచారు. అల్లు అర్జున్ వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో మాట్లాడిన వ్యాఖ్యలు ఉన్నాయని తెలిపారు. తెలుగు సినిమా ఇండస్ట్రీపై పగబట్టినట్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సంధ్యా థియేటర్ ఘటనలో మహిళ మరణాన్ని ప్రతి ఒక్కరూ ఖండించారని అన్నారు. శ్రీతేజ్ కోలుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకోవడంతోపాటు అందరూ ఆ కుటుంబానికి బాసటగా నిలిచారని చెప్పారు. సమస్య ముగిసిన తర్వాత అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుడితో ప్రశ్న అడిగించుకుని సినిమా లెవల్లో కథ అల్లి మళ్లీ సమస్యను సృష్టించడం సిగ్గు చేటని బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎంఐఎంతో కలిసి పక్కా ప్రణాళిక ప్రకారం పవిత్రమైన అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం సినిమా ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఎంఐఎం ఐరన్ లెగ్ పార్టీ అని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ పంచన చేరి ఆ పార్టీని నిండా ముంచిందని విమర్శించారు. ఆ పార్టీని నమ్ముకుంటే కాంగ్రెస్‌కు అదే గతి పడుతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గురుకులాల్లో విషాహారం తిని విద్యార్థులు మరణిస్తుంటే ఏనాడైనా పరామర్శించారా అని ప్రశ్నించారు. హాస్టళ్లలో పురుగుల అన్నం తిని, పాముకాటుకు గురై నిత్యం చనిపోతుంటే మీరెన్నడైనా బాధ్యత వహించారా అని నిలదీశారు. మీకో న్యాయం.... ఇతరులకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఇకనైనా రేవంత్ రెడ్డి కక్ష సాధింపు చర్యలను వీడాలని హితవు పలికారు. లేనిపక్షంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అల్లు అర్జున్‌పై విమర్శలు చేసిన ఏసీపీపై చర్యలు!

**హైదరాబాద్-నవభూమి:** ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రెస్‌మీట్ పెట్టి సినీనటుడు అల్లు అర్జున్‌పై విమర్శలు చేసిన ఏసీపీ పబ్బతి విష్ణుమూర్తిపై చర్యలు తీసుకుంటామని సెంట్రల్ జోన్ డీసీపీ ఆక్షాంశ్ యాదవ్ తెలిపారు. విష్ణు ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్నారని చెప్పారు. తమ అనుమతి లేకుండా ప్రెస్‌మీట్ పెట్టారు. నిబంధనలు ఉల్లంఘించి విష్ణుపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం. ఇలాంటివి మేం అసలు సహించం. అల్లు అర్జున్‌పై వ్యాఖ్యలకు మేం



చింతిస్తున్నాం అని డీసీపీ ఆక్షాంశ్ యాదవ్ తెలిపారు. కాగా, ప్రెస్‌మీట్‌లో ఏసీపీ విష్ణుమూర్తి.. అల్లు అర్జున్ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన విషయం తెలిసిందే. డబ్బు మదంతో ఓ హీరో పోలీసుల మీద అనుచిత మాటలు మాట్లాడుతున్నారని విష్ణు మండిపడ్డారు.

ఓ కేసులో ముద్దాయిగా ఉన్న హీరో ప్రెస్‌మీట్ పెట్టవచ్చా? అని ప్రశ్నించారు. కొందరు నటులు, రాజకీయ నాయకులు పోలీసులపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తాము ఒక్క పది నిమిషాలు తప్పుకుంటే ఎలా ఉంటుంది పరిస్థితి అని అన్నారు.

# ఇక స్థానిక సమరం!

**హైదరాబాద్-నవభూమి:**స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం అవుతున్నది. జనవరి 2వ వారం తర్వాత ఎన్నికలు నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులను ప్రవేశ పెట్టి ఆమోదించింది. ప్రతి ఐదేళ కోసారి రిజర్వేషన్లు మార్చే విధంగా ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. వీటితో పాటే పంచాయతీరాజ్ చట్ట సవరణలోనూ పలు మార్పులు చేశారు. ఒక మండలంలో కనీసం ఐదుగురు ఎంపీటీసీలు ఉండేలా చట్టం చేశారు. ఇప్పటికే ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశారు. ఇక.. బీసీ రిజర్వేషన్ కోసం ఏర్పాటు చేసిన కేటెడ్ కమిషన్ నివేదిక ఇవ్వడమే తరువాయిగా మిగిలింది. అది ఇవ్వగానే ఎన్నికల ప్రక్రియ మొదలు కానున్నట్టు తెలుస్తున్నది. జనవరి రెండో వారం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వ హించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే ఎలక్షన్స్కు ముందు జరగాల్సిన ప్రక్రియను మను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీరాజ్, మున్ని ఫల్ చట్టాలకు సవరణలను పూర్తి చేసింది.. ప్రధానంగా రిజర్వేషన్లను ఐదేండ్లకోసారి మార్చే సవరణకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. వీటితో పాటు పం చాయతీరాజ్ చట్ట సవరణలో అనేక మార్పులు చేశారు. ఒక మండలంలో కనీ సం ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు ఉండే విదంగా మార్పు చేశారు. 80 గ్రామాలను మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేశారు.

## రేవతి మృతికి హీరోనే కారణం: మంత్రి

**హైదరాబాద్-నవభూమి** "సినిమాహాల్‌లో జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడం బాధాకరం. రేవతి మరణించిన విషయాన్ని పోలీసులు అల్లు అర్జున్‌కు చెప్పినా పట్టించుకోకుండా సినిమా చూశారు. రేవతి మృతికి అల్లు అర్జునే కారణమయ్యారు" అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. ఈ ఘటనపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడితే, ఆ వ్యాఖ్యలను అల్లు అర్జున్ తప్పుపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే ఆయన సీఎంకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## అప్పు ఇస్తే పదేళ్ల జైలు

(1వపేజీ తరువాయి)ఎవరైనా చెల్లించలేకపోతే ఫోన్లో ఉండే కాంటాక్స్, ఇమేజెస్ తీసుకుని అసభ్య సందేశాలు పంపడం, ఫొటోలు మార్ఫింగ్ చేసి వేధించడం ఎక్కువైంది. ఈ ఆన్ లైన్ రుణదాతల దుష్ప్రవర్తనకు చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇటీవల విశాఖ జిల్లాలో ఒక నవ వరుడు తన భార్య ఫొటోను మార్ఫింగ్ చేయడాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలాంటి సంఘటనలు దేశవ్యాప్తంగా ఇటీవల ఎక్కువైపోయాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం ఈ దారుణాలను ఆపేందుకు పకడ్బందీ చట్టం తీసుకురావాలని నిర్ణయించింది. కేంద్రం తీసుకొస్తున్న ఈ సరికొత్త చట్టం ద్వారా అనుమతి లేకుండా భౌతికంగా లేదా డిజిటల్ రూపంలో రుణాలివ్వడం నేరంగా పరిగణిస్తారు. ఇలా రుణాలిచ్చేవారికి 10 ఏళ్ల వరకు జైలు శిక్షతోపాటు రూ.కోటి జరిమానా విధించేలా కొత్త బిల్లును ప్రతిపాదిస్తున్నారు. అనియంత్రిత రుణ కార్యకలాపాలను నిషేధించడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆర్బీఐ 2021లోనే ప్రతిపాదించింది. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఈ చట్టం చాలా అవసరమని అప్పట్లోనే అభిప్రాయపడింది. ఆర్బీఐ లేదా ఇతర నియంత్రణ అధికారం ఉన్న సంస్థల అనుమతితోనే ఫైనాన్స్ వ్యాపారం చేసేందుకు అనుమతించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. నియంత్రిత రుణాలకు సంబంధించిన ఏ చట్టం పరిధిలోకి రాని భౌతిక, డిజిటల్ లేదా ఇతర మార్గాల్లో నిర్వహించే రుణ కార్యకలాపాలను (బంధువులకిచ్చే రుణాలు మినహా) అనియంత్రిత రుణ వ్యాపారంగా గుర్తించాలని బిల్లులో ప్రతిపాదించారు. ప్రభుత్వ సంస్థల అనుమతి లేకుండా రుణాలిచ్చే వారికి కనీసం రెండేళ్ల నుంచి ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. రెండు లక్షల నుంచి రూ.కోటి వరకు జరిమానా విధించాలని బిల్లులో ప్రతిపాదించారు.

## కేసీఆర్ సైలెంట్!

(1వపేజీ తరువాయి)అమెరికా వెళ్తారు అని రెండు నెలల పాటు అక్కడే ఉంటారు అని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు కేటీఆర్ మీద కేసులు పడ్డాయి. ఒక వైపు ఏసీబీ కేసు ఫైల్ చేస్తే మరో వైపు ఈడీ కేసు ఫైల్ చేసింది. ఈ రెండు కేసులతో కేటీఆర్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు అని అంటున్నారు. ఈడీ కేసు అంటే కవితను గతంలో అరెస్ట్ చేసి తీహార్ జైలులో నెలల పాటు ఉంచారు. మరి అలాంటి పరిస్థితి ఉంటుందా అన్న చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేతగా, దానికి మించి తండ్రిగా కేసీఆర్ అయితే ఎక్కడా రియాక్ట్ కాలేదు. కేసులు నమోదు అయి రెండు మూడు రోజులు అయింది. కేసీఆర్ నుంచి స్టేట్ మెంట్ ఒక చిన్నది కూడా లేదు. మరి ఎందుకు ఈ మౌనం, దీని వెనక ఏమిటి వ్యూహం అన్నదే చర్చనీయాంశంగా ఉంది. కేసీఆర్ మౌనం ఎపుడూ తుఫాను ముందు నిశ్శబ్ద వాతావరణం అని అంతా అంటారు. ఆయన కనుక మౌన ముద్ర దాలిస్తే ఏదో యాక్షన్ ప్లాన్ దాని వెనక ఉంటుందని చెబుతారు టీడీపీ అయితే కేసీఆర్ గతంలో తన కుమార్తెని అరెస్ట్ చేసినపుడు మీడియా ముందుకు రాలేదు, తెర వెనకే ఉండిపోయారు. ఆ సమయంలో ఆయన ఏ రకంగా ఆలోచించారో ఏ విధంగా ప్రయత్నాలు చేశారో ఎవరికీ తెలియదు. ఇపుడు చూస్తే మళ్లీ కుమారుడి వంతుగా ఉంది. ఈ విషయంలో కేసీఆర్ ఏమి చేయబోతున్నారు అన్నదే అంతటా డిస్కషన్ గా ఉంది. అయితే తన కుమారుడి మీద కేసులు పడడంతో కేసీఆర్ కలత చెందుతున్నారు అని ప్రచారం అయితే సాగుతోంది. ఏసీబీ కేసుల విషయంలో పెద్ద ఫికర్ లేకపోయినా ఈడీ ఎంట్రీయే ఇపుడు బీఆర్ఎస్ ని కలవరపెడుతోంది అని అంటున్నారు. ఒకసారి కనుక ఈడీ అరెస్ట్ చేస్తే కనీసంగా ఆరు నెలల వరకూ బెయిల్ కూడా రాదు అని ప్రచారం అయితే ఉంది. పైగా కవితను ఉంచినట్లుగానే తీహార్ జైలుకే తీసుకుని వెళ్తారా అన్న చర్చ కూడా సాగుంది. ఇవన్నీ ఇపుడు కేసీఆర్ లో కలవరం రేపుతున్నాయని అంటున్నారు. ఏది ఏమైనా ఏసీబీ కేసు అయితే అరెస్ట్ అయినా రాజకీయంగా మైలేజ్ రావచ్చు సానుభూతి వస్తుందని ఎవరైనా అనుకోవచ్చు. ఈడీ కేసులు ఏకంగా తెలంగాణా నుంచి దూరంగా ఎక్కడో జైలులో ఉంచితే మాత్రం బీఆర్ఎస్ లో కొత్త ఇబ్బందులే అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## అల్లు అర్జున్ ఇంటిపై రాళ్ల దాడి

(1వపేజీ తరువాయి)లోపలకి వెళ్లేందుకు విద్యార్థులు ప్రయత్నించారు. కొందరు దుండగులు అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరారు. రేవతి చావుకు అల్లు అర్జున్ కారణమంటూ నినాదాలు చేశారు. రేవతి కుటుంబానికి తక్షణమే రూ.కోటి సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిరసనకారులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**అల్లు అర్జున్ ఎపిసోడ్‌పై పోలీసుల క్లారిటీ**

డిసెంబర్4వ తేదీన సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ రావడంతో భారీగా అభిమానులు తరలివచ్చారని, థియేటర్ లోపలకు వెళ్లేందుకు, హీరోను చూసేందుకు ఫ్యాన్స్ ప్రయత్నించడంతో తోపులాట జరిగిందని ఏసీపీ సంతోష్ చెప్పారు. తోపులాటలో దురదృష్టవశాత్తు ఓ మహిళ మృతి చెందిందని, ఓ బాలుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారనే విషయాన్ని అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్‌కు చెప్పామన్నారు. అల్లు అర్జున్‌కు విషయం చెప్పేందుకు ప్రయత్నించగా థియేటర్ యాజమాన్యం, మేనేజర్ అంగీకరించలేదని, తాము సమాచారం చేరవేస్తామని చెప్పి చేరవేయలేదన్నారు. తొక్కిసలాట తర్వాత థియేటర్ నుంచి బయటకు వెళ్లిపోవాలని అల్లు అర్జున్‌కు ఎంత చెపపినా వినిపించుకోలేదన్నారు. డీసీపీ ఆదేశాలతో తాను అల్లు అర్జున్ దగ్గరకు వెళ్లి విషయం చెప్పామన్నారు. సినిమా చూసిన తర్వాత వెళ్తానని చెప్పారని, ఆ తర్వాత 10 నుంచి 15 నిమిషాల సమయం ఇచ్చామన్నారు. చివరకు డీసీపీతో వెళ్లి అల్లు అర్జున్‌ను బయటకు తీసుకువచ్చామని ఏసీపీ రమేశ్ తెలిపారు.

## సీసీటీవీ ఫుటేజీల్లో దొరికిన అల్లు అర్జున్

(1వపేజీ తరువాయి)ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండట్లేదు. ఆరోగ్యం ఇంకా విషమంగానే ఉంది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. తొమ్మిది సంవత్సరాల వయస్సున్న ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. కిమ్స్ ఆసుపత్రి పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నాడు. రేవంత్ రెడ్డి సభలో ప్రసంగించిన అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అనుమతి లేకుండా, బాధ్యతారహితంగా సంధ్యా థియేటర్‌కు వెళ్లాననడం సరికాదని, అది తప్పుడు సమాచారమని అన్నారు. ఇదొక యాక్సిడెంట్ మాత్రమేనని, ఇందులో ఎవరి తప్పులేదని చెప్పారు. సంధ్య థియేటర్ వద్ద రోడ్‌షో చేయలేదని, పోలీసుల డైరెక్షన్‌లోనే థియేటర్‌కు వెళ్లాననీ అన్నారు. ఈ ప్రెస్ మీట్ తరువాత అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటోన్నాయి. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, శాసన మండలి సభ్యుడు బల్మూరి వెంకట్, విప్ ఆది శ్రీనివాస్.. ఘాటుగా స్పందించారు. అల్లు అర్జున్‌లో పశ్చాత్తాపం ఎంతమాత్రం కనిపించట్లేదని విమర్శించారు. పోలీసులను సైతం తప్పు పట్టేలా వ్యవహరించారంటూ ఏసీపీ విష్ణుమూర్తి మండిపడ్డారు. సంధ్యా థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగినట్లు పోలీసులెవరూ తనకు చెప్పలేదంటూ అల్లు అర్జున్ తేల్చేసిన నేపథ్యంలో దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ నగర పోలీసులు దీన్ని వెలుగులోకి తీసుకువచ్చినట్లు చెబుతున్నారు. మొత్తంగా రెండు సీసీటీవీ ఫుటేజీలు విడుదల అయ్యాయి. ఒకదాని నిడివి 33 సెకెన్లు, మరొకటి 54 సెకెన్లు. పోలీసులతో పాటు ఆయన వ్యక్తిగత బౌన్సర్లు స్వయంగా ఆయనను బయటికి తీసుకుని రావడం రెండో ఫుటేజీలో స్పష్టంగా కనిపించింది. అల్లు అర్జున్‌తో పాటు హీరోయిన్ రష్మిక కూడా ఇందులో కనిపించారు.


## రాజకీయపు రంగే!

(1వపేజీ తరువాయి)కమిషనర్ ను ఆదేశిస్తున్నాను. ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదు. 'సంధ్య థియేటర్ ఘటనలో సంబంధం లేని పోలీసు సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి' అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాగా, సంధ్య థియేటర్ ఘటనపై ఏసీపీ విష్ణు ఈరోజు మీడియా సమావేశం నిర్వహించి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రాళ్లు, టమాటలతో అల్లు అర్జున్ నివాసంపై దాడి ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ విద్యార్థులు కొందరు అల్లు అర్జున్ నివాసం వద్ద ఆందోళన చేపట్టారు. రేవతి మరణానికి అల్లు అర్జునే కారణమంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మృతురాలు రేవతి కుటుంబానికి న్యాయం చేయాలని.. వెంటనే రూ. కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొందరు ఆందోళనకారులు అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు, టమాటాలు విసిరారు. ఇంట్లోకి నినాదాలు చేసుకుంటూ దూసుకెళ్లేందుకు యత్నించారు. రాళ్లు తగలడంతో అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు, గార్డెన్‌లోని మొక్కలు ధ్వంసమయ్యాయి. విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అల్లు అర్జున్ నివాసం దగ్గర అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. "తొందరపాటు చర్యలొద్దు! అల్లు అర్జున్ నివాసంపై దాడి ఘటనపై అరవింద్" కాగా, దాడి ఘటన జరిగిన సమయంలో నటుడు అల్లు అర్జున్ తన నివాసంలో లేరని సమాచారం. విషయం తెలుసుకున్న అర్జున్ మామ, కాంగ్రెస్‌నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి అక్కడికి చేరుకుని ఈ ఘటనపై ఆరా తీశారు. అల్లు అర్జున్-స్నేహారెడ్డి దంపతుల కుమారుడు, కుమార్తెను ఆయన తన వెంట వారి ఇంటికి తీసుకెళ్లారు,

## నారా దేవాన్ష్ ప్రపంచ రికార్డు

(1వపేజీ తరువాయి)రెండు ప్రపంచ రికార్డులను కూడా నెలకొల్పాడు. సెవెన్ డిస్క్ టవర్ ఆఫ్ హనోయిని కేవలం ఒక్క నిమిషం 43 సెకన్లలో పూర్తి చేశాడు. అలాగే 9 చెస్ బోర్డులను కేవలం 5 నిమిషాల్లో అమర్చాడు, మొత్తం 32 ముక్కలను వేగంగా సరైన స్థానాల్లో ఉంచి.. నారా దేవాన్ష్ రికార్డు సాధించాడు. నారా లోకేష్ ప్రయత్నాలను న్యాయనిర్ణేతలు, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత.. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించారు.

## వచ్చేనెల దావోస్‌కు చంద్రబాబు



**న్యూఢిల్లీ-నవభూమి:** దాదాపు 100 మందికి పైగా సీఈవోలు హాజరుకానున్న ప్రపంచ ఆర్థిక వేదిక(వరల్డ్ ఎకనమిక్ ఫోరం) వార్షిక సదస్సుకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి సహా భారత్ నుంచి కనీసం ముగ్గురు సీఎంలు హాజరుకానున్నారు. వచ్చేనెల 20 నుంచి దావోస్‌లో 5రోజుల పాటు జరిగే ఈ సదస్సులో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్, ఏపీ మంత్రి నారా లోకేశ్, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, తమిళనాడు మంత్రి టీఆర్‌బీ రాజా, యూపీ మంత్రి సురేశ్ ఖన్నా పాల్గొననున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ సోమవారం 23 । డిసెంబర్ । 2024

## కారు కింద చిక్కుకున్న దూడ.. చుట్టుముట్టిన ఆవులు, తర్వాత ఏం జరిగిందంటే?





**రాయ్‌గఢ్‌- నవభూమి:**కొన్ని ఆవులు రోడ్డుపై ఉన్నాయి. దూడ మీదుగా ఒక కారు దూసుకెళ్లింది. కొంత దూరం దానిని ఈడ్చుకెళ్లింది. దీంతో దూడ ఆ కారు కింద చిక్కుకున్నది. ఈ నేపథ్యంలో ఆవులు ఆ కారును చుట్టుముట్టాయి. స్పందించిన స్థానికులు కారు కింద చిక్కుకున్న దూడను రక్షించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌గఢ్‌లో ఈ సంఘటన జరిగింది. రద్దీ రహదారిలో ఆవుల మంద ఉన్నది. వేగంగా వెళ్తున్న కారు ఒక దూడను ఢీకొట్టింది. సుమారు 200 మీటర్ల వరకు దానిని ఈడ్చుకెళ్లింది. దీంతో ఆ చిన్న లేగ దూడ ఆ కారు కింద చిక్కుకున్నది.కాగా, ఇది గమనించిన ఆవులు ఆ కారును అడ్డుకుని చుట్టుముట్టాయి. దూడ కోసం ఆ కారు చుట్టూ తిరిగాయి. ఇది చూసి స్థానికులు స్పందించారు. కొందరు వ్యక్తులు కలిసి ఆ కారును ఒక వైపునకు ఎత్తారు. కారు కింద చిక్కుకున్న దూడను సురక్షితంగా బయటకు తీశారు. స్వల్పంగా గాయపడిన దానికి చికిత్స అందించారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన 2000 నాటి పాత వీడియో క్లిప్ తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## బాల్య వివాహాలపై కేసులు.. 400 మందికిపైగా అరెస్ట్



**గౌహతి-నవభూమి:** బాల్య వివాహాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. రాత్రి వేళ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. 400 మందికిపైగా అరెస్ట్ చేశారు. బీజేపీ పాలిత అస్సాంలో ఈ సంఘటన జరిగింది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఆ రాష్ట్రంలో కేసులు నమోదు చేస్తున్నారు. మూడో విడతలో భాగంగా 335 కేసులు నమోదు చేశారు. శనివారం అర్ధరాత్రి వేళ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ కేసులకు సంబంధించి 416 మందిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిని ఆదివారం కోర్టులో ప్రవేశపెడతామని సీఎం హిమంత బిస్వా శర్మ తెలిపారు. ఈ సాంఘిక దురాచారాన్ని అంతం చేసేందుకు సాహసోపేతమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

కాగా, అస్సాం రాష్ట్ర ప్రభుత్వం 2023లో రెండు దశల్లో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. గత ఏడాది ఫిబ్రవరిలో చేపట్టిన తొలి దశ డ్రైవ్‌లో 4,515 కేసులు నమోదు చేసిన పోలీసులు 3,483 మందిని అరెస్టు చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన రెండో దశ డ్రైవ్‌లో 710 కేసులు నమోదు చేసి 915 మందిని అరెస్టు చేశారు. తాజాగా మూడో దశ డ్రైవ్‌లో 335 కేసులు నమోదు చేసిన పోలీసులు 416 మందిని అరెస్ట్ చేశారు.

## పోలింగ్ బూత్ సీసీ ఫుటేజ్ తనిఖీపై కేంద్రం నిషేధం.. ఇకపై ఫుటేజ్ చెకింగ్‌కు నో ఛాన్స్



**ముంబై - నవభూమి:** పోలింగ్ బూత్‌లలో ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో కేంద్ర ఎన్నికల సంఘం మార్పులు చేసింది. ఇక నుంచి పోలింగ్‌కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను, వెబ్‌కాస్టింగ్ రికార్డులను, అభ్యర్థులకు సంబంధించిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. దీనిపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల్లో పారదర్శకతకు ఇది విఘాతమని మండిపడింది.కేంద్ర ఎన్నికల సంఘం సిఫార్సుల మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలు–1961లోని రూల్ 93(2)(ఏ)ను శుక్రవారం కేంద్ర న్యాయశాఖ సవరించింది. ఈ సవరణకు ఓ కోర్టు కేసు కారణమని ఈసీతోపాటు న్యాయశాఖ వేర్వేరుగా వివరణ ఇచ్చాయి. కొత్త సవరణ ప్రకారం తనిఖీకి ఎలక్ట్రానిక్ రికార్డులు మినహా ఇతర పత్రాలు, డాక్యుమెంట్లు అందుబాటులో ఉంటాయి. పోలింగ్ బూత్‌లలోని సీసీ టీవీ కెమెరాల తనిఖీవల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతుందని, అందుకే నిషేధం విధించామని ఈసీ వర్గాలు వెల్లడించాయి.సీసీ ఫుటేజ్‌ను వినియోగించుకుని కృత్రిమ మేధ ద్వారా నకిలీ వీడియోలను తయారు చేస్తున్నారని తెలిపాయి. రూల్ 93కి సవరణ తర్వాతా అభ్యర్థులకు ఎలక్ట్రానిక్ రికార్డులు అందుబాటులో ఉంటాయని, కానీ ఇతరులు తనిఖీ చేయడానికి అనుమతి ఉండదని వివరించాయి. హర్యానా ఎన్నికలకు సంబంధించిన అన్ని రికార్డులను మహమ్మద్ ప్రాచా అనే వ్యక్తికి షేర్ చేయాలని ఇటీవల పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు ఆదేశించింది. రూల్ 93 (2)లో పత్రాలు, డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ రికార్డులనే విభజన లేనందున అన్ని రికార్డులను ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే దీన్ని ఈసీ వ్యతిరేకించింది.అయితే ఎన్నికల సంఘం నిబంధనను మార్చడంపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. పారదర్శకతకు ఈసీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించింది. ఈ సవరణను న్యాయపరంగా సవాలు చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పష్టంచేశారు. కోర్టు తీర్పును పాటించాల్సిన ఈసీ, అందుకు విరుద్ధంగా నిబంధనలకు సవరణ చేయడం విడ్డూరమని విమర్శించారు.

## మొహాలీలో కుప్పకూలిన మూడంతస్తుల బిల్డింగ్.. 20 ఏండ్ల యువతి దుర్మరణం



**చండీగఢ్-నవభూమి:** పంజాబ్‌లోని మొహాలీలో మూడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఘటనలో 20 ఏండ్ల యువతి మరణించింది. ఆమెను హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన దృష్టి వర్మగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. మొహాలీ జిల్లాలో ఓ భవనంలో బేస్‌మెంట్ కోసం తవ్వకాలు జరుగుతుండగా.. పక్కనే ఉన్న మూడంతస్తుల భవనం శనివారం సాయంత్రం కుప్పకూలింది. దీంతో రంగంలోకి దిగిన ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృంధాలు నిర్విరామంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.ఇప్పటి వరకు ఓ యువతి మృతదేహాన్ని వెలికి తీశామని, భవనం శిథిలాల కింద పది మంది వరకు చిక్కుకుని ఉంటారని అధికారులు తెలిపారు. ఇప్పటికే పలువురిని రక్షించామని, అత్యవసర చికిత్స నిమిత్తం వారిని దవాఖానకు తరలించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. కూలిపోయిన బిల్డింగ్‌లో జిమ్ కూడా నడుస్తున్నట్లు చెప్పారు. కాగా, ఈ ఘటనపై బీఎన్ఎస్ 105 సెక్షన్ కింద భవన యజమానులు పర్వీందర్ సింగ్, గగన్‌దీప్ సింగ్‌లపై పోలీసులు కేసు నమోదుచేశారు.

## అత్తింటి వాళ్లను చంపేందుకు ఇంటర్‌నెట్‌లో చూసి బాంబుల తయారీ..!




**అహ్మదాబాద్-నవభూమి:**ఓ వ్యక్తికి భార్యతో విభేదాలు వచ్చాయి. ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. కోర్టులో విడాకుల కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో అత్తింటిపై కోపం పెంచుకున్న అతను వాళ్లను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ తర్వాత ఇంటర్నెట్‌లో చూసి బాంబులు తయారు చేయడం ఎలాగో నేర్చుకున్నాడు. ప్లాన్ ప్రకారం ఓ బాంబును పేల్చి ఇద్దరు గాయపడటానికి కారణమయ్యాడు. చివరికి పోలీసులక చిక్కాడు.వివరాల్లోకి వెళ్తే.. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌కు చెందిన రూపేన్ రావు (44) కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అంతేగాక కోర్టులో విడాకుల కేసు వేసింది. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. దాంతో తన భార్య, పిల్లలు తనకు దూరం కావడానికి ఆమె స్నేహితుడు, తండ్రి, సోదరుడే కారణమని రూపేన్ రావు భావించాడు.ఆ ముగ్గురిని అంతం చేయాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం ఇంటర్నెట్‌లో వెతికి రిమోట్‌తో పేల్చే బాంబులు తయారు చేయడం నేర్చుకున్నాడు. ఆ బాంబులతో భార్య స్నేహితుడు బల్దేవ్ సుఖాడియాను, ఆ తర్వాత ఆమె తండ్రిని, సోదరుడిని చంపాలని నిర్ణయించుకున్నాడు. ముందుగా సుఖాడియా ఇంటికి గాధవితో పార్సిల్ బాంబు పంపించాడు. సుఖాడియా పార్సిల్ తీసుకోగానే రిమోట్‌తో బాంబు పేల్చాడు. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే గాధవిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఇప్పుడు రూపేన్ రావును, అతడికి సహకరించిన రోహన్ రావల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మరో రెండు రిమోట్ బాంబులు, ఒక పిస్టల్, బాంబుల తయారీకి సంబంధించిన మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు.అయితే రూపేన్ రావు తొలి ప్రయత్నంలోనే పట్టుబడటంతో అతని మామ, బావమరిదిని చంపాలనే ప్లాన్ బెడిసికొట్టింది. పైగా అతడు కటకటాలపాలు కావాల్సి వచ్చింది.

## కుటుంబంతో కలిసి సజీవ దహనానికి రైతు యత్నం.. రూ.9.91 లక్షల జరిమానా విధించిన పోలీసులు



**జైపూర్-నవభూమి:** భూమికి పరిహారం కోసం కుటుంబంతో కలిసి సజీవ దహనానికి ఒక రైతు ప్రయత్నించాడు. రోడ్డుపై చితి పేర్చి నిరసన తెలిపాడు. దీంతో పోలీసులు భారీగా తరలివచ్చి అడ్డుకున్నారు. అయితే తాజాగా ఆ రైతుకు పోలీసులు షాక్ ఇచ్చారు. రూ.9.91 లక్షల జరిమానా విధించారు. రైతు కుటుంబం సజీవ దహనాన్ని అడ్డుకునేందుకు అయిన ఖర్చుల మొత్తాన్ని వారంలో చెల్లించాలంటూ నోటీస్ పంపారు. రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

డిసెంబర్ 10న రైతు విద్యాధర్ యాదవ్ తన కుటుంబంతో కలిసి నిరసన తెలిపాడు. సిమెంట్ కంపెనీకి ఇచ్చిన భూమికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాడు. పరిహారం అందని పక్షంలో తన కుటుంబంతో కలిసి సజీవ దహనానికి అనుమతించాలని కోరాడు. రోడ్డుపై కట్టెలతో చితిని ఏర్పాటు చేసి నిరసన తెలిపాడు. దీంతో దిగి వచ్చిన ఆ సిమెంట్ కంపెనీ ఆ రైతుకు రూ.3 కోట్లు నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించింది.కాగా, పోలీసులు తాజాగా రైతు విద్యాధర్ యాదవ్‌కు షాక్ ఇచ్చారు. కుటుంబంతో కలిసి సజీవ దహనానికి పాల్పడతానని బెదిరించినందుకు రూ.9.91 లక్షల జరిమానా విధించారు. ఎస్పీ శరద్ చౌదరి ఆ రైతుకు ఈ మేరకు నోటీసు జారీ చేశారు. రైతు కుటుంబం స్వీయ దహనానికి పాల్పడకుండా నిరోధించడానికి పోలీస్ శాఖకు భారీగా ఖర్చు అయ్యిందని అందులో పేర్కొన్నారు.మరోవైపు అధికార వాహనాల వినియోగంతో పాటు ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలతోపాటు 99 మంది పోలీసు సిబ్బందిని మోహరించినట్లు ఆ నోట్‌లో పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర ఖజానాపై అదనపు ఆర్థిక భారం పడిందని వివరించారు. డిసెంబర్ 24లోగా ఎస్పీ కార్యాలయంలోని ఖాతాల శాఖలో రూ.9,91,577 జమ చేయాలని ఆ రైతుకు పంపిన నోటీస్‌లో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు.

## పూరీ జగన్నాథ ఆలయంలో దర్శనాలకు సరికొత్త విధానం..!



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రముఖ క్షేత్రమైన పూరీ జగన్నాథ ఆలయంలో భక్తులకు దర్శనం కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఒడిశా ప్రభుత్వం సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టబోతున్నది. ఈ కొత్త విధానాన్ని జనవరి ఒకటి నుంచి ప్రారంభించనున్నట్లు న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఆదివారం తెలిపారు. ఆలయ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కొత్త విధానానికి సంబంధించిన ఏర్పాటు ఈ నెల 27, 28 తేదీల్లోగా పూర్తవుతాయన్నారు. డిసెంబర్ 30, 31 తేదీల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నామన్నారు. జనవరి ఒకటి నుంచి కొత్త దర్శన విధానం పూర్తిస్థాయిలో అమలులోకి తీసుకువస్తామన్నారు. ఈ కొత్త విధానంలో ఆలయానికి వచ్చే మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కొత్త విధానంలో భక్తులు ప్రస్తుతం ఉన్న ద్వారం (సత్పహచ) నుంచి జగన్నాథ ఆలయంలోకి ప్రవేశిస్తారు.అయితే, బయటకు వెళ్లేందుకు రెండు వేర్వేరు దారులుంటాయి. జగన్నాథ ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి అరబింద పాడి ఆలయాన్ని సందర్శించి ఆలయంలో కొత్త విధానం అమలుకు సంబంధించిన పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తుల రద్దీ కారణంగా గర్భగుడిలో కొలువైన దేవతామూర్తులను దర్శించుకోవడానికి తరచుగా ఇబ్బందులు ఎదురవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కొత్త విధానంలో నాట్య మండపంలో ఆరు వరుసల్లో ప్రత్యేకంగా బారికేడట్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ పనుల కోసం ఒడిశా బ్రిడ్జి అండ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్‌ని నియమించి.. ఏడాది చివరికల్లా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రత్న భండార్ మరమ్మతు పనులపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆయన చెప్పారు. రత్నా భండార్ పునరుద్ధరణ పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

## సంభాల్‌లో కొనసాగుతున్న తవ్వకాలు.. బయటపడిన 150 ఏళ్ల నాటి మెట్ల బావి



**లక్నో-నవభూమి:**ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని చందౌసి ప్రాంతంలో ఒక మెట్ల బావిని ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) బృందం గుర్తించింది. సంభాల్ జిల్లా కలెక్టర్ రాజేంద్ర పెన్సియా ఆదివారం ఈ విషయాన్ని మీడియాకు తెలిపారు. 400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో150 ఏళ్ల నాటి 'బావోలి'ని కనుగొన్నట్లు చెప్పారు. ఈ మెట్ల బావి చుట్టూ నాలుగు గదులతో కూడిన పాలరాతి నిర్మాణాలు, కొన్ని అంతస్తులు ఉన్నాయని వివరించారు. 'ఈ అఫ్‌-బావోలి తలాబ్‌ను బిలారి రాజు తాత కాలంలో నిర్మించినట్లు తెలుస్తున్నది. రెండు, మూడు అంతస్తులు పాలరాతితో, పై అంతస్తులు ఇటుకలతో నిర్మించారు. తవ్వకం చుట్టూ నాలుగు గదులు ఉన్నాయి' అని మీడియాతో అన్నారు.కాగా, శనివారం స్థానికంగా సమావేశం నిర్వహించిన తర్వాత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో అక్కడ తవ్వకాలు ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ రాజేంద్ర పెన్సియా తెలిపారు. మెట్ల బావిని గుర్తించిన నిర్మాణం పూర్తిగా మట్టితో కప్పి ఉందని చెప్పారు. మున్సిపల్ సిబ్బంది మట్టిని తొలగిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం 210 చదరపు మీటర్లు మాత్రమే బయట పడిందని తెలిపారు. మిగిలిన ప్రాంతం ఆక్రమణలో ఉందన్నారు. ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## పెళ్లి వేడుకలో కలుసుకున్న రాజ్-ఉద్ధవ్ ఠాక్రేలు..



**ముంబై - నవభూమి:**రాజకీయ శతృత్వం ఉన్న సోదరులైన రాజ్ ఠాక్రే, ఉద్ధవ్ ఠాక్రేలు ఒక వేడుకలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే సోదరి కుమారుడి వివాహం ముంబైలోని దాదర్‌లో జరిగింది. రాజ్ ఠాక్రేతోపాటు శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే తమ కుటుంబాలతో కలసి ఈ పెళ్లికి హాజరయ్యారు. వారిద్దరూ కలిసి వరుడైన మేనల్లుడు, వధువుపై అక్షింతలు చల్లి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రాజ్, ఉద్ధవ్ ఠాక్రేలు పరస్పరం మాట్లాడుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.


కాగా, ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రాజ్ ఠాక్రే, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీల నేతల మాటల దాడికి పాల్పడ్డారు. అయితే ఎన్నికల్లో సత్తా చాటలేకపోయారు. ఎంఎన్ఎస్ ఒక్క సీటు కూడా గెలువలేకపోయింది. ముంబైలోని మహిమ్ స్థానం నుంచి పోటీ చేసిన రాజ్ ఠాక్రే కుమారుడు అమిత్ ఠాక్రే కూడా ఓడిపోయారు.మరోవైపు శివసేన (యూబీటీ) కేవలం 20 సీట్లు గెలుచుకున్నది. అయితే ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు, మాజీ మంత్రి అయిన ఆదిత్య ఠాక్రే తిరిగి వర్లీ సీటు నుంచి పోటీ చేసి విజయం సాధించారు. శివసేనకు చెందిన మురళీ దేవరాపై గట్టి పోరులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు.

## అంగీకార శృంగారం రేప్ కాదు వేధింపుల కోసం చట్టాన్ని వాడుకోవద్దు



**న్యూఢిల్లీ-నవభూమి:**పరస్పర అంగీకారంతో జరిగిన శృంగారాన్ని లైంగిక దాడిగా పరిగణించలేమని ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. చట్టంలోని సెక్షన్లను కొందరు పురుషులను వేధించేందుకు ఉపయోగిస్తున్నారని స్పష్టం చేసింది. తనపై నమోదైన రేప్ కేసును కొట్టివేయాలంటూ ఓ యువకుడు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ చంద్రధారి సింగ్‌తో కూడిన ధర్మాసనం యువతి ఉద్దేశపూర్వకంగానే కేసు పెట్టినట్టు స్పష్టమవుతున్నదని పేర్కొంది. ఈ మేరకు యువకుడిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని పోలీసులను ఆదేశించింది.కేసు విచారణ, తీర్పు సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. అత్యాచారం మహిళలపై జరిగే చాలా హేయమైన చర్య. కానీ కొందరు మహిళలు తమతో సంబంధం కలిగిన పురుషుడిని వేధించేందుకు చట్టాన్ని ఆయుధంగా వాడుకుంటున్నారు. యువకుడు సమర్పించిన వాట్సప్ చాటింగ్‌లు, రికార్డింగ్స్ బట్టి చూస్తే ఇద్దరూ పరస్పరం అంగీకారంతోనే శారీరక బంధంలోకి ప్రవేశించినట్టు స్పష్టమవుతున్నది. స్త్రీలు చట్టాన్ని దుర్వినియోగం చేయడం వల్ల పురుషులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారో చెప్పేందుకు ఈ కేసు స్పష్టమైన ఉదాహరణ.ఇలాంటి కేసుల్లో ఫిర్యాదుదారుల ఉద్దేశాలను కూడా కోర్టులు పరిశీలించాలి. అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది యువకుడిపై యువతి తీవ్రమైన ఆరోపణలు చేశారని, కేసును కొట్టివేయవద్దని కోరారు. స్పందించిన న్యాయమూర్తి ఆధారాల ప్రకారం చూస్తే ఇరువురు పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. కానీ కులాలు వేర్వేరు కావడంతో ఇరువురి కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోయినా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమని యువకుడు తెలిపాడు. కానీ ఆమె మరో యువకుడితో పెళ్లికి అంగీకరించడంతో ప్రేమించిన యువకుడితో పెళ్లికి ఆసక్తి చూపలేదు అని న్యాయమూర్తి తెలిపారు. అందువల్ల యువకుడిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ దురుద్దేశపూర్వకమైనదేనని, కాబట్టి కేసు చెల్లదని స్పష్టం చేశారు.


## నమ్మకంపై నిర్మించుకునే బంధమే పెండ్లి'




**న్యూఢిల్లీ-నవభూమి:** పెండ్లి అనేది పరస్పర నమ్మకం, సహచర్యం, పంచుకున్న అనుభవాలపై నిర్మించుకునే బంధమని సుప్రీంకోర్టు పేర్కొన్నది. తమిళనాడుకు చెందిన ఓ జంట 2004 నుంచి విడిగా ఉంటున్నారు. వీరికి 2018లో మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ విడాకులు మంజూరు చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.ఈ పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీబీ వరాలేతో కూడిన ధర్మాసనం విచారించింది. 'వివాహ బంధానికి కీలకమైన పరస్పర నమ్మకం, సహవాసం, అనుభవాలు పంచుకోవడం అనే అంశాలు చాలాకాలం పాటు దంపతుల నడుమ లేకపోతే ఆ వివాహ బంధం కేవలం చట్టపరమైన లాంఛనంగా మారిపోతుంది' అని పేర్కొన్న ధర్మాసనం మద్రాస్ హైకోర్టు తీర్పును సమర్థించింది. భార్యకు భరణం కింద రూ.50 లక్షలు, కూతురి చదువు, పెండ్లి కోసం మరో రూ.50 లక్షలు చెల్లించాలని భర్తను ఆదేశించింది.

## అదృష్టమంటే వారిదే!

**బికనీర్- నవభూమి:**అదృష్టమంటే ఆ కారులోని ప్రయాణికులదే. ఆ ప్రమాద దృశ్యం చూసినవారెవరైనా కారులోని వారంతా చనిపోవడమో, తీవ్రంగా గాయపడటమో జరుగుతుందని భావిస్తారు. అయితే ఒంటిపై చిన్న గాయం కూడా కాకుండా బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. జాతీయ రహదారిపై అతి వేగంగా వస్తున్న ఒక కారు అదుపు తప్పి 8 పల్టీలు కొట్టిన ఘటన రాజస్థాన్‌లోని నాగౌర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులోని ఐదుగురూ ఎలాంటి గాయాలు కాకుండా తప్పించుకోవడం విశేషం.దీనికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో నమోదయ్యాయి. నాగౌర్ నుంచి బికనీర్‌కు ఐదుగురు ప్రయాణికులతో ఒక ఎస్‌యూవీ కారు వెళ్తుండగా, మలుపు తిప్పుతున్న సమయంలో కారుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో సెకన్ల వ్యవధిలో కారు 8 పల్టీలు కొట్టి రోడ్డు పక్కనే ఉన్న ఒక కార్ల షోరూం గేట్‌పై తల్లకిందులుగా పడి ఆగిపోయింది. ప్రమాదం తర్వాత బయటపడ్డ వారు షోరూమ్‌లోకి నడుచుకుంటూ వెళ్లి 'మాకు టీ ఇవ్వండి' అని అడగటం ఆశ్చర్యపరిచింది.



## ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్ల పరిశీలనపై ఆంక్షలు

**న్యూఢిల్లీ-నవభూమి:** ఎన్నికలకు సంబంధించిన సీసీటీవీ, వెబ్‌క్యాస్టింగ్ ఫుటేజీ, అభ్యర్థుల వీడియో రికార్డులు వంటి ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లను ప్రజల పరిశీలన నుంచి నివారించేందుకు ఎన్నికల నిబంధనను కేంద్రం సవరించింది. ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు దుర్వినియోగం కాకుండా అడ్డుకునేందుకే ఈ చర్యను చేపట్టినట్టు ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. ఎన్నికల కమిషన్ సిఫార్సు ఆధారంగా 1961 నాటి ఎన్నికల నిర్వహణ నిబంధనల్లోని 93(2)(ఎ) నిబంధనను కేంద్ర న్యాయ శాఖ శుక్రవారం సవరించింది.
ప్రజల పరిశీలనకు అవకాశం కల్పించే పత్రాలు లేదా డాక్యుమెంట్లపై ఆంక్షలు విధించడమే ఈ సవరణ ఉద్దేశం. 93 నిబంధన ప్రకారం ఎన్నికలకు సంబంధించిన అన్ని పత్రాలను ప్రజలు పరిశీలించవచ్చు. పత్రాలు అన్న పదం తర్వాత నిబంధనలు నిర్దేశించినట్టుగా అన్న పదాన్ని ప్రభుత్వం ఇప్పుడు ఈ నిబంధనలో చేర్చింది. ఎన్నికల పత్రాలు, డాక్యుమెంట్లు ప్రజలకు అందుబాటులో ఉంటాయని, పోలింగ్ స్టేషన్ల సీసీటీవీ ఫుటేజీ దుర్వినియోగం కారాదన్న ఉద్దేశంతో ఆ ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లను మాత్రం ప్రజల పరిశీలనలో ఉంచబోమని ఆయన స్పష్టం చేశారు.

# బీమా స్ఫూర్తిని కూలదోసే చట్ట సవరణలు!

ఇన్సూరెన్స్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎఫ్‌డిఐ) 74శాతం నుంచి 100 శాతానికి పెంచనున్న ప్రతిపాదనలపై డిసెంబర్ 10లోపు ప్రజల నుంచి అభిప్రాయాలు కోరుతూ ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డిఎఫ్ఎస్) ఓ ప్రకటన చేసింది. ఆర్థిక అంశాల మీద ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే అవకాశాలు ఈ దేశంలో చాలా తక్కువ. నిజంగా అలాంటి అభిప్రాయాలు స్వీకరించాలనుకుంటే ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ఏజెంట్లు, ఏజెంట్ల సంఘాలు, పాలసీదారులు, ఇతరత్రా మేధావుల నుంచి సేకరిస్తే ప్రయోజనం ఉండేది.జీవిత భీమా ప్రణాళిక
ప్రజాభిప్రాయ సేకరణకు ప్రాధాన్యతనిచ్చే ప్రభుత్వాలే అయితే 1998లోనే దేశవ్యాప్తంగా ఒక కోటీ 65 లక్షల సంతకాలు సేకరించి ఇన్సూరెన్స్ రంగంలో ప్రైవేట్ కంపెనీలకు అవకాశం ఇవ్వొద్దని అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి గారికి సమర్పించడం జరిగింది. ఇంకా అనేక సందర్భాలలోనూ సదరు ఎఫ్‌డీఐలు ఏ విధంగా సేవల రంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్న ఇన్సూరెన్స్ రంగానికి నష్టం కలిగిస్తాయో కూడా ప్రభుత్వాలకు విడమర్చి చెప్పడం జరిగింది. ఇన్సూరెన్స్ రంగంలో ఎఫ్‌డీఐ పెంపుదలపై ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ ముందు కూడా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్ అమానుల్లా ఖాన్, కామ్రేడ్ కె.వేణుగోపాల్ తమ వాదనలు వినిపించి ఒప్పించారు కూడా. కానీ ఇలాంటి ఏ సందర్భంలోనూ ప్రజాభిప్రాయానికి గానీ సంఘాల అభిప్రాయాలకు గానీ విలువ ఇవ్వకుండా ఇప్పటి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇన్సూరెన్స్ రంగంలోకి ఎఫ్‌డీఐలను క్రమం తప్పకుండా పెంచుతూనే ఉంది.
1990 తర్వాత నూతన ఆర్థిక విధానాలలో భాగంగా ఇన్సూరెన్స్ రంగంలోనికి ప్రైవేట్ వ్యక్తులు ప్రవేశించే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. 1995 వరకు ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో నడిచే ఇన్సూరెన్స్ రంగాన్ని రెగ్యులేట్ చేయడం కోసం ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ (ఐఆర్ఏ) అనే ప్రతిపాదనను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. పార్లమెంట్‌లో ఈ బిల్లును పాస్ చేయించడం కోసం నాటి ఆర్థిక మంత్రులు ఐకే గుజ్రాల్, పి.చిదంబరం వేరు వేరు సందర్భల్లో ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. 1999లో అధికారంలోకి వచ్చిన వాజ్‌పేయి ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ఐఆర్ఏ అనే పదాన్ని ఐఆర్‌డీఏ (ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ)గా నామకరణం చేస్తూ పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ సాయంతో బిల్లును ఆమోదింపజేసుకున్నది. ఈ బిల్లు పాస్ అయినప్పుడు ఇన్సూరెన్స్ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలు రావచ్చు అయితే 26 శాతం మాత్రమే ఎఫ్‌డీఐలు ఉండాలన్న నిబంధన ఉంచారు. ఆశించిన మేర ప్రైవేట్ కంపెనీలు నమోదు కాకపోవడంతో ఎఫ్‌డీఐని మరింత పెంచాలని తద్వారా ఫారిన్ కంపెనీస్ వస్తాయని చాలా ప్రయత్నాలు చేశారు. కానీ యూపీఏ%-%1 ప్రభుత్వానికి ప్రభుత్వ రంగాలకు పెద్దపీట వేసే వామపక్ష పార్టీల మద్దతుతో ఉండడంతో అది సాధ్యపడలేదు. మళ్ళీ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత 2015లో ఎఫ్‌డీఐ 26 నుండి 49 శాతానికి పెంచారు. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదనే నెపంతో 2021లో దీనిని 74 శాతానికి కూడా పెంచారు. ఆ తర్వాత కూడా ఈ 25 ఏళ్ల కాలంలో అన్ని ప్రైవేట్ కంపెనీలు కలిపి 25 సంఖ్యను కూడా చేరుకోలేకపోయాయి. అంచేత ఇప్పుడు ఇన్సూరెన్స్ రంగంలో వందశాతం ఎఫ్‌డీఐలను పెంచడం ద్వారా పుట్టగొడుగుల్లా ప్రైవేట్ కంపెనీలు వెలసి ఇన్సూరెన్స్ రంగాన్ని అభివృద్ధిపరచగలవని కేంద్ర ప్రభుత్వం గాలిలో మేడలు కడుతున్నది. అనగా ఇకపై దేశీయ భాగస్వామ్యం కలిగిన కంపెనీలేవీ ఇన్సూరెన్స్ రంగంలో ఉండకుండా విదేశీ కంపెనీలు తమ దుకాణాలను ఇక్కడ తెరవవచ్చు.ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ఇన్సూరెన్స్ చట్టాల సవరణ బిల్లులో అనేక ప్రమాదకర ప్రస్తావనలు ఉన్నాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రారంభించాలంటే వంద కోట్ల కనీస మూలధనం అవసరం. ఇప్పుడు దాన్ని తగ్గించాలన్న ప్రతిపాదన ఇందులో ఉన్నది. ఎల్ఐసీ ఆఫ్ ఇండియా పూర్తి ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్నది కాబట్టి వంద కోట్ల మూలధనం అవసరం లేదని మొర పెట్టుకున్నా వినకుండా ఎల్ఐసీ ఆఫ్ ఇండియా నుంచి వంద కోట్ల మూలధనాన్ని ఏర్పాటు చేయించారు. ఇప్పుడు ఇదే నిబంధనను విదేశీ కంపెనీలను సంతృప్తిపరచడం కోసం తొలగిస్తున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు సింగల్ రిజిస్ట్రేషన్‌తో లైఫ్, జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ వ్యాపారం చేసుకోవచ్చు. ఈ కాంపోజిట్ లైసెన్స్‌తో అడ్వర్స్ (నష్టదాయకమైనది) సెలక్షన్ జరగవచ్చనే ఆలోచనకు చరమగీతం పాడుతున్నారు. ఇన్సూరెన్స్ ఏజెంట్లు కూడా మూడు లైఫ్ ఇన్సూరెన్స్, మూడు జనరల్ ఇన్సూరెన్స్, మూడు హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఒకే లైసెన్స్‌తో పనిచేయవచ్చని మరో ప్రతిపాదన చేశారు. దీంతో ఏజెంట్ల వ్యవస్థ అస్తిత్వం ప్రమాదంలో పడనున్నది. ఇన్సూరెన్స్ సంస్థలు తమ ప్రధాన విధి అయినటువంటి బీమా కల్పనతో పాటు ఇతర ఇండెమినిటీ వ్యాపారాలు, ఆస్తిపాస్తుల అమ్మకాలు కొనుగోళ్లు వంటి ఇతర వ్యాపారాలు కూడా చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. దీనిద్వారా ప్రధాన ధ్యేయం పక్కదారి పడుతోంది. బీమా 'సుగమ్' పేరున 'ఇన్సూరెన్స్ సొల్యూషన్స్ ఫ్రమ్ వన్ ప్లేస్' అనే ప్రతిపాదన ద్వారా ఇన్సూరెన్స్ మూలసూత్రాలు, విలువలు ప్రమాదంలో పడనున్నాయి. ఇలాంటి సరళీకరించబడిన విధానాలు ప్రైవేట్ కంపెనీలకు లాభాల కోసం ఎంతకైనా ఒడిగట్టే అవకాశాన్ని ఇస్తాయి. దీర్ఘకాలిక కాంట్రాక్టులకు ఆలవాలమైన ఇన్సూరెన్స్ రంగంలో ఇలాంటి సరళీకరణ విధానాలు ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఇలాంటి కీలక అంశంపై ప్రజల నుండి మొక్కుబడి అభిప్రాయాన్ని సేకరణలు కాకుండా ఇన్సురెన్స్ రంగంలోని సంఘాలతో చర్చిస్తే మంచిది.

# మెరుగైన సైబర్ ప్రపంచ దిశగా!



మూడు దశాబ్దాలక్రితం సాధారణ ప్రజానీకానికి అందుబాటులోకొచ్చి, ఎప్పటికప్పుడు సరికొత్త సాంకేతికతలతో అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ వర్తమాన ప్రపంచంలో శక్తిమంతమైన సాధనం. పౌరహక్కులతో, భావప్రకటనా స్వేచ్ఛతో ముడిపడి ఉన్న ఆ సాధనం భౌగోళిక సరిహద్దులను చెరిపి, సమస్త ప్రపంచాన్నీ ఒక్కటి చేసింది. ఏ రకమైన అంతరాలకూ తావీయని విశ్వ వేదికగా రూపుదిద్దుకుంది. అయితే ఆ వేదికను ఆంక్షల చట్రంలో బంధించాలని చూసే ప్రభుత్వాలూ, ఫక్తు వ్యాపార ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసే సంస్థలూ అదును కోసం నిరంతరం కాచుక్కూర్చుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా, యూరప్ ఖండ దేశాలతోపాటు ఆస్ట్రేలియా, న్యూజి లాండ్, జపాన్ తదితర దేశాలు గురువారం ఇంటర్నెట్‌పై ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. దాదాపు 60 దేశాలున్న ఆ బృందంలో మన భాగస్వామ్యం లేకపోవడం కొంత బాధాకరమే. ఇంటర్నెట్‌ను ఆపిన ఘటనలు అంతక్రితంతో పోలిస్తే మన దేశంలో నిరుడు తక్కువే అయినా వరసగా నాలుగేళ్ల డేటా గమనిస్తే ప్రపంచంలో ఇప్పటికీ ఇతరులకన్నా ఎక్కువసార్లు దాన్ని నిలుపుదల చేసిన ఘనత మనదే. పెత్తందారీ వ్యవస్థలున్న చైనా, రష్యా, కొన్ని అరబ్ దేశాల గురించి చెప్పనవసరం లేదు. ఇంటర్నెట్‌లో వచ్చిపడే సమాచారాన్ని జల్లెడపట్టి, తమకు చేటు తెస్తాయన్న వాటిని ఏరిపారేయడం అక్కడ నిత్యకృత్యం. ఇక 'అత్యంత ప్రజాస్వామిక దేశం'గా ముద్ర ఉన్న అమెరికా తన చీకటిమాటు వ్యవహారాలను బట్టబయలు చేసిన వికీలీక్స్ అధినేత జూలియన్ అసాంజ్‌ను ఈనాటికీ ఎట్లా వెంటాడుతున్నదో తెలుస్తూనే ఉంది. అందుకే ఇప్పుడు వెలువడిన డిక్లరేషన్‌పై పెదవి విరిచేవారున్నారు. కానీ ఏదీ ఒకేసారి మారదు. నిలదీయడం, ఒత్తిళ్లు తీసుకు రావడం ఆలస్యంగానైనా మంచి ఫలితాలకు దారితీస్తాయి. ఇంటర్నెట్ మాధ్యమం పులుగడిగిన ముత్యమనీ, అక్కడంతా సవ్యంగా ఉన్నదనీ చెప్పలేం. ఆ వేదికగా ఊరేగుతున్న సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాలుంటాయి. జుగుప్సాకరమైన అశ్లీలత, విరుచుకుపడే విద్వేషం, బాధ్యతారహిత పోకడలు అక్కడ రివాజు. కొత్తగా సైబర్ ప్రపంచంలోకి అడుగుపెట్టాలని ఉత్సాహపడేవారికి మారీచులనుంచీ, దుశ్శాసనులనుంచీ, కీచకులనుంచీ సమస్యలు పొంచివుంటాయి. కనుక ప్రజల భద్రతకూ, సామాజిక ప్రశాంతతకూ అవసరమైన నిబంధనలు విధించడం, నయవంచకుల పనిబట్టడం ఎంతో ముఖ్యం. సామాజిక మాధ్యమాలకు జవాబుదారీతనం ఉండేలా, తప్పుడు రాతలపైనా, దృశ్యాలపైనా, మాయగాళ్లపైనా ఎప్పటికప్పుడు నిఘా వేసి ఏరిపారేసేందుకు అవసరమైన యంత్రాంగాలను అవి ఏర్పాటు చేసుకొనేలా ఒత్తిళ్లు తీసుకురావాలి. ఫిర్యాదులొచ్చిన మరుక్షణమే రంగంలోకి దిగి నేరగాళ్లను పట్టుకునేలా రక్షకభట వ్యవస్థను తీర్చిదిద్దాలి. చిత్రమేమంటే చాలా దేశాల్లోని ప్రభుత్వాలకు ఇలాంటి విపరీత పోకడల గురించి పెద్దగా చింత ఉన్నట్టు కనబడదు. తమ అప్రజాస్వామిక ధోర ణులను ప్రశ్నించే, తమ పాలనలోని నిర్వాకాలను బట్టబయలు చేస్తున్నవారిపైనే వాటి దృష్టి పడుతుంది. మన దేశం వరకూ తీసుకుంటే ఇప్పటికీ సైబర్ మాయగాళ్ల వలలో చిక్కుకుని బిట్ కాయిన్ల పేరుతో, అనేక రకాల స్కీముల పేరుతో అనేకమంది నిత్యం కోట్లాది రూపాయలు కోల్పోతున్నారు. యువతులూ, చిన్న పిల్లలూ ప్రమాదకర పరిస్థితుల్లో పడుతున్నారు. సైబర్ ప్రపంచంలో భావప్రకటనా స్వేచ్ఛకూ, వ్యక్తి స్వాతంత్ర్యానికీ అనువైన వాతావరణాన్ని సృష్టించి, ప్రజాస్వామిక వ్యవస్థల పటిష్టతకు తోడ్పడే విధంగా దాన్ని తీర్చిదిద్దితే... పౌరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలగనీయని విధంగా దానికి మెరుగులు పెడితే అన్ని వర్గాలవారూ ఎదగడానికి ఉపయోగపడుతుంది. ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా మెలగక తప్పని పరిస్థితులు ఏర్పడతాయి. ప్రపంచ దేశాలు ఇంటర్నెట్‌ను గుప్పెట్లో పెట్టుకోవాలని ఎలా ప్రయత్నిస్తున్నాయో, నిరసననూ, అసమ్మతినీ ఎలా అణచివేస్తున్నాయో సైబర్ ప్రపంచంలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు బయటపెడుతున్నాయి. ఇప్పుడు వెలువడిన డిక్లరేషన్ స్వాగతించదగిన పరిణామమే అయినా అలాంటి సంస్థల అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకుని ఉంటే మరింత బాగుండేది. దాదాపు 80 ఏళ్లక్రితం రెండో ప్రపంచ యుద్ధ సందర్భంలో నిఘా సమాచారాన్ని పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడానికి ఏర్పాటైన 'ఫైవ్ అయిస్'(అయిదు నిఘా నేత్రాలు) కూటమి ఇప్పటికీ సజావుగా తన కార్యకలాపాలు సాగిస్తోంది. 2001లో అమెరికా 'ఉగ్రవాదంపై యుద్ధం' ప్రకటించాక డిజిటల్ నిఘాలో అది కొత్త కొత్త పోకడలు పోతోంది. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడాలు భాగస్వాములుగా ఉన్న ఆ కూటమిలోనివారే ఈ డిక్లరేషన్‌లో భాగస్వాములైన తీరు ప్రశ్నలు రేకెత్తించడంలో వింతేమీ లేదు. అన్నిటిపైనా చర్చలు జరగాల్సిందే. పౌరుల డేటాను దొంగిలించడం, తమ కంట్లో నలుసుగా తయారైనవారిపై పెగాసస్ వంటి ఉపకరణాలద్వారా కుట్రలకు దిగి ఖైదు చేయడంవంటి

# రైతు బతుకులు బాగు పడే దెప్పుడు



**డిసెంబర్ 23 కిసాన్ దినోత్సవం సందర్భంగా....**
వ్యవసాయ విధానాలను రూపొందించడంలో, రైతుల సాధికారతలో కీలక పాత్ర పోషించిన చౌదరి చరణ్ సింగ్ గౌరవార్థం భారత ప్రభుత్వం 2001లో తొలిసారిగా కిసాన్ దివస్ ను నిర్వహించింది. గ్రామీణ భారతదేశం సవాళ్లపై అవగాహనకు ప్రసిద్ధి చెందిన సింగ్ రైతుల జీవితాలను మెరుగుపరచడానికి, సుస్థిర వ్యవసాయ అభివృద్ధిని నిర్ధారించడానికి అనేక విధానాలను ప్రవేశపెట్టారు. గ్రామీణ సమాజాల సాధికారత, స్వావలంబన వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను పెంపొందించాలని ఆయన విశ్వసించారు. రైతుల జీవితాలను మెరుగుపరచడానికి అలుపెరగని కృషికి పేరుగాంచిన ఆయన భారతదేశంలో భూసంస్కరణలు, గ్రామీణ రుణ ఉపశమనంలో కీలక పాత్ర పోషించారు. అందుకే ఆయనను "ఛాంపియన్ ఆఫ్ ఇండియాస్ ఫార్మర్స్" అని పిలుస్తారు. 2024లో కిసాన్ దివస్ లేదా జాతీయ రైతు దినోత్సవ థీమ్ "సుస్థిర వ్యవసాయం కోసం రైతులను శక్తివంతం చేయడం"

**రైతే దేశానికి వెన్నెముక:**
రైతు శ్రేయస్సే జాతి శ్రేయస్సు. రైతులు జాతికి ఆత్మ. అందరి కడుపులు నింపేవాడు. వ్యవసాయం తప్ప ఇంకో పని తెలియనివాడు. తన కష్టాన్ని మాత్రమే నమ్ముకున్నోడు. నిత్య కృషీవలుడు. పండించడం మాత్రమే తెలిసినోడు. చలైనా, ఎండైనా, వర్షమైనా రైతుకు ఒక్కటే ! కాలంతో పనిలేకుండా తన పొలంలో విత్తడం, దున్నడం, కోయడం చేసుకుంటాడు.
ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద వ్యవసాయ యోగ్యమైన భూమిని కలిగి ఉన్న మన దేశం ఆర్థిక వ్యవస్థలో ముఖ్యపాత్ర పోషిస్తూ ప్రజల ఆహారవసరాలు తీర్చే వ్యవసాయం గ్రామీణ ప్రజానీకానికి వెన్నెముక. దేశ మొత్తం భూభాగంలో వ్యవసాయ అవసరాల కోసం దాదాపు 60 శాతం భూభాగం వినియోగించ బడుతున్నది. ఉపాధి, ఉత్పత్తి పరంగా ఆర్థిక వ్యవస్థకు ప్రధానమైనది. యాభై యెనిమిది శాతానికి పైగా గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయమే ఆధారం. గ్రామాలలోనే నివసిస్తున్న 72.8% మంది జనాభాలో ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ యాభై శాతానికి పైగా ప్రజలకు జీవనోపాధిని అందిస్తుంది. మొత్తం శ్రామిక శక్తిలో యాభై యెనిమిది శాతం ఈ రంగంలోనే



ఉన్నారు. దేశ జిడిపిలో వ్యవసాయ వాటా సుమారు పద్దెనిమిది శాతం. ఆహార పరిశ్రమల ముడిపదార్థాలకు మూలం.
అధిక జనాభాతో అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రజల ఆహార భద్రతను నిర్ధారించడంలోను, పరిశ్రమలు సేవారంగాల వృద్ధికి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుంది. గ్రీన్హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి, జీవవైవిధ్యాన్ని రక్షించడానికి వ్యవసాయం సహాయపడుతుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన వ్యవసాయరంగానికి రైతన్నే కీలకం.

**సవాళ్ళు:**
వ్యవసాయం పర్యావరణ, ఆర్థిక, సంస్థాగత, సాంకేతికతపరంగా ఎన్నో ఆటుపోట్లకు గురవుతున్నది. రైతులు వ్యవసాయంలో ఉత్పాదకత, లాభదాయక జీవననాణ్యతకు ఆటంకం కలిగించే అనేక సవాళ్లను ఎదుర్కుంటున్నారు. విత్తు నుండి కోత వరకూ రోజూ రైతుకు ఒత్తిడే. సాగుభూమి
చిన్నాభిన్నంగా చిన్న కమతాలుగా మారడం, నాణ్యమైన విత్తనాల కొరత, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు పంట ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపి దిగుబడి తగ్గి వ్యవసాయ ఉత్పాదకత తగ్గుతుంది. సరైన పంట ఉత్పత్తి కాక రైతులు ఉసూరుమంటున్నారు. ఎక్కువ శాతం వ్యవసాయం వర్షాధారమే! 14.1కోట్ల హెక్టార్ల స్థూల విత్తన విస్తీర్ణంలో 52 శాతం అంటే 7.3 కోట్ల హెక్టార్లు నీటిపారుదల సౌకర్యాన్ని కలిగి ఉందని నీతి ఆయోగ్ తెలిపింది. అరవై ఐదు శాతం వ్యవసాయం ఋతుపవన వర్షపాతంమే ఆధారం. మొత్తం నీటిపారుదల ప్రాంతంలో 40 శాతం కాలువల మీద, మిగిలినది భూగర్భ జలాల మీద ఆధారపడి ఉంది. ఋతుపవనాలలో యేమాత్రం తేడా వచ్చి సరైన సమయంలో వర్షం పడకపోతే కాలువల మీద ఆధారపడిన ప్రాంతంలో కూడా పంటలు పండవు. ఇక కాలువేతర ప్రాంతాలలో కేవలం భూగర్భజలాలే ఆధారం. అతివృష్టి, అనావృష్టి , పంట ఉత్పత్తిపై ప్రభావం చూపి ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి ఏటా అస్థిరత్వానికి గురవుతోంది. భూ వనరులపై అధిక జనాభా ఒత్తిడి కారణంగా వర్షాధార ప్రాంతాలు, ముఖ్యంగా పొడి భూములు తక్కువ దిగుబడిని ఎదుర్కొంటున్నాయి. వరి, గోధుమలు, పత్తి, నూనె గింజలతో సహా భారతీయ పంటల దిగుబడులు అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. హరిత విప్లవం, అస్తవ్యస్త నీటిపారుదల వ్యవసాయ పద్ధతులు భూమి క్షీణతకు దారితీశాయి. మానవ కార్యకలాపాల వల్ల వర్షాధార ప్రాంతాలు కూడా నేల కోతను క్షీణతను ఎదుర్కొంటుంది. ఒకే పంటను పదే పదే సాగుచేయడం వల్ల నేల పోషకాలను కోల్పోయి నిస్సారంగా మారింది. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల ధరతో పాటుగా లేబర్ ఛార్జీలు కూడా పెరుగుతున్నాయి. పంట పెట్టుబడికి రైతులు అధిక వడ్డీకి రుణాలు వాడుతున్నారు. పంట నష్టపోవడం, పంటలకు గిట్టుబాటుధర లేకపోవడం, అధిక ఖర్చులు వలన సగానికి పైగా వ్యవసాయ కుటుంబాలు అప్పుల పాలవుతున్నారు. చాలా మంది అనధికారిక వనరుల నుండి రుణాలు పొందుతున్నారు. వాణిజ్యపంటలు సాగుచేసే రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. కరువు, పంట నష్టాలు వలన అప్పుల ఊబిలో కూరుకుపోయి ఒక్కోసారి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అసమర్థమైన వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలు ధరల అస్థిరతకు దారితీస్తాయి. సరైన నిల్వ, రవాణా సౌకర్యాలు లేకపోవడం వలన రైతులు వెంటనే తక్కువ ధరకే ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. ఇది పంట అనంతర నష్టాలను మరింత పెంచుతుంది. వీరు పండించే పంటలను విక్రయించడానికి ఇప్పటికీ దళారులపైనే ఆధారపడుతున్నారు. దళారులు రైతులను మోసం చేస్తున్నారు. నేరుగా మార్కెటింగ్ విధానం లేకపోవడం వలన వచ్చే ఆదాయంలో కొంత భాగం మధ్యవర్తుల పాలవుతున్నది. ప్రస్తుతం ఉన్న పంటల విధానం కొన్ని ప్రధాన పంటల వైపు మాత్రమే మొగ్గుచూపే విధంగా ఉన్నాయి. పంటలలో వైవిధ్యం లేకపోవడం వల్ల వ్యవసాయ రంగం తెగుళ్లు, వ్యాధులు, మార్కెట్ ఒడిదుడుకుల బారినపడుతుంది. సాగులో ఆధునిక సాంకేతికలు అమలు పరచడం లేదు. అందరూ స్వంత వ్యవసాయ కమతాలు కలిగి ఉండరు. ఇంకో పెద్ద రైతు దగ్గర వ్యవసాయ క్షేత్రాన్ని కౌలుకు తీసుకుంటారు. పంట సరిగా పండకపోతే వీరు మరింత పేదరికంలోనికి నెట్టబడుతున్నారు.

**పరిష్కారాలు:**
సవాళ్లను పరిష్కరించడానికి బహుముఖ విధానం అవసరం. వ్యవసాయంలో సాంకేతికతను జోడించి ఖర్చులను కనిష్ఠం చేసే మార్గాలను ప్రవేశపెట్టాలి. వ్యవసాయ పనితీరును మెరుగు పరచడం, ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వం, గ్రామీణాభివృద్ధికి భరోసా ఇవ్వడానికి ఈ సవాళ్లను పరిష్కరించడం అత్యవసరం. ఇటు రైతు అటు ప్రభుత్వాలు వ్యవసాయానికి రెండు చక్రాల్లాంటి వారు. రైతులు.నేల క్షీణతను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవాలి. పర్యావరణ అనుకూల పద్ధతులు పాటించాలి. డ్రిప్, స్ప్రింక్లర్ సిస్టంలతో సహా, సమర్థవంతమైన నీటి నిర్వహణ పద్ధతులు అవలంబించాలి. విభిన్న పంటరకాలు, పద్ధతులను అనుసరించాలి. సేంద్రీయ ఎరువులు వాడాలి. ఇక ప్రభుత్వపరంగా సమర్థవంతమైన నీటిపారుదల పద్ధతులు, వర్షపునీటి సంరక్షణను అమలు చేయాలి. తీవ్రమైన వాతావరణ సంఘటనల కోసం ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను అందుబాటులోకి తేవాలి. ఆహారోత్పత్తిని పెంచేందుకు ఎప్పటికప్పుడు నిర్ణయించే ఆహార ధాన్యాల ధరలకు తగిన ప్రోత్సాహాన్ని అందించడం ద్వారా వారు సహేతుకమైన ఆదాయాన్ని పొందేలా చూడాలి. పారదర్శక సరసమైన ధరల విధానాలను ఏర్పాటు చేయాలి. మెరుగైన ధరల ఆవిష్కరణ కోసం సమర్థవంతమైన మార్కెట్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. రైతులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నేరుగా విక్రయించే ఏర్పాట్లు చేయాలి. రైతులకు ఆర్థిక సహాయం మరింత చేయాలి. రైతులు అధునాతన వ్యవసాయ సాంకేతికతలు అంది పుచ్చుకోడానికి డిజిటల్ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందించాలి. భారతీయ వ్యవసాయం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి, సుస్థిరతను ప్రోత్సహించడానికి, ఉత్పాదకతను పెంచడానికి, దేశవ్యాప్తంగా రైతుల జీవనోపాధిని మెరుగు పరచడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి.

జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

# శ్రుతి-స్మృతి-పురాణం

భక్తి




శ్రుతి (వేదం), స్మృతి (ధర్మశాస్త్రం), పురాణం... ఒకదాన్ని మరొకటి అనుసరిస్తాయి. ఈ మూడింటిలోనూ చెప్పిన విషయం ఒకటే. కానీ తెలుసుకునేవారి స్థాయిని బట్టి చెప్పే తీరు మారుతుంది.
శ్రుతి చెప్పిన విషయాన్ని బాగా అర్థమయ్యేలా, అది చిరకాలం జ్ఞాపకం ఉండేట్లుగా భూతద్దంలో చూపించినట్లు విస్తారమైన వివరణ ఇస్తుంది స్మృతి.
స్మృతి చెప్పిన విషయాలను మరింత సరళతరం చేసి అందరికీ అర్థమయ్యే రీతిలో చెబుతాయి పురాణాలు. వేదవ్మాయం అత్యంత ప్రాచీనమైంది. వాటిని సృష్టించినవారు మానవులు కాదు (అపౌరుషేయాలు). కాబట్టి సంస్కృతి-ప్రవర్తన, నడక-నడత, జీవనవిధానం, విజ్ఞానం-వినాశనం, పురోగమనం-తిరోగమనం... లాంటి ఎన్నో విషయాలపట్ల కచ్చితమైన స్పృహ కలిగేటట్లు చేస్తాయవి. వాటిని చదవడానికి, అర్థం చేసుకోవడానికి విద్య, పరిజ్ఞానం, ఆసక్తి లాంటివి ఎక్కువ మోతాదులో ఉండాలి. చాలామందికి అవి సరిపోయినంత ఉండకపోవచ్చు. అందువల్ల వాటి ప్రయోజనం నెరవేరడానికి అవకాశం తక్కువ కావచ్చు.
ఆ పరిస్థితి నుంచి తప్పించడానికి వేదాల సారాన్నంతా ధర్మశాస్త్రాల రూపంలోకి మార్చి చెప్పారు మహర్షులు. ఆ విషయాలనే సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రాసినవి పురాణాలు. పురాణం అంటే పూర్వం (ఇంతకుముందు) జరిగిన విషయం అని ఒక అర్థం.
పురుషార్థాలను సాధించడానికి, ఏది ధర్మం-ఏది అధర్మం... అనే స్పృహ కలిగించడానికి పురాణజ్ఞానం ఎంతైనా అవసరమని ఆర్యోక్తి.
'పురాపి నవం' (పాతదైనప్పటికీ కొత్తది) అని పురాణ పదానికి నిర్వచనం. అంటే ఎప్పుడో చెప్పినప్పటికీ ఇప్పటికీ ఉపయోగకరంగా ఉంటుందని భావం. అంటే ఏ కాలానికైనా సరిపోయే విషయాలు కలిగి ఉంటాయి అని అర్థం. అలాంటి పురాణాలు పద్దెనిమిది.
అవి- భాగవత, భవిష్య, మత్స్య, మార్కండేయ, బ్రహ్మ, బ్రహ్మ వైవర్త, బ్రహ్మాండ, విష్ణు, వరాహ, వామన, వాయు, అగ్ని, నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కాంద పురాణాలు. వీటితోపాటు అదే సంఖ్యలో ఉప పురాణాలు ఉన్నాయి. ఇవన్నీ వ్యాసుడు రచించాడని ప్రసిద్ధి.
జీవుడు ఏ శరీరం పొందాడు, ఈ శరీరంతో ఏం చెయ్యాలి, ఏం చేస్తున్నాడు? సన్మార్గంలో పయనిస్తే ఏం జరుగుతుంది లేకపోతే పరిణామాలు, వాటికి నివారణోపాయాలు ఏమిటి? ఏం చేస్తే ఈ శరీరం వదిలి ఇంకో శరీరంలోకి వెళ్తాడు? మళ్ళీ ఎలాంటి శరీరాన్ని పొందుతాడు? ఏం చేస్తే ఈ శరీర సంస్కారాలు (మంచి, చెడులు) అవతలి శరీరంలోకి వెళ్తాయి? మళ్ళీ ఆ సంస్కారం పోగొట్టుకోవడానికి లేదానిలబెట్టుకోవడానికి ఎలాంటి సాధన చెయ్యాలి? చేసిన పాపపుణ్యాలకు వాళ్ళు ఉత్తర జన్మల్లో ఏ శరీరం పొందుతారు? ఆ జన్మలో తరించిపోతారా? లేక ఇంకా జన్మలు ఎత్తవలసి ఉందా? ఇప్పటికీ ఏదైనా జన్మ వాసనా బలం వారిని వెంటాడుతూ ఉందా? ఉంటే అది ఎలా తొలగిపోతుంది...చివరిగా పరమేశ్వరుడిలో లీనమైపోవడానికి ఎంత కష్టపడవలసి ఉంటుంది? ఇటువంటి విషయాలను పురాణాలు వివరిస్తాయి.
అలాంటి పురాణాల్లో భాగవతాన్ని మొదటిదానిగా పేర్కొన్నారు. దానికి గల కారణాన్ని పరిశీలిస్తే- ఇందులో చెప్పిన విషయాలు, కథలు, విశేషాలు మొదలైనవన్నీ భక్తి, జ్ఞాన, వైరాగ్యభరితాలే. వాటితోపాటు చతుర్విధ పురుషార్థాల్లోని ధర్మార్థకామాలను నిర్వర్తిస్తూ మోక్షప్రాప్తికి మార్గం చూపేవి. ఈ మూడింటినీ వివరించి ఎవరు ఏ మార్గంలో పయనించాలో నిర్ణయించుకునే స్వాతంత్ర్యాన్ని వారివారి బుద్ధికుశలతకే వదిలేసి స్వేచ్ఛనిచ్చింది భాగవతం. అందుకే అది ఎక్కువ మంది చదివే పురాణం, అందునా వాటిలో మొదటిదైంది!

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 హైదరాబాద్
సోమవారం
23 । డిసెంబర్ । 2024


## చియాతో చలికి చెక్!

సాధారణంగా చల్లటి వాతావరణంలో నీళ్లు తక్కువగా తాగుతుంటారు. ఫలితంగా శరీరం డీహైడ్రేషన్‌కు గురవడంతోపాటు జీర్ణక్రియ మందగిస్తుంది. ఈ రెండు సమస్యలకూ 'చియా సీడ్స్' చక్కని పరిష్కారం చూపుతాయి. ఒక గ్లాస్ నీటిలో రెండుమూడు టేబుల్ స్పూన్ల చియా విత్తనాలు వేసి.. రాత్రంతా నానబెట్టాలి. ఆ నీటిని ఉదయం పరగడుపునే తాగితే.. శరీరం రోజంతా హైడ్రేటెడ్‌గా ఉంటుంది. పీచు పదార్థం పుష్కలంగా లభించి.. జీర్ణక్రియ ఆరోగ్యం మెరుగుపడుతుంది. మలబద్ధకం నుంచీ ఉపశమనం లభిస్తుంది. చలికాలంలో చర్మ సమస్యలు ఎక్కువగా వేధిస్తుంటాయి. చియా విత్తనాల్లో ఉండే యాంటి ఆక్సిడెంట్లు.. చర్మం తేమను కోల్పోకుండా కాపాడుతాయి. చర్మ సమస్యలను దూరం చేయడంతోపాటు చర్మంపై మచ్చలను తగ్గించేందుకూ సాయపడుతాయి. ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు చర్మ సంరక్షణలోనూ ముందుంటాయనీ, చర్మం పొడిబారడాన్ని తగ్గిస్తాయనీ జర్నల్ ఆఫ్ డెర్మటోలాజికల్ సైన్స్ పరిశోధన చెబుతున్నది. చియా గింజల్లో యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి ఫ్రీ రాడికల్స్ నుంచి శరీరాన్ని రక్షించడంలో సాయపడతాయి. ఇందులోని యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి క్యాన్సర్ లక్షణాలు.. కణాల నష్టాన్ని నివారిస్తాయి. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అంటేనే.. సాల్మన్ చేపలు గుర్తొస్తాయి. కానీ, వాటిలో కంటే ఎక్కువగా చియా విత్తనాల్లోనే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో, వాపును తగ్గించడంలో, మెదడు పనితీరును మెరుగుపరచడంలో కీలకంగా వ్యవహరిస్తాయి. క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలోనూ ముందుంటాయి.

# యాదోకీ బారాత్



జ్ఞాపకం మనసు పొరల్లో రికార్డ్ చేసిన ఓ సందర్భం మాత్రమే కాదు. అలా ఉండేందుకు మెదడేమీ హార్డ్ డిస్క్ కాదు. జ్ఞాపకంతోపాటు దాని తాలూకు ఉద్వేగాలు కూడా నిలిచి ఉంటాయి. రంగు, రుచి, వాసనలు తోడవుతాయి. తొలి జ్ఞాపకమైన అమ్మ చీర దగ్గర్నుంచీ, ప్రియురాలి ఎడబాటు వరకూ ఇష్టమైన హోటల్లో ఇడ్లీ సాంబార్ నుంచి చివరిసారి తిరుపతికి వెళ్లిన ట్రైన్ వరకూ అన్నీ అద్భుతమైన జ్ఞాపకాలే! వాటిని తలుచుకుంటే ఏదో తృప్తి. ఆనాటి బాధ కూడా తెలియని సంతృప్తిని ఇస్తుంది. గత సంతోషాన్ని తలుచుకున్న కొద్దీ అది రెట్టింపవుతుంది.

ఆలోచిస్తే ఆ జ్ఞాపకాలకు కూడా మనతోపాటు ఓ సమాంతర జీవితం ఉంటుందేమో! అవమానపడిన చోటే గౌరవం దక్కితే ఓ అద్భుతమైన ముగింపు దక్కినట్టే కదా! శ్రమకోర్చి పెంచిన పిల్లలే మనల్ని పసిపాపల్లా సాకితే ఓ వలయం పూర్తయినట్టే కదా! అందుకే ఈ నోస్టాల్జియా గురించి ఓసారి మాట్లాడుకుందాం. సాధారణంగా నోస్టాల్జియా అంటే సానుకూలమైన జ్ఞాపకాలే అన్న అభిప్రాయం ఉంటుంది. కానీ ప్రతి ముఖ్యమైన గురుతూ పదిలమే. మన ఉనికిలో భాగమయ్యే ఆ జ్ఞాపకాలు మన వ్యక్తిత్వం మీదా, ఆరోగ్యం మీదా అనూహ్యమైన ప్రభావాన్ని చూపిస్తాయని అంటున్నారు. మరి ఆ జ్ఞాపకాలే లేని పరిస్థితులు వచ్చేస్తే ఎలా? అదీ ఆలోచించాల్సిందే!

**దూరంగా**

ఉన్న అమ్మకు ఫోన్ చేయాలంటే సెంటర్‌కి వెళ్లి పావుగంట లైన్లో నిలబడే రోజులవి. కరెంటు బిల్లు కట్టాలంటే ఒక పూట సెలవు పెట్టాల్సిన కాలమది. కావాల్సిన పాట కోసం టేప్ రికార్డరులో ఫాస్ట్ ఫార్వార్డ్ నొక్కుతూ, ఆ వేగానికి టేపు వదిలేస్తే పెన్సిల్‌తో తిప్పుతూ, నచ్చిన పాట పదిసార్లు విన్నాక అరిగిపోతే మనసు విరిగినంత బాధపడే పరిస్థితులవి. అర్ధరాత్రి ఆకలేస్తే వండుకోవడమే నో స్విగ్గీ! ఊరి చివరికి వెళ్లాలంటే రిక్షావాడితో బేరం ఆడటమే నో ఓలా! సినిమాకి వెళ్లాలంటే ఫంక్షన్ లాంటి సందడి, కొత్తబట్టలు కావాలంటే టైలరే సెలెబ్రిటీ.

వినాయకచవితి పందిళ్లలో నోరు తెరుచుకుని చూసిన సినిమాలు, దూరదర్శన్ చిత్రలహరిలో ప్రకటనల మధ్య ఇరుక్కున్న పాటలు ఇవన్నీ అప్పట్లో అసౌకర్యంగానో, కాలయాపనగానో తోచేవి! కానీ ఇప్పుడవే మధుర జ్ఞాపకాలుగా మారిపోయాయి. రోజులు గడుస్తున్న కొద్దీ ఇలాంటి అనుభూతులు తగ్గిపోతున్నాయా 1990-2010 మధ్య పుట్టిన జెన్ జి దే ఈ నోస్టాల్జియాలో ఆఖరి తరమా అంటే అవునన్నట్టుగానే జవాబులు వినిపిస్తున్నాయి.

**ఇలా పనిచేస్తుంది!**

మన నిత్యజీవితంలో ఎదురయ్యే చిన్నచిన్న విషయాలను మర్చిపోవడానికి కారణం మెదడులో ఉపయోగపడే జ్ఞాపకాలను దాచుకునే ప్రయత్నం. ఇలాంటి సందర్భాలలో మరపు ఓ వరం. అదే లేకపోతే మెదడు పేకాట కౌంట్లతోను, గత ఏడాది కరెంటు బిల్లులతోను నిండిపోతుంది. మన జ్ఞాపకాలలో అనుభూతిపరమైన వాటిని తిరిగి గుర్తుచేసుకోవడం ఓ సాధారణ ప్రక్రియ కాదు. మన కార్ నెంబర్ ఎంత? మన టీవీ కంపెనీ ఏంటి?%ా% లాంటి విషయాల్లాగా, అవి ఓ డేటా రూపంలో బయటకు రావు. మన మెదడులోని హిప్పోకేంపస్, వెంట్రల్ స్ట్రేటం, సబ్‌స్టాన్షియా నిగ్రా అనే భాగాలు కలిసి ఈ నోస్టాల్జియా అనుభూతిని కలిగిస్తాయని తేలింది.



నోస్టాల్జియా అందరిలోనూ ఒకేలా ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తరచూ ఈ అనుభూతిని పొందే లక్షణాన్ని ట్రెయిట్ నోస్టాల్జియాగా పేర్కొంటారు. ఓ నాలుగు సిద్ధాంతాల ద్వారా ఈ స్థాయిని అంచనా వేసే ప్రయత్నం చేస్తారు.

ఇక ఓ వ్యక్తి నోస్టాల్జియాను అనుభూతి చెందడం వెనుక ఉన్న ఉద్దేశాల మీద కూడా చాలా పరిశోధనలే జరిగాయి. కొందరు తమ సామాజిక బంధాలను మెరుగుపర్చుకునేందుకు వ్యక్తులు, అనుబంధాలకు సంబంధించిన జ్ఞాపకాలను నెమరువేసుకుంటారనీ, కొందరు విఫల జీవితాన్ని కప్పిపుచ్చుకునేందుకు గతకాలపు చిన్నచిన్న విజయాలను తల్చుకుంటూ ఉంటారనీ చెబుతారు. అలాగే అనుభూతులను గుర్తు చేసుకునే విధానంలోనూ భిన్నరకాలు కనిపిస్తాయి. కొందరు గతకాలాన్ని తల్చుకుంటే కొందరు తమ వ్యక్తిగత జీవితాన్ని జ్ఞప్తి చేసుకుంటారు.

**ఎన్ని లాభాలో!**

జ్ఞాపకం, అనుభూతి, ఆలోచన, ఉద్వేగం ఇవన్నీ మానసికమైనవిగా మనకి తోచవచ్చు. కానీ, ఇదంతా కూడా హార్మోన్లు ఆడే ఆటే అన్నది శాస్త్రవేత్తల మాట. కాబట్టి నోస్టాల్జియా వల్ల ఏర్పడే రసాయనిక చర్యలు మన మనసు మీదా, వ్యక్తిత్వం మీదా, తప్పకుండా సానుకూలమైన ప్రభావం చూపిస్తాయని నమ్మాల్సిందే. వాటిలో కొన్ని

'గతంలో ఇలా ఉండేవాడిని' అనే ఆలోచన వర్తమానంలోనూ మంచి అలవాట్లను ప్రేరేపిస్తుందని కొన్ని పరిశోధనలు నిరూపించాయి. కొందరు తాము యవ్వనంగా ఉన్న రోజుల్ని తల్చుకుని అదే స్థాయి ఆరోగ్యాన్ని నిలిపి ఉంచుకునేందుకు వ్యాయామం, ఆహారాల విషయంలో జాగ్రత్త పడటాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొంటున్నారు.

హడావుడిగా సాగిపోయే జీవితంలో సామాజిక నైపుణ్యాలు తగ్గిపోతున్నాయి. కలిసి పెరిగిన మిత్రులను, చిన్నప్పటి వేడుకల్లో కలుసుకున్న బంధువులను, మన ఇరుగుపొరుగు ఉండి వెళ్లినవారిని ఇలా పాత బంధాలను మళ్లీ గుర్తుచేసుకుని, వారితో అనుబంధాన్ని తిరిగి బలపర్చుకునేందుకు నోస్టాల్జియా ఉపయోగపడుతుందట.

నోస్టాల్జియా అంటే కేవలం జ్ఞాపకం మాత్రమే కాదు నాటి సందర్భాన్ని తిరిగి ఊహించుకునే ప్రయత్నం చేయడం. ఇక్కడ గత అనుభవంతోపాటు అనుభూతి ఉంటుంది. అందుకే తరచూ నోస్టాల్జియాకు ప్రయాణించేవారిలో సృజన పాళ్లు ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు.

కొవిడ్ లాంటి విషమ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఉపయోగపడిన అంశాల్లో నోస్టాల్జియా ఒకటని తేలింది. గతాన్ని తల్చుకుంటే, మళ్లీ పరిస్థితులు అలాంటి స్థితికి చక్కబడతాయనే ఆశతో చాలామంది జీవించారు. కొవిడ్ ముగిసిన తర్వాత చాలామంది తమకు ఇష్టమైన ప్రదేశాలకు వెళ్లేందుకు క్యూ కట్టడానికి మేల్కొన్న నాటి అనుభూతులే కారణమని పేర్కొన్నారు.

ఒత్తిడిగా ఉన్నప్పుడో, జీవితంలో నిరాశ పెరిగిపోయినప్పుడో%ా% గతకాలపు మధురస్మృతులను నెమరువేసుకుంటే మూడ్ మారిపోతుందని మానసిక నిపుణుల మాట. ఆ సందర్భంలో వెలువడే డోపమైన్ హార్మోన్ బాధను దిగమింగేంతటి సంతోషాన్ని అందిస్తుందని సూచిస్తున్నారు.

ఆశ్చర్యంగా అనిపించినా మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడటంలో నోస్టాల్జియాది ప్రధాన పాత్ర. ఆ పండుగల అనుభూతులు, గతచరిత్ర వైభవం, తరతరాలుగా ప్రత్యేకంగా నిలుస్తున్న అలవాట్లు వీటన్నిటినీ గర్వకారణంగా ముందుకు తీసుకువెళ్లేందుకు నోస్టాల్జియా ప్రేరణగా నిలుస్తుంది.




ఈ జాబితా ఇక్కడితో ఆగేది కాదు. నోస్టాల్జియా మన ఉనికికి బలాన్నిస్తుందనీ, నేను భిన్నమైనవాడిననే ఆత్మవిశ్వాసానికి ఆలంబనగా నిలుస్తుందనీ, ఇతరులను కూడా అర్థం చేసుకోగల సహానుభూతిని పెంచుతుందనీ ఇలా చాలా లాభాలే పేర్కొంటున్నారు.

**ఎందుకు తగ్గిపోతున్నది!**

ఇప్పటి తరానికి అన్నీ దొరుకుతున్నాయి. కానీ, దక్కినవాటికి ఎంత సంతృప్తి లభిస్తున్నందంటే కాస్త ఆలోచించాల్సిందే. ఉరుకుల పరుగుల జీవితంలో తన గతంలోకి ప్రయాణించే వెసులుబాటు కూడా ఉండటం లేదు. ఆ మాటకు వస్తే ఏ రోజుకారోజే అన్నట్టు జీవితం సాగిపోతున్నది. ఈ హడావుడికి తోడు మరిన్ని కారణాలూ ఉన్నాయి.

అనుకున్నది అరచేతిలో: ఒకప్పుడు ఏదన్నా కావాలంటే ఎదురుచూడాల్సి వచ్చేది. టెలిఫోన్ కనెక్షన్ దగ్గర్నుంచీ మెయిల్ డౌన్లోడ్ వరకూ అన్నిటికీ ఓపిక పట్టాల్సి వచ్చేది. ఎదురుచూపుల ఫలితం కచ్చితంగా గుర్తుండిపోయేది. కానీ ఇప్పుడు ఏది కావాలంటే అది ఎలా కావాలంటే అలా అన్నీ అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. ఓటీటీ, హోం డెలివరీ, ఆన్‌లైన్ షాపింగ్‌తో అనుకున్నది వెంటనే అరచేతిలో వాలిపోతున్నది. దాంతో అదెంత విలువైనదైనా.. వినియోగం వరకే దాని ప్రాధాన్యం పరిమితం అవుతున్నది.



ఎంపికలు: ప్రపంచీకరణ జీవితాన్ని మార్చేసింది. ఒక టీవీని పాతిక వేలు పెట్టయినా కొనవచ్చు, పాతిక లక్షలు పెట్టాల్సిన టీవీలూ అందుబాటులోకి వచ్చాయి. ఫోన్, అపార్ట్‌మెంట్, ఫ్రిజ్, నగలు, కారు ఇలా ప్రతిదానిలోనూ ఎంపికలు పెరిగిపోతున్నాయి. దాంతో ఏ వస్తువు కొన్నా, ఏ అనుభూతిని సొంతం చేసుకున్నా అది సంతృప్తిని కలిగించడం లేదు సరికదా%ా% రాజీపడాల్సి వచ్చిందే అన్న లోటే మిగులుతున్నది. ఇంటికి వచ్చిన వస్తువులు జ్ఞాపకాలుగా కాకుండా స్తోమతకు చిహ్నాలుగా మారిపోతున్నాయి.


ఓపిక ఏది: ఒకప్పుడు చిన్న మెయిల్ ఓపెన్ అయ్యేందుకు కూడా చాలాసేపు పట్టేది. ఇప్పుడు జీబీల కొద్దీ వీడియోలు కూడా చిటికెలో డౌన్లోడ్ అవుతున్నాయి. నెట్ స్పీడ్‌కి సమాంతరంగా పిల్లల్లో సహనం కూడా తగ్గుతుందనేది ఓ గమనింపు. వాళ్లు చూడాలనుకున్నది 30 సెకన్లలోనే చూసేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇది 15 సెకన్లకు చేరుకుంటుందని అంచనా. ఈ తరహా మనస్తత్వంలో అనుభూతి స్థానంలో అలజడి రాజ్యమేలుతున్నది. ఫోన్ చూడకుండా ఒక్క క్షణం కూర్చోవడం అంటే సమయాన్ని వృథా చేసుకోవడం అనే ఆలోచన బలపడుతున్నది.

విశ్వమానవుడు: గ్లోబల్ విలేజ్ నేపథ్యంలో ఇది నా ఇల్లు, నా ఊరు, నా ఇరుగుపొరుగు, నా భాష అనే భావన బలహీనపడిపోతున్నది. ఎక్కడ అవకాశాలున్నా రెక్కలు కట్టుకుని ఎగిరిపోవడం, కొత్తకొత్త పరిస్థితులకు సర్దుకుపోవడం, మమకారాలు తగ్గించుకోవడం తప్పనిసరిగా మారింది. ఇలాంటి పరిస్థితుల వల్ల 'నేను, నాది' అనే భావన కూడా బలహీనపడిపోతున్నది. తన ఉనికే ప్రశ్నార్థకమైన నేపథ్యంలో మనిషి త్వరగా కుంగుబాటుకు లోనవుతున్నాడని పరిశోధనలు తేల్చాయి.

అబండెన్స్ ఆఫ్ మెమరీస్: గ్లోబలైజేషన్ నేపథ్యంలో మనకు ఓ మంచి అనుభూతిని కల్పించేందుకు మార్కెట్ శతవిధాలా ప్రయత్నిస్తున్నది. సినిమా హాల్ దగ్గర్నుంచీ, సెల్‌ఫోన్ వరకూ వీలైనన్ని సౌలభ్యాలతో మనల్ని ఆకట్టుకుంటున్నాయి. సహజీవనం సహజమైపోతున్నది. ఈ అనుభవాల ఉప్పెనలో కొట్టుకుపోతూ స్పష్టమైన నోస్టాల్జియా లేకుండా సాగిపోతున్నాడు ఇప్పటి మనిషి.

వేగంగా మార్పులు: ఉత్తరాలు, టెలిగ్రాం, డయల్ ఫోన్, బటన్ ఫోన్, వైర్‌లెస్, పేజర్, 2జీ, 3జీ, స్మార్ట్‌ఫోన్ కేవలం ఫోన్ల విషయంలోనే కాదు వాహనాలు, జీతాలు, టీవీలు ఇలా అన్ని అంశాల్లోనూ ఒకప్పటి తరంలో మార్పులు ఇలా అంచెలవారీగా జరిగేవి. కానీ ఇప్పుడు ఊహ తెలుస్తూనే, నేరుగా తుదిదశలో ఉన్న ఉత్పత్తిని చేతిలోకి తీసుకుంటున్నారు పిల్లలు. దాంతో ఓ ప్రయాణం కోసం, వార్త కోసం, టీవీ కోసం ఎంత శ్రమించేవారమో వారికి తెలియడం లేదు. అవే నోస్టాల్జియాకు కీలకం కదా! ఇవేనా! సోషల్ మీడియా మనకు వైరస్‌లా సోకి వదలడం లేదు, పట్టణీకరణతో పల్లెల స్వచ్ఛమైన అనుభవాలు మాయమైపోయాయి, చిన్న కుటుంబాలతో బంధాలు చెదిరిపోయాయి ఇలాంటి సవాలక్ష కారణాలు నోస్టాల్జియాను దూరం చేసేసేవే.

## మహిళలూ అందుకోసం ఆర్టిఫిషియల్ లూబ్రికేంట్స్ వాడుతున్నారా..?




ఆకలి, దప్పికల తర్వాత మనిషి జీవితంలో అత్యంత ప్రాధాన్యం ఉన్నది శృంగారానికే. ఎందుకంటే శృంగారం సృష్టి కార్యం. అయితే ఈ విషయంలో చాలామంది చాలా రకాల సమస్యలు ఎదుర్కొంటుంటారు. పురుషుల్లో ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఉంటాయి. అంగస్తంభన, శీఘ్ర స్కలనం లాంటి సమస్యలు ప్రధానంగా వినిపిపిస్తాయి. మహిళల్లో ముఖ్యంగా మోనోపాజ్ దశలో ఉన్న మహిళల్లో సహజ లూబ్రికెంట్స్ విడుదల కావు. దాంతో శృంగార సమయంలో వారు తీవ్రమైన నొప్పిని అనుభవించాల్సి వస్తుంది. ఈ సమస్య నుంచి ఉపశమనం కోసం కృత్రిమ లూబ్రికెంట్స్‌ను వాడుతుంటారు. కానీ అది ప్రమాదకరమని గైనకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. నిపుణులు వాడకూడదంటున్న ఆ ఆర్టిఫిషియల్ లూబ్రికేంట్స్ ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

**పెట్రోలియం జెల్లీ**

సాధారణంగా చాలామంది దంపతులు శృంగార సమయంలో నొప్పిగా ఉంటుందని ఉపశమనం కోసం పెట్రోలియం జెల్లీని వినియోగిస్తుంటారు. అయితే, ఇలా చేయడం కరెక్టు కాదంటున్నారు వైద్య నిపుణులు. పెట్రోలియం జెల్లీవల్ల స్త్రీల జననావయవాల్లో బ్యాక్టీరియా వృద్ధి చెందుతుందని, ఇది రకరకాల సుఖ వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**జారుడు పదార్థాలు**

మరి కొంత మంది మీగడ లాంటి జారుడు పదార్థాలను కృత్రిమ లూబ్రికెంట్స్‌గా ఉపయోగిస్తుంటారు. అలా జారుడు పదార్థాల వినియోగం కూడా ఆరోగ్యానికి అనర్థమేనని నిపుణులు చెబుతున్నారు. కృత్రిమ లూబ్రికెంట్స్‌గా రకరకాల జారుడు పదార్థాలను వినియోగించడంవల్ల స్త్రీ, పురుష జననేంద్రియాల్లో ఇన్‌ఫెక్షన్‌లు సోకుతాయని హెచ్చరికలు చేస్తున్నారు.

**బాడీ లోషన్, ఆలివ్ ఆయిల్**

అదేవిధంగా శృంగార సమయంలో నొప్పి రాకుండా ఉండేందుకు ఇంకొంత మంది మహిళలు కాస్మటిక్ బాడీ లోషన్‌ను కృత్రిమ లూబ్రికెంట్‌గా వాడుతుంటారు. అది కూడా అసహజమైన పద్ధతేనని గైనిక్ నిపుణులు చెబుతున్నారు. మరి కొందరు ఆలివ్ ఆయిల్‌ను ఆర్టిఫిషియల్ లూబ్రికెంట్‌గా వినియోగిస్తారని అది కూడా అంత శ్రేయస్కరం కాదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఇదీ పరిష్కారం..**

సహజంగా స్త్రీ జననాంగాల్లో విడుదలయ్యే సహజ లూబ్రికెంట్స్‌తోనే శృంగారాన్ని ఎంజాయ్ చేయాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

మోనోపాజ్ దశలో ఉన్న మహిళలు సమస్య పరిష్కారం కోసం లూబ్రికెంట్స్‌గా కండోమ్స్ వాడాలని, వాటిలో ఉండే లేటెక్స్ పదార్థం కృత్రిమ లూబ్రికెంట్‌గా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. గర్భనిరోధక నియమాలను పాటించేవారు కూడా జెల్లీలు, లోషన్‌ల జోలికి వెళ్లకుండా కండోమ్స్ వాడటమే ఉత్తమమని సలహా ఇస్తున్నారు.

## బరువు తగ్గాలని అనుకుంటున్నారా.. అయితే ఈ తప్పులు అస్సలు చేయొద్దు!



నేటితరం మహిళల్ని వేధిస్తున్న అతిపెద్ద సమస్య.. అధిక బరువు. దీనివెంటే.. కీళ్లనొప్పులు, గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలూ పలకరిస్తాయి. కాబట్టి, ఎలాగైనా బరువు తగ్గాల్సిందేనని కంకణం కట్టుకుంటారు. ఇక యువతులైతే నాజూగ్గా కనిపించేందుకు ప్రయత్నిస్తుంటారు. అలా.. 'బరువు'ను కంట్రోల్ చేసేందుకు 'స్ట్రిక్ట్ డైట్' పాటిస్తుంటారు. ప్రతిరోజూ రకరకాల వ్యాయామాలు చేస్తుంటారు. అయినా.. కొందరుమాత్రం బొద్దుగానే కనిపిస్తుంటారు. ఒళ్లు హూనమయ్యేలా వర్కవుట్స్ చేస్తున్నా.. నోరు కట్టేసుకుని హెల్తీ డైట్ పాటిస్తున్నా.. బరువెందుకు తగ్గడం లేదని బాధ పడుతుంటారు. అయితే, వారికి తెలియకుండానే చేసే కొన్ని తప్పులు.. బరువు తగ్గకుండా చేస్తాయని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు. వాటిని గుర్తించి, పునరావృతం కాకుండా చూసుకుంటే.. 'బరువు'ను నియంత్రణలో ఉంచుకోవచ్చని సూచిస్తున్నారు.

బరువు తగ్గేందుకు భారీ వ్యాయామాలు చేయవద్దనీ, అలా చేయడం వల్ల కండరాలు మరింత బలాన్ని పొందుతాయని చెబుతున్నారు. ఎక్కువ ఒత్తిడికి గురైనా బరువు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఇక రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేయడం, అందులోనూ కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం కూడా బరువు పెరగడానికి కారణం అవుతాయి. ఇక మహిళల్లో అంతర్లీనంగా ఉండే కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా వారి బరువును ప్రభావితం చేస్తాయని నిపుణుల మాట. ముఖ్యంగా.. ఆడవాళ్లలో హార్మోన్ల అసమతుల్యత వల్ల జీవక్రియలు నెమ్మదించి, బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ఇక పీసీఓడీ, పీసీఓఎస్ సమస్యలు కూడా బరువును పెంచేవే! మెనోపాజ్ సమయంలోనూ కొందరు బరువు పెరుగుతుంటారు. ఇలాంటి సమస్యలు ఎదుర్కొనేవారు.. బరువును నియంత్రణలో ఉంచుకోవడం కొంచెం కష్టమే! నిద్రలేమి కూడా బరువు పెరగడానికి ఓ కారణం! రాత్రిపూట ఆరుగంటల కన్నా తక్కువ నిద్రపోయే వారి శరీరంలో.. కొవ్వు ఎక్కువగా పెరిగిపోతుందట. నిద్రలేమి వల్ల శరీరంలో కార్టిసోల్, ఇన్సులిన్ హార్మోన్లు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయనీ, ఇవి శరీర బరువు పెరిగేలా చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్యలను గుర్తించి, పరిష్కార మార్గాలను ఫాలో అయితే.. బరువు తగ్గేందుకు అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.




## గాజాపై వైమానిక దాడులు.. 77 మంది మృతి



**గాజా-నవభూమి:** గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో శుక్రవారం 77 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ శనివారం వెల్లడించింది. మృతుల్లో ఐదుగురు చిన్నారులున్నారని, 174 మంది గాయపడ్డారని తెలిపింది. నిరాశ్రయులు తలదాచుకున్న షాబన్ రయీస్ స్కూలుపై గురువారం ఇజ్రాయెల్ సేనలు జరిపిన వైమానిక దాడులలో ఐదుగురు పిల్లలతోసహా 12 మంది మరణించారు. గురువారం తెల్లవారు జామున దీర్ అల్ బలాలోని మగజీ శరణార్థ శిబిరంపై జరిగిన మరో వైమానిక దాడిలో ఐదుగురు మరణించారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు గాజాలో మొత్తం 45,206 మంది మరణించారు.

## గోల్డ్ ఎడిషన్‌గా ఓలా స్కూటర్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్..లిమిటెడ్ ఎడిషన్‌గా 24 క్యారెట్ బంగారంతో తయారైన ఎస్1 ప్రొ స్కూటర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది.

## హైదరాబాద్‌లో ఇండ్లకు తగ్గిన గిరాకీ
### అక్టోబర్-డిసెంబర్‌లో 47 శాతం పతనం




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశవ్యాప్తంగా ఇండ్ల విక్రయాలు గరిష్ఠ స్థాయిలో పడిపోతున్నాయి. రోజురోజుకు అమ్మకాలు అంతకంతకు కిందకు దిగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుండటం, మరోవైపు అస్తవ్యస్థ ఆర్థిక విధానాలతో పెట్టుబడిదారుల్లో నమ్మకం సడులుతున్నది. దీంతో ఒకప్పుడు ఉవ్వెత్తున ఎగిసిన దేశీయ రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ అంతే వేగంతో కిందకు పడిపోతున్నది. ప్రస్తుతేడాది అమ్మకాలు చూస్తే ఇది అవగతం అవుతున్నది. ఇండ్ల అమ్మకాలపై ఈ మధ్యకాలంలో విడుదలైన నివేదికలు ఈ విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి.
తాజాగా ప్రాప్‌ఈక్విటీ సంస్థ విడుదల చేసిన గణాంకాలు కూడా ఈ విషయాన్ని స్పష్టంచేశాయి. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను దేశవ్యాప్తంగా తొమ్మిది నగరాల్లో ఇండ్ల అమ్మకాలు 21 శాతం పడిపోయాయని వెల్లడించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, నవీ ముంబై, కోల్‌కతా, బెంగళూరు, పూణె, హైదరాబాద్, చెన్నై, థానే వంటి మెట్రో నగరాల్లో 1.08 లక్షల యూనిట్ల ఇండ్లు అమ్ముడయ్యాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో అమ్ముడైన 1,37,225 యూనిట్లతో పోలిస్తే భారీగా తగ్గాయి. కేవలం ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో మాత్రమే విక్రయాలు పెరిగాయని తెలిపింది. ఇండ్ల అమ్మకాలు పడిపోయిన నగరాల్లో హైదరాబాద్ టాప్ ప్లేస్‌లో ఉన్నది.అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో హైదరాబాద్‌లో 12,682 యూనిట్లు అమ్ముడయ్యాయని, క్రితం ఏడాది నమోదైన 24,044తో పోలిస్తే 47 శాతం తగ్గాయని పేర్కొంది. అలాగే బెంగళూరులో గృహ విక్రయాలు 13 శాతం తగ్గి 14,957లకు పడిపోగా, చెన్నైలో 9 శాతం తగ్గి 4,673 యూనిట్ల నుంచి 4,266లకు జారుకున్నాయి. అధిక బేస్ రేట్ కారణంగా ఇండ్ల విక్రయాలు పడిపోయాయని ప్రాప్‌ఈక్విటీ సీఈవో, ఫౌండర్ సమీర్ జాసుజా తెలిపారు. పండుగ సీజన్ కావడంతో మూడో త్రైమాసికంతో పోలిస్తే ఆ తర్వాతి క్వార్టర్‌లో అమ్మకాలు పెరిగాయని తెలిపారు.

## జోయాలుక్కాస్ ఎన్ఆర్ఐ గోల్డ్ ఫెస్ట్




**హైదరాబాద్- నవభూమి:** ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్..ప్రవాస భారతీయులకోసం ప్రత్యేకంగా గోల్డ్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నది. ఈ పండుగ సీజన్‌లో ఆభరణాలు కొనుగోలుచేసే ఎన్ఆర్ఐలు ప్రత్యేక ఆఫర్లను తీసుకొచ్చింది.
పాత గోల్డ్‌పై ప్రతిగ్రాముకు రూ.50 అదనంగా చెల్లిస్తున్న సంస్థ, డైమండ్స్, అన్‌కట్ డైమండ్స్, ప్రెషస్ స్టోన్స్ కోసం మజూరీ చార్జీలను, స్టోన్ విలువపై 25 శాతం తగ్గింపు ధరతో అందిస్తున్నది. ఈ ప్రత్యేక ఆఫర్లు వచ్చే నెల 5 వరకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఆభరణాల విక్రయశాలలో అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

## జోస్ ఆలుక్కాస్ డైమండ్ ఫెస్ట్




**హైదరాబాద్- నవభూమి:** ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జోస్ ఆలుక్కాస్..మరోసారి డైమండ్ ఫెస్ట్‌ను ప్రారంభించింది. వజ్రాల కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి సంస్థ ప్రత్యేకంగా ఆఫర్లను తీసుకొచ్చింది. ఈ ఫెస్ట్‌లో భాగంగా క్యారెట్ వజ్రాన్ని కొనుగోలు చేసిన వారికి 500 మిల్లీగ్రాముల బంగారు నాణేన్ని ఉచితంగా అందిస్తున్నది. దీంతోపాటు వజ్రాల ఆభరణాలపై ప్రతి క్యారెట్‌కు రూ.15 వేల తగ్గింపు ధరతో విక్రయిస్తున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.
అలాగే వినియోగదారుల వద్ద ఉన్న పాత బంగారాన్ని అంతర్జాతీయ ప్రయోగశాలల్లో ధృవీకరించిన వజ్రాలతో ఎక్స్ఛేంజ్ చేసుకోవడానికి, అధిక లాభాలను పొందడానికి ఈ ఫెస్ట్ సరైనదని కంపెనీ చైర్మన్ జోస్ ఆలుక్కాస్ తెలిపారు. ఈ వేడుకలో భాగంగా నిర్వహించనున్న లక్కీ డ్రాలో గెలుపొందిన ఏడు జంటలను గోవా తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

# క్రెడిట్ దెబ్బ.. బకాయిల చెల్లింపులు ఆలస్యమైతే కార్డుదారులకు వడ్డీ మోత!




**న్యూఢిల్లీ-నవభూమి:** క్రెడిట్ కార్డుదారులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చేతిలో చిల్లి గవ్వ లేకపోయిన క్రెడిట్ కార్డు ఉంటేచాలు ఇష్టంవచ్చినట్లు కొనుగోలు చేసి బిల్లులు ఎగవేసిన వారికి అత్యున్నత న్యాయస్థానం గట్టి షాకిచ్చింది. బకాయిలు చెల్లింపులు ఆలస్యమైతే ఇక మీ ఇష్టం వచ్చినట్లు వడ్డీరేట్ల మోత మోగించుకోవచ్చునని బ్యాంకులకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. బిల్లులు చెల్లంచనివారిపై వడ్డీరేట్లు ఎంత విధించుకునేదానిపై బ్యాంకులదే తుది నిర్ణయమని కోర్టు స్పష్టంచేసింది. ఈ బకాయిలపై వడ్డీ పరిమితి ఉండాలన్న జాతీయ వినియోగదారుల పరిష్కార కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ) తీర్పును కోర్టు పక్కనపెట్టింది.
దీంతో నిర్ణీత గడువులోగా బిల్లు చెల్లించని వినియోగదారులపై పెద్దమొత్తంలో వడ్డీ వసూలు చేయడానికి బ్యాంకులకు మార్గం సుగమమైంది. క్రెడిట్ కార్డుల బిల్లుల ఆలస్య చెల్లింపులపై వార్షికంగా 30 శాతానికి మించి వడ్డీ వసూలుచేయరాదని 2008లో ఎన్‌సీఈడీఆర్‌సీ తీర్పు వెల్లడించింది. 16 ఏండ్ల క్రితం ఎన్‌సీఈడీఆర్‌సీ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తిరిగిరాసింది. జస్టిస్ బెలా త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ప్రత్యేక బెంచ్ ఈ కేసును విచారించి ఈ తీర్పునిచ్చింది. స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్, సిటీ బ్యాంక్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, హెచ్‌ఎస్‌బీసీ వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఈ ప్రత్యేక బెంచ్..క్రెడిట్ కార్డు బకాయిల ఆలస్య చెల్లింపులపై 30 శాతం నియంత్రణను ఎత్తివేస్తూ తీర్పును వెల్లడించింది.

**ఆవాజ్ ఫౌండేషన్ ఫిర్యాదు**

క్రెడిట్ కార్డు బకాయిలపై ప్రధాన బ్యాంకులతోపాటు చిన్న బ్యాంకులు కూడా ఇష్టం వచ్చినట్లు వడ్డీరేట్లు వసూలు చేస్తున్నారని ఆవాజ్ ఫౌండేషన్ గతంలో ఎన్‌సీఈడీఆర్‌సీకి ఫిర్యాదు చేసింది. దీనిపై విచారించిన ఎన్‌సీఈడీఆర్‌సీ ప్రత్యేకంగా అన్ని బ్యాంకులు క్రెడిట్ కార్డు బకాయిలపై తమ వడ్డీని 30 శాతానికి మించకుండా వసూలు చేయాలని గతంలో తీర్పునిచ్చింది.
దీనిపై దేశీయ, అంతర్జాతీయ బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ ఆలస్య చెల్లింపులపై గతంలో బ్యాంకులు 36 శాతం నుంచి 49 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తుండేవి. అధిక వడ్డీ వసూలు చేస్తుండటంతో గతంలో క్రెడిట్ కార్డు బకాయిలు పూర్తిగా చెల్లింపులు జరపడం లేదా కనీస చెల్లింపులు జరిపేవారు తగ్గిపోయారు. క్రెడిట్ కార్డు లావాదేవీలపై 45 రోజుల వరకు ఎలాంటి వడ్డీని వసూలు చేయడం లేదని, కానీ కొందరు వీటిని అదనుగా చేసుకొని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని బ్యాంకులు ఫిర్యాదు చేశాయి.

**రిజర్వుబ్యాంక్ ఆందోళన**

క్రెడిట్ కార్డు బకాయిలు పెరగడంపై రిజర్వుబ్యాంక్ గతంలోనే ఆందోళన వ్యక్తంచేసింది. కార్డుల జారీపై నియంత్రణ విధించుకోవాలని, లేకపోతే బకాయిలు పేరుకుపోయి ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలున్నాయిన గతంలో హెచ్చరించింది. సుప్రీంకోర్టు నిర్ణయంతో ప్రధాన బ్యాంకులకు భారీ ఊరట లభించినట్లు అయిందని విశ్లేషకులు వెల్లడించారు. ఈ తీర్పుతో క్రెడిట్ కార్డు దారులు వెంటనే తమ బకాయిలు చెల్లించడానికి వీలు పడనున్నది.

# ఈవీలపై 5 శాతం జీఎస్టీ



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. ఎలక్ట్రిక్ వాహనాల వినిమయాన్ని పెంచడానికి ఈ వాహనాలపై 5 శాతం జీఎస్టీని విధిస్తూ నిర్ణయం తీసుకున్నది. అలాగే బిజినెస్ అవసరాలకోసం వినియోగించే యూస్డ్ కార్లపై పన్నును 12 శాతం నుంచి 18 శాతానికి పెంచిన కౌన్సిల్..విమాన ఇంధనం(జెట్ ఫ్యూయల్)ను జీఎస్టీ పరిధిలోకి తెచ్చే ప్రతిపాదనపై నిర్ణయాన్ని వాయిదా వేసింది. వన్-నేషన్-వన్-ట్యాక్స్ అనే నినాదంతో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి పలు రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించడంతో జెట్ ఫ్యూయల్‌పై జీఎస్టీ విధింపు ప్రతిపాదనను వెనక్కి తీసుకున్నది.

**బీమాపై నిర్ణయం వాయిదా**

బీమా ప్రీమియం వసూళ్లపై జీఎస్టీని తగ్గిస్తారని ఆశించినవారికి నిరాశే ఎదురైంది. ప్రస్తుత సమావేశంలో ఈ నిర్ణయాన్ని వాయిదా వేసింది. పన్ను తగ్గింపుపై ప్యానెల్ తుది నివేదిక సమర్పించకపోవడం వల్లనే వాయిదావేసింది. టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియంపై జీఎస్టీని మినహాయింపు నివ్వాలని సూచించిన మంత్రుల బృందం.. సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా కవరేజ్‌పై కూడా పన్ను ఎత్తివేయాలని సూచించింది.

జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలు..
బలవర్ధకమైన బియ్యం గింజలపై 18 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గింపు
జన్యు చికిత్సలకు జీఎస్టీ మినహాయింపు
రుణ గ్రహీతలపై బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు వేసే పెనాల్టీలపై జీఎస్టీ తొలగింపు

**పాప్‌కార్న్‌పై 18 శాతం జీఎస్టీ**

క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాంపై లెవీ ట్యాక్స్ విధింపుపై కౌన్సిల్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.
రూ.2 వేల లోపు చెల్లింపులు చేసే పేమెం ట్ అగ్రిగేటర్లకు జీఎస్టీ మినహాయింపు
ప్రీ-ప్యాక్డ్, స్పైస్ పాప్‌కార్న్‌లపై 12 శాతం పన్ను విధించిన కౌన్సిల్, అన్‌ప్యాక్ పాప్‌కార్న్‌పై 5 శాతం జీఎస్టీ
ప్రస్తుతం క్రూడాయిల్, పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్, సహజ వాయువులను జీఎస్టీ పరిధిలో లేవు.

## మహిళలకు గుడ్ న్యూస్.. మళ్లీ భారీగా తగ్గిన బంగారం ధరలు



**హైదరాబాద్- నవభూమి:** ఇటీవల వరకు బంగారం ధరలు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ల బంగారం ధర 80 వేల మార్క్‌ను సైతం దాటింది. కానీ గత కొద్ది రోజులుగా వాటి ధరలు కొద్ది కొద్దిగా తగ్గుతూ దిగి వస్తున్నాయి. ఆదివారం 22 క్యారెట్ల బంగారం 100 గ్రాముల ధర 7,10,000 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం 100 గ్రాముల ధర 7,74,500 గా ఉంది. గత వారం కిలో వెండి ధర సైతం రూ. లక్ష మార్కుకు చేరుకొంది. ఇక వెండి ధరను పరిశీలిస్తే.. వాటి ధర సైతం తగ్గుతూ వస్తోంది. ఈ వారం ప్రారంభంలో కిలో వెండి ధర రూ. 99,900 ఉండగా.. నేడు.. అంటే ఆదివారం కిలో వెండి ధర రూ. 99,000గా ఉంది.
ఇక హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.7,74,500, 22 క్యారెట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.7,10,000గా ఉంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో మాత్రం దేశంలోని వివిధ ప్రాంతాల కంటే.. పసిడి ధర గరిష్టంగా ఉంది. 24 క్యారెట్ల బంగారం ధర రూ.7,76,000గా ఉండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ. 7,11,500గా ఉంది.
ఇక నేడు ప్రధాన నగరాల్లో బంగారం ధర (100 గ్రాములు) ఎంత ఉందంటే..
హైదరాబాద్ లో రూ. 7,10,000 (22 క్యారెట్లు), రూ. 7,74,500 (24 క్యారెట్లు)
విజయవాడ: రూ. 7,10,000 (22 క్యారెట్లు), రూ.7,74,500 (24 క్యారెట్లు)
విశాఖపట్నం: రూ. 7,10,000 (22 క్యారెట్లు), రూ. 7,74,500 ( 24 క్యారెట్లు)
ఇక నేడు ప్రధాన నగరాల్లో కిలో వెండి ధర.. ఏ విధంగా ఉందంటే..
హైదరాబాద్: రూ. 99,000
విజయవాడ: రూ. 99,000
విశాఖపట్నం: రూ. 99,000
ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..
దేశ వాణిజ్య రాజధాని ముంబయి: రూ. 7,10,000 (22 క్యారెట్లు), రూ. 7,74,500 (24 క్యారెట్లు)
దేశ రాజధాని ఢిల్లీ: రూ.7,11, 500 (22 క్యారెట్లు), రూ.7,76, 000(24 క్యారెట్లు)
కోల్‌కతా: రూ.7,10,000 (22 క్యారెట్లు), రూ. 7,74,500 (24 క్యారెట్లు)
చెన్నై: రూ. 7,10,000 (22 క్యారెట్లు), రూ. 7,74,500 (24 క్యారెట్లు)



## సైబర్ మోసాల నుంచి మీ డెబిట్, క్రెడిట్ కార్డ్‌లను ఇలా రక్షించుకోండి..



**హైదరాబాద్- నవభూమి:** గత కొన్నేళ్లుగా ప్రధానంగా డీమోనిటైజేషన్ తర్వాత, క్రెడిట్, డెబిట్ కార్డుల వినియోగం గణనీయంగా పెరిగింది. దీంతో అనేక మంది భారతీయులు తమ కొనుగోళ్ల కోసం పాయింట్ ఆఫ్ సేల్స్ వద్ద లావాదేవీలు చేస్తున్నప్పుడు ఆయా కార్డ్‌లను ఉపయోగిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో సైబర్ మోసాలు పెరగడం వల్ల, వీటి ఉపయోగం విషయంలో కూడా జాగ్రత్త అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వీటి వాడకం విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది ఇక్కడ తెలుసుకుందాం.

**1. కోడ్ విషయంలో**

మీరు మీ డెబిట్ లేదా క్రెడిట్ కార్డ్‌ని పొందిన వెంటనే, మీరు చేయవలసిన మొదటి పని మీ రహస్య పిన్ నంబర్‌ను గుర్తుంచుకోవడం. ఆ తర్వాత మీ రహస్య పిన్ నంబర్ ఉన్న డాక్యుమెంట్‌ను చింపియాలి. ఆ తర్వాత మీ సౌలభ్యం ప్రకారం మీ పిన్ నంబర్‌ను మార్చుకోవాలి. అయితే దానిని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. ఆ రహస్య పిన్ నంబర్‌ను ఎక్కడా కూడా రాసి ఉంచుకోవద్దు.

**2. బిల్లులు చెల్లించే విషయంలో..**

మీ క్రెడిట్ లేదా డెబిట్ కార్డుకు సంబంధించిన అన్ని వివరాలను తప్పనిసరిగా రహస్యంగా ఉంచుకోవాలి. కార్డ్ నంబర్, గడువు తేదీ, కార్డ్ హోల్డర్ పేరు, పిన్ నంబర్, కార్డ్ ధృవీకరణ నంబర్ వంటి ముఖ్యమైన వివరాలను ఎవరికీ బహిర్గతం చేయవద్దు. ప్రత్యేకించి మీరు మీ కార్డ్‌ని పబ్లిక్ ప్లేస్‌లో లేదా లో ఉపయోగిస్తున్నప్పుడు మీ పిన్ నంబర్‌ని టైప్ చేసే క్రమంలో ఎవరైనా చుస్తున్నారో పరిశీలించాలి. అలాంటి వారు ఉండే మీ డేటా చోరీ అయ్యే ఛాన్స్ ఉంది. వారి పట్ల జాగ్రత్తగా ఉండండి. పెట్రోల్ పంపులు లేదా రెస్టారెంట్లలో బిల్లులు చెల్లిస్తున్నప్పుడు కూడా కార్డ్ వినియోగించే విషయంలో జాగ్రత్తగా వహించాలి.

**3. కార్డ్ వివరాలు ఫోన్‌లో షేర్ చేయొద్దు**

మీ కార్డ్ వివరాలను ఎవరైనా తెలియని వ్యక్తులు అడిగితే ప్రశ్నలకు సమాధానం చెప్పొద్దు. కాలర్ ఎంత విశ్వసనీయంగా కనిపించినా, మీ కార్డ్ నంబర్, పాస్‌వర్డ్, వంటి వివరాలను వారితో ఎప్పుడూ షేర్ చేయొద్దు. దీంతోపాటు ఫోన్ కాల్ సమయంలో లేదా సోషల్ చాట్ మొబైల్ యాప్‌లను ఉపయోగిస్తున్నప్పుడు మీ ఆర్థిక వివరాలను దగ్గరి బంధువులతో పంచుకోకూడదు. పొరపాటున కూడా ఇలాంటి పొరపాటు చేస్తే మీరు ఇబ్బందుల్లో పడే అవకాశం ఉంది.

**4. చిప్ క్రెడిట్ కార్డ్‌లను ఉపయోగించండి**

ప్రస్తుతం భారతదేశంలో అన్ని కొత్త డెబిట్, క్రెడిట్ కార్డ్‌లలో చిప్‌లు ఉన్నాయి. ఈ కొత్త కార్డ్‌లు పాత కార్డ్‌ల కంటే సురక్షితమైనవి. ఎందుకంటే పాత కార్డ్‌లు వెనుక భాగంలో మాగ్నెటిక్ స్ట్రిప్ మాత్రమే ఉంటాయి. కాబట్టి మీరు ఇప్పటికీ చిప్ లేకుండా పాత కార్డ్‌లను ఉపయోగిస్తుంటే వాటిని అప్‌గ్రేడ్ చేయమని మీ బ్యాంక్‌ని అడగడం మంచిది.


**5. చెల్లింపు చేసేటప్పుడు జాగ్రత్త**

మీ డిజిటల్ సమాచారాన్ని సురక్షితంగా ఉంచుకోవడం ఎల్లప్పుడూ ముఖ్యం. కాబట్టి ఆన్‌లైన్ చెల్లింపులు సురక్షితమైన వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే చేయాలి. ధృవీకరణ ఉన్న వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే లావాదేవీలు జరపండి. మీ కార్డ్ వివరాలను ఏ వెబ్‌సైట్ లేదా బ్రౌజర్‌లో సేవ్ చేయకూడదు. అనేక ఆన్‌లైన్ షాపింగ్ సైట్‌లు మీ తదుపరి లావాదేవీ సమయంలో చెల్లింపులను సులభతరం చేయడానికి మీ కార్డ్ డేటాను సేవ్ చేసుకోవాలని సిఫార్సు చేస్తాయి. కానీ అలాంటి వాటిని పట్టించుకోవద్దు. ఆన్‌లైన్ లావాదేవీలు జరిపినప్పుడు ఆ లావాదేవీకి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను ఉంచుకోండి. తర్వాత ఏదైనా వివాదం తలెత్తినప్పుడు ఇది మీకు సహాయకారిగా ఉంటుంది.

**6. మీ కార్డ్ స్టేట్‌మెంట్‌లు, లావాదేవీలపై నిఘా ఉంచండి**

మీరు మీ కార్డ్ స్టేట్‌మెంట్‌లు లేదా లావాదేవీలను కనీసం ప్రతి పదిహేను రోజులకు ఒకసారి తనిఖీ చేసుకోవాలి. మీరు ఏదైనా సరిపోలని లేదా తెలియని లావాదేవీని గమనించినట్లయితే వెంటనే కార్డ్ కంపెనీకి తెలియజేయండి. ఆ క్రమంలో మీరు క్రెడిట్ కార్డ్ మోసానికి గురైనట్లయితే అనిపిస్తే వెంటనే మీ కార్డ్ కంపెనీ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి, సంఘటన గురించి తెలపండి. వారు వెంటనే మీ కార్డ్‌ని బ్లాక్ చేస్తారు. తద్వారా మీ కార్డ్‌ని దుర్వినియోగం కాకుండా కాపాడుకోవచ్చు.

# స్టాక్ మార్కెట్లలో నష్టపుటేరులు



**ముంబై- నవభూమి:** మార్కెట్‌పై బేర్ పట్టు దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టపుటేరులు పారుతున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ కఠిన ద్రవ్య వైఖరి దిశగా అడుగులు వేస్తుండటం మదుపరులకు అస్సలు రుచించడం లేదు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ ఏకంగా 4,091.53 పాయింట్లు లేదా 4.98 శాతం కోల్పోయి 79వేల మార్కుకు దిగువన 78,041.59 వద్ద ముగిసింది.
దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టపుటేరులు పారుతున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ కఠిన ద్రవ్య వైఖరి దిశగా అడుగులు వేస్తుండటం మదుపరులకు అస్సలు రుచించడం లేదు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ ఏకంగా 4,091.53 పాయింట్లు లేదా 4.98 శాతం కోల్పోయి 79వేల మార్కుకు దిగువన 78,041.59 వద్ద ముగిసింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 1,180.80 పాయింట్లు లేదా 4.76 శాతం దిగజారి 24వేల మార్కును చేజార్చుకొని 23,587.50 దగ్గర స్థిరపడింది.
దీంతో ఈ వారం కూడా ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడికే లోను కావచ్చున్న అంచనాలున్నాయి. ఫలితంగా ప్రధాన రంగాల్లో లాభాల స్వీకరణకు వీలుందంటున్నారు. ఇక ఈ వారం డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు కూడా ప్రధానమే. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,000 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,900-24.100 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.





## అన్నాహజారేను కలిసిన ఫడ్నవిస్

**ముంబై-నవభూమి:** ప్రముఖ సామాజిక కార్యకర్త, అవినీతి వ్యతిరేక ఉద్యమ నేత అన్నా హజారే ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ కలుసుకున్నారు. అహల్యానగర్‌లో ముఖ్యమంత్రి ఆదివారంనాడు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అన్నాహజారేను కలుసుకుని ముచ్చటించారు. ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవిస్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత అహల్యానగర్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఆయనకు స్వాగతం పలికేందుకు హెలిప్యాడ్ దగ్గరకు అన్నాహజారే వచ్చారు. రాలేగావ్ సిద్ధి రావలసిందిగా కూడా ఫడ్నవిస్‌ను అన్నాహజారే ఆహ్వానించారు.

**ఆశీస్సులు తీసుకున్నా..**

ప్రముఖ సామాజిక కార్యకర్త, పద్మభూషణ్ అన్నాహజారేను ఈరోజు కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని దేవేంద్ర ఫడ్నవిస్ సామాజిక మాధ్యమం "ఎక్స్"లో తెలిపారు. హజారే ఎంతో ఆప్యాయంగా తనకు ఆశీస్సులు అదించారని కృతజ్ఞతలు తెలిపారు. తనతో పాటు మంత్రి రాధాకృష్ణ, విఖే పాటిల్ సైతం ఈ పర్యటనలో పాల్గొన్నట్టు తెలిపారు.

## కారుపై పడ్డ కంటెయినర్



**బెంగళూర -నవభూమి:**బెంగళూరు శివారులో రోడ్డుపై వెళుతున్న కారుపై ఎదురుగా వస్తూ అదుపుతప్పిన కంటెయినర్ పడటంతో ఓ కుటుంబంలోని మొత్తం ఆరుగురు అక్కడికక్కడే కన్నుమూశారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో జరిగింది. ముందు వెళుతున్న కారు ఒక్కసారిగా ఆగడంతో దాన్ని తప్పించబోయిన కంటెయినర్.. డివైడర్ ఎక్కి పక్కరోడ్డుపైకి వెళ్లింది. ఎదురుగా వస్తున్న మరో కంటెయినర్‌ను తప్పించే క్రమంలో అది అటుగా వస్తున్న కారుపై పడింది. దీంతో కారులో ఉన్న ఐఏఎసటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ కంపెనీ సీఈఓ చంద్ర యాగపగోళ్ (48), ఆయన భార్య గౌరాబాయి (42), కుమారుడు ధ్యాన్ (16), కూతుళ్లు దీక్ష (12), ఆర్య(8), సోదరుడి భార్య (36) మృతి చెందారు. మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా మొరబగి గ్రామానికి చెందిన చంద్ర యాగపగోళ్ బెంగళూరు హెచ్‌ఎసఆర్ లే అవుట్‌లో నివాసం ఉంటున్నారు.

## మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన రిజిస్ట్రేషన్ ఎప్పట్నించంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధానిలో "మహిళా సమ్మాన్ యోజన" 'సంజీవిని యోజన' పథకాల రిజిస్ట్రేషన్ డిసెంబర్ 23వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆదివారంనాడు ప్రకటించారు. మహిళా సమ్మాన్ యోజన పథకం కింద మహిళా లబ్ధిదారులకు ప్రతినెలా రూ.2,100 ఆర్థిక సాయం అందిస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆప్ పథకాలు కీలకంగా ఉన్నాయి."మహిళలు, సోదరీమణులకు రూ.2,100 బోనస్ మేము ప్రకటించాం. ఈ స్కీమ్ ప్రకటించినప్పటి నుంచి రిజిస్ట్రేషన్ ఎప్పటి నుంచి మొదలవుతుందని అడుగుతున్నారు. మహళా సమ్మాన్ నిధి కోసం రిజిస్ట్రేషన్ సోమవారం నుంచి ఢిల్లీలో మొదలవుతుంది. రిజిస్ట్రేషన్ కోసం మేము మీ ఇంటికి వస్తాం" అని కేజ్రీవాల్ చెప్పారు.

సీనియర్ సిటిజన్ల కోసం 'సంజీవని యోజన'

కాగా, 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య చికిత్స కోసం "సంజీవని యోజన" పథకాన్ని ఆప్ ప్రకటించింది. వైద్య చికిత్సకు అయ్యే ఖర్చుకు గరిష్ట పరిమితి అనేది లేదు. ఈ పథకానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కూడా డిసెంబర్ 23వ తేదీ నుంచి ప్రారంభం కానుందని కేజ్రీవాల్ ప్రకటించారు. రిజిస్ట్రేషన్‌కు ఢిల్లీ ఓటర్ ఐడీ మాత్రం తప్పనిసరని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు తాను, ముఖ్యమంత్రి అతిషి, సీనియర్ నేత మనీష్ సిసిడియా కలిసి ప్రజలను కలుస్తామని, తమ చేతుల మీదుగా కూడా రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పారు.

## 25 నుంచి మళ్లీ కుండపోత వర్షాలు..



**చెన్నై-నవభూమి:**బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా ఈ నెల 25, 26 తేదీల్లో సముద్రతీర జిల్లాల్లో పలుచోట్ల కుండపోత వర్షం కురిసే అవకాశముందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం మధ్య, పడమటి బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం గంటకు 7 కి.మీ.ల వేగంతో తీరం వైపు పయనిస్తోందని పేర్కొన్నారు. అల్పపీడనం కారణంగా తీర ప్రాంతాల్లో చెదురుముదురుగా వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో ఈనెల 23న వరకు జాలర్లు చేపలవేట మానుకుంటేనే మంచిదన్నారు.

రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో పుదుకోట, శివగంగ, మదురై తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో వర్షాలు కురుస్తాయన్నారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం పూర్తిగా బలహీనపడిన తర్వాత వాయుగుండంగా రూపుదిద్దుకుని తీరం వైపు పయనించనుందన్నారు.

దీని ప్రభావంతో ఈ నెల 25, 26 తేదీలలో సముద్రతీర జిల్లాలో పలుచోట్ల కుండపోతగా, మరికొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని వివరించారు. ఈశాన్య రుతుపవనాలు వచ్చే జనవరి మొదటివారం దాకా కొనసాగుతాయని, జనవరి 10 తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయని అధికారులు అంచనా వేశారు.

## వాట్సాప్ యూజర్లపై పెగాసస్ నిఘా

**న్యూయార్క్-నవభూమి:** వాట్సాప్ వినియోగదారుల డివైజ్‌లలో అక్రమంగా పెగాసస్ స్పైవేర్‌ను జొప్పించిందని ఆరోపిస్తూ ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్ఓ సంస్థపై మెటా దాఖలు చేసిన కేసులో అమెరికా కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. వాట్సాప్ వినియోగదారుల డివైజ్‌ల హ్యాకింగ్‌కు ఎన్ఎస్ఓ గ్రూప్‌దే బాధ్యత అని స్పష్టం చేసింది. వాట్సాప్‌లోని బగ్‌ను ఉపయోగించుకొని అక్రమంగా స్పైవేర్‌ను జొప్పించిందని ఎన్ఎస్ఓ గ్రూప్‌పై మెటా సంస్థ 2019లో అమెరికా కోర్టును ఆశ్రయించింది.

ఈ కేసును విచారించిన న్యాయమూర్తి ఫిల్లిస్ హమిల్టన్.. 1400 మంది వాట్సాప్ వినియోగదారుల డివైజ్‌లు లక్ష్యంగా మారడానికి పెగాసస్ స్పైవేర్ తయారుచేసిన ఎన్ఎస్ఓ గ్రూప్‌దే బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సంస్థ సంబంధిత చట్టాల్లోని నిబంధనలను ఉల్లంఘించిందని పేర్కొన్నారు. కోర్ట్ వ్యాఖ్యల పట్ల మెటా సంస్థ హర్షం వ్యక్తం చేయగా, ఎన్ఎస్ఓ గ్రూప్ స్పందించలేదు.

# టోల్ రుసుం శాశ్వతం కాదు



**న్యూఢిల్లీ-నవభూమి:** మౌలిక వసతుల ప్రాజెక్టుల అమల్లో అధికారులు నిజాయితీగా వ్యవహరించాలని నొక్కి చెబుతూ సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. టోల్ రుసుము వసూలు శాశ్వత ప్రక్రియ ఏమీ కాదని స్పష్టం చేసింది. దాన్ని నిరంతరం వసూలు చేస్తామంటే అది నిరంకుశత్వం కిందకే వస్తుందని తెలిపింది. ఈ ప్రాజెక్టులు ప్రజా ప్రయోజనానికి ఉద్దేశించినవే తప్ప ప్రయివేటు సంస్థలు లాభాలు ఆర్జించడానికి కాదని తెలిపింది. ప్రజానీకంపై భారం మోపుతూ అన్యాయంగా ఇతరులకు లాభాలు వచ్చేలా సహకరిస్తామంటే అనుమతించబోమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం శుక్రవారం వెలువరించిన తీర్పులో తెలిపింది. డిల్లీ-నోయిడా డైరెక్ట్ (డీఎన్‌డీ) ఫ్లై వేపై టోల్ రుసుము వసూలు విషయమై కుదిరిన రాయితీ ఒప్పందాన్ని 2016లో అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ నోయిడా టోల్ బ్రిడ్జి కంపెనీ(ఎన్‌టీబీసీ) సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. విచారణ జరిసిన ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది. అసలు రాయతీ ఒప్పందమే లోపభూయిష్టంగా ఉందని తెలిపింది.

ఉత్తమ నిబంధన ఏమిటంటే... ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకునే విధానాలు, నిబంధనలను ప్రభుత్వం రూపొందించాలి. అవి నిజంగా ప్రజలకు ప్రయోజనం కలిగించాలి. వాటి ద్వారా ఎవరూ అనుచిత లబ్ధి పొందకూడదు. ప్రజానీకానికి ఇబ్బంది పెట్టి ప్రజల ఆస్తి ద్వారా ఎవరూ అక్రమ లాభాలు పొందకూడదు. అవసరమైన ప్రజా మౌలిక సదుపాయాలను కల్పించిందన్న కారణంతో ప్రజలు వందలాది కోట్ల రూపాయలు ఎన్‌టీబీసీఎల్, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థలకు చెల్లించేలా చేశారు. రుసుము రూపంలో ఆ ఫ్లై వేకు అయిన ఖర్చును ఎన్‌టీబీసీఎల్ తిరిగి వసూలు చేసుకుంది. లాభాలు కూడా ఆర్జించింది. అందువల్ల ఇంకా ఫీజు/టోల్ వసూలు చేయకుండా హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంలో తప్పేమీ లేదు అని పేర్కొంది.రాయితీ ఒప్పందంలోని 14వ ఆర్టికల్‌లో... టోల్‌ను శాశ్వత ప్రాతిపదికన వసూలు చేసుకోవచ్చున్న అర్థం వస్తుండడంతో దాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ విషయంలో కూడా హైకోర్టు నిర్ణయంతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. ప్రజాప్రయోజనం అత్యధికంగా ఉండే ప్రాజెక్టులు చేపట్టే సమయంలో అధికారులు ఏకపక్ష వైఖరికి దూరంగా ఉండాలి. న్యాయమైన, పారదర్శకతతో కూడిన స్పష్టమైన విధానాన్ని అమలు చేయలి. ఈ కేసులో ప్రభుత్వం అలా ంటి ప్రయత్నం చేసినట్టు కనిపించలేదు. టెండర్ల జారీ, పోటీదార్ల నుంచి కాంపిటీటివ్ బిడ్స్ ఆహ్వానించడంలో ఏ చొరవ చూపించలేదు. ప్రాజెక్టు పనులు పూర్తయినప్పటికీ అవినీతి నిరోధక చట్టం కింద దర్యాప్తు జరిపేందుకు తగిన కేసే' అని పేర్కొంది. యూపీ, నోయిడా, ఇతర అధికారులను తప్పుపట్టింది.

# ప్రపంచానికే నైపుణ్య రాజధాని భారత్!



**కువైత్-నవభూమి:** భారతీయుల శ్రమశక్తి, నైపుణ్యాలు నవ కువైత్ నిర్మాణానికి ఎంతగానో ఉపయోగపడతాయని.. ప్రపంచానికే నైపుణ్య రాజధాని అయ్యే సత్తా భారత్‌కు ఉందని ప్రధాని మోదీ అన్నారు. రానున్న కొన్ని దశాబ్దాలపాటు ప్రపంచంలోనే అత్యంత యువ దేశంగా భారత్ ఉంటుందని పేర్కొన్నారు. కువైత్ రాజు షేక్ మిషాల్ అల్ అహ్మద్ అల్ జుబేర్ అల్ సబహ్ ఆహ్వానం మేరకు రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కువైత్‌కు చేరుకున్న ప్రధాని.. ఇక్కడి 'షేక్ సాద్ అల్ అబ్దుల్లా ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్'లో ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. "మీరందరూ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చారు. మిమ్మల్ని ఇలా చూస్తుంటే ఇక్కడ మినీ భారతదేశమే ఉన్నట్టుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. "ఏటా భారతదేశం నుంచి కువైత్‌కు వస్తున్న వందలాది మంది భారతీయులు కువైత్ సమాజానికి భారతీయ ఆత్మను జోడిస్తారు. కువైత్ కాన్వాసను.. భారతీయ నైపుణ్యాలు, ప్రతిభతో నింపేస్తారు" అని మోదీ కొనియాడారు. నలభైమూడేళ్ల క్రితం.. 1981లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ తర్వాత.. ఒక భారత ప్రధాని కువైత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఆ విషయాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. "ఇక్కడి నుంచి ఇండియాకు రావడానికి మీకు పట్టేది నాలుగు గంటలే. కానీ.. ఒక భారత ప్రధాని కువైత్‌కు రావడానికి నాలుగు దశాబ్దాలు పట్టింది" అని పేర్కొన్నారు.

**మాటకు కట్టుబడి..**

'ఎక్స్' వేదికగా తాను ఇచ్చిన మాట ప్రకారం ఇండియన్ ఫారిన్ సర్వీస్ మాజీ అధికారి, 101 సంవత్సరాల వయోవృద్ధుడు అయిన మంగళ్ సెయిన్ హండాను మోదీ ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు. తన తాత మంగళ్ హండా ప్రధాని వీరాభిమాని అని.. కువైత్ పర్యటనకు వచ్చినప్పుడు ఆయన్ను కలిసి మాట్లాడాలని హండా మనవరాలు శ్రేయ జునేజా 'ఎక్స్' వేదికగా ప్రధానికి విజ్ఞప్తి చేశారు. తప్పకుండా కలుస్తానని మోదీ ఎక్స్‌లోనే ఆమెకు సమాధానమిచ్చారు. నిజానికి మంగళ్ హండా 100వ పుట్టినరోజు సందర్భంగానే ప్రధాని మోదీ ఆయనకు వ్యక్తిగత లేఖ ద్వారా గతంలో శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పుడు ప్రధాని వ్యక్తిగతంగా తనను కలవడంతో ఎంతగానో సంతోషించారు. కాగా.. ప్రధాని మోదీ ఆదివారంనాడు కువైత్ రాజును, ప్రధానమంత్రిని కలవనున్నారు.

**మోదీకి సాదర స్వాగతం**

రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధాని మోదీ శనివారం కువైట్ చేరుకున్నారు. కువైట్ రాజు ఆహ్వానం మేరకు అక్కడకు చేరుకున్న మోదీకి ఆ దేశ ఉప ప్రధాని షేక్ ఫహాద్ యూసుఫ్ సౌద్ అల్ సబహ్ విమానాశ్రయంలో సాదరంగా స్వాగతం పలికారు. అక్కడకు చేరుకున్న అనంతరం ప్రధాని 'సలామ్ మోదీ' కార్యక్రమంలో భాగంగా మొదట ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఓ వైపు ప్రవాస భారతీయులంతా చప్పట్లు, వందేమాతరం నినాదాలతో హోరెత్తిస్తుండగా అక్కడున్న వారందరినీ మోదీ పలకరించారు. రామాయణం, మహాభారతాలను అరబిక్‌లోకి అనువదించిన అబ్దుల్లా అర్ బెరూన్, ఈ ఇతిహాసాలను అరబిక్‌లో ప్రచురించిన అబ్దుల్ లతీఫ్ అల్ సెనెఫలను మోదీ పలకరించారు. ఈ పర్యటనలో అరేబియన్ గల్ఫ్ కప్ ఫుట్ బాల్ ప్రారంభ పోటీలకు మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. మరోవైపు డిసెంబరు 1 అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా ప్రజలందరూ ధ్యానాన్ని తమ జీవితంలో ఓ భాగం చేసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. గుజరాత్‌లోని రన్ ఆఫ్ కచ్‌లో జరుగుతున్న 'రన్ ఉత్సవ్'లో పాలుపంచుకోవాల్సిందిగా మోదీ అందరికీ ఆహ్వానం పలికారు.

## స్కూళ్లకు బాంబు బెదిరింపులు.. దొరికిపోయిన విద్యార్థులు



**న్యూఢిల్లీ-నవభూమి:** పరీక్షలంటేనే టెన్షన్. పైగా ఏం ప్రిపేరు కాలేదు. దీంతో పరీక్షలు వాయిదా వేయించేందుకు విద్యార్థులు స్కెచ్ వేశారు. అందులోభాగంగా తాము చదువుతోన్న పాఠశాలలకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులకు పాల్పడ్డారు. దీనిపై స్కూల్ యాజమాన్యం.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు రంగంలోకి దిగి.. దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో ఈ మెయిల్ వచ్చిన ఐపీ అడ్రస్‌ను వారు కనుగొన్నారు.

తద్వారా ఈ కేసును ఛేదించారు. పరీక్షలు వాయిదా వేయించేందుకు ఇద్దరు విద్యార్థులు వేర్వేరుగా ఈ బాంబు బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు.. తమ దర్యాప్తులో గుర్తించారు. దీంతో సదరు విద్యార్థులను అదుపులోకి తీసుకొని.. కౌన్సిలింగ్ ఇచ్చి అనంతరం వారిని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థుల తల్లిదండ్రులను సైతం పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటన న్యూఢిల్లీలో చోటు చేసుకుంది. బాంబు బెదిరింపులకు పాల్పడిన ఈ విద్యార్థులు సోదరులని పోలీసులు వెల్లడించారు.

నవంబర్ మాసాంతంలో రోహిణి ప్రాంతంలోని ప్రశాంత్ విహార్‌లో గల పీవీఆర్ మల్టీ ప్లెక్స్ సమీపంలో బాంబు పేలుడు సంభవించింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆ మరునాడే నగరంలోని పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు వెల్లువెత్తాయి. అలా బాంబు బెదిరింపులు వచ్చిన స్కూళ్ల జాబితాలో.. వెంకటేశ్వర గ్లోబల్ స్కూల్ సైతం ఉంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ క్రమంలో ఈ బాంబు బెదిరింపు నకిలీదని వాళ్లు తేల్చారు. అందులోభాగంగా ఈ మెయిల్స్ వచ్చిన ఐపీ అడ్రస్ ఆధారంగా ఈ కేసును ఛేదించారు.

ఇటీవల మూడు పాఠశాలలకు ఇ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయి. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గత 11 రోజులుగా ఢిల్లీలోని 100కి పైగా పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్, ఈ మెయిల్స్ వచ్చాయి. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టినా.. ఈ కేసుల్లో ముందుకు వెళ్లడం.. పోలీసులకు కష్ట సాధ్యంగా మారింది.

అయితే ఈ ఏడాది మే నుంచి దాదాపు 50కిపైగా బాంబు బెదిరింపులు.. ఇమెయిల్ ద్వారా పాఠశాలలు, ఆసుపత్రులు, ఎయిర్ పోర్టుకు వస్తున్న సంగతి తెలిసిందే. మరి ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలోని పాఠశాలలు, ఆసుపత్రులు, ఎయిర్ పోర్టులే లక్ష్యంగా చేసుకొని.. ఈ బాంబు బెదిరింపులు వస్తున్నాయి.

## ఈసీ సమగ్రతను దెబ్బతీసేందుకు కేంద్రం కుట్ర: ఖర్గే



**న్యూఢిల్లీ-నవభూమి:** ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో భారత ఎన్నికల సంఘం మార్పులు చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తప్పుపట్టారు. ఎన్నికల సంఘం సమగ్రతను దెబ్బతీసేందుకు కేంద్రం పన్నిన కుట్రలో ఇదొక భాగమని ఆరోపించారు.ఎన్నికల సంఘం సిఫారసు మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని 93(2)(ఏ) నిబంధనను కేంద్ర న్యాయశాఖ ఇటీవల సవరించింది. ఈ నిబంధన ప్రకారం ఎన్నికలకు సంబధించి పోలింగ్ బూత్‌లలోని సీసీ టీవీ కెమెరాల తనిఖీపై నిషేధం ఉంటుంది. అభ్యర్థులకు ఎలక్ట్రానిక్ రికార్డులు అందుబాటులో ఉంచుతారు. తనిఖీ చేయడానికి మాత్రం అనుమతి ఉండదు.

**పద్ధతి ప్రకారం కుట్ర..**

ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనలో మార్పులు చేయడం ఒక క్రమపద్ధతిలో ఎన్నికల సంఘాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం పన్నిన కుట్రలో భాగమని ఖర్గే సామాజిక మాధ్యం 'ఎక్స్'లో ఘాటుగా విమర్శించారు. ఎన్నికల సంఘాన్ని నిర్వీర్యం చేసేందుకు గతంలో ఎన్నికల కమిషనర్లను నియమించే ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని కేంద్రం తొలగించిందని, ఇప్పుడు ఎలక్ట్రానిక్ సమాచారానికి అడ్డుకోడ కట్టారని అన్నారు. ఓటర్ల పేర్లు తొలగింపు, ఈవీఎంలలో పారదర్శకత లోపించడం వంటి అక్రమాలపై కాంగ్రెస్ పలుసార్లు ఫిర్యాదు చేసినా ఈసీ స్పందించలేదన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ కుట్రలు బయటకు రాకుండా పోలింగ్ సిసీటీవీ ఫుటేజ్‌ను, అభ్యర్థుల వీడియో రికార్డులను తొలగించకుండా నిషేధం విధించారని అన్నారు. ఈసీఐ సమగ్రతను కోల్పోతోందనడానికి, రాజ్యాంగం, ప్రజస్వామ్యంపై మోదీ ప్రభుత్వం దాడికి పాల్పడుతోందనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. ఈ దాడికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని ఖర్గే స్పష్టం చేశారు.

## జర్మనీలో దాడి.. పలువురి మృతి, ఏడుగురి భారతీయులకు గాయాలు



**మగ్డబగ్-నవభూమి:**తూర్పు జర్మనీలోని మగ్డబగ్‌లో దారుణం చోటు చేసుకుంది. క్రిస్మస్ మార్కెట్‌లో జరిగిన దాడిలో ఐదుగురు మరణించారు. ఈ దాడిలో ఏడుగురు భారతీయులు సహా 200 మంది గాయపడ్డారు. గాయపడిన భారతీయుల్లో నలుగురిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదివారం వెల్లడించింది.

క్షతగాత్రుల కుటుంబాలతో జర్మనీలోని భారత రాయబార కార్యాలయ అధికారులు మాట్లాడుతున్నారని తెలిపింది. వారికి సరైన చికిత్స అందించేందుకు చర్యలు సైతం రాయబార కార్యాలయం చేపట్టిందని వివరించింది. అయితే ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడి తెలివి తక్కువ పనిగా అభివర్ణించింది. ఈ దాడికి పాల్పడిన వ్యక్తి సౌదీ అరేబియాకు చెందిన తలేబ్‌గా పోలీసులు గుర్తించారు. అయితే ఈ దాడి అతడు ఉద్దేశ పూర్వకంగానే చేశారని వారు స్పష్టం చేశారు.

మహిళలకు గుడ్ న్యూస్.. మళ్లీ భారీగా తగ్గిన బంగారం ధరలు

మరోవైపు జర్మనీ ఛాన్సెలర్ ఓలాఫ్ స్కోల్జ్ ఈ ఘటనపై స్పందించారు. ఈ దాడిని ఖండించారు. ఇది భయకరమైన దాడిగా జర్మనీ చాన్సెలర్ అభివర్ణించారు. ఈ దాడిలో ఐదుగురు మరణించారని తెలిపారు.

# రాహుల్ గాంధీకి మళ్లీ కోర్టు సమన్లు



**లక్నో-నవభూమి:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉత్తరప్రదేశ్ కోర్టు ఆదివారం నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కులగణనపై ఆయన చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో యూపీలోని బరేలీ కోర్టులో పిటిషన్ దాఖలు అయింది. దాంతో 2025, జనవరి 07వ తేదీన కోర్టుకు హాజరు కావాలని రాహుల్ గాంధీని ఆదేశించింది. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని విడదీసేలా ఉన్నాయంటూ.. పంకజ్ పాఠక్ అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ఎన్నికల ప్రచారంలో సైతం రాహుల్ గాంధీ ఈ తరహా వ్యాఖ్యలను ప్రస్తావించారంటూ తన పిటిషన్‌లో పంకజ్ పాఠక్ స్పష్టం చేశారు.తాము అధికారంలోకి వస్తే.. దేశ సంపదను జనాభా ప్రాతిపదికన పంచుతామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. అలాగే ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు సైతం జనాభా ప్రాతిపదికనే ఇస్తామన్నారు. అయితే రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలు దేశాన్ని విడదీసేలా ఉన్నాయంటూ పంకజ్ అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. దీంతో అతడి పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించింది. ఆ క్రమంలో జనవరి 07వ తేదీన ఈ కేసు విచారణకు హాజరు కావాలని రాహుల్ గాంధీని ఆదేశిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది.

మరోవైపు ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని స్థానిక కోర్టు ఇప్పటికే రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసిన విషయం విధితమే. భారత్ జోడో యాత్రలో భాగంగా 2022, నవంబర్ 17వ తేదీన మహారాష్ట్రలోని అకోలాలో రాహుల్ గాంధీ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వీర సావర్కర్‌పై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో రాహుల్ గాంధీ.. తన అనుచిత వ్యాఖ్యలతో సమాజంలో సామరస్యాన్ని దెబ్బ తీసేలా వ్యవహరించారంటూ.. న్యాయవాది నృపేంద్ర పాండే క్రిమినల్ కంప్లైంట్ దాఖలు చేశారు.

ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణలో భాగంగా న్యాయమూర్తి జస్టిస్ అలోక్ వర్మ.. రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేశారు. జనవరి 10వ తేదీన ఈ కేసు విచారణకు హాజరు కావాలంటూ రాహుల్‌కు కోర్టు సమన్లు జారీ చేసింది. జోడో యాత్ర సమయంలో రాహుల్ గాంధీ ఇంతకీ ఏమన్నారంటే.. వీర సావర్కర్ బ్రిటీష వారికి సేవకుడిలా వ్యవహరించారన్నారు. అలాగే ఆయన పెన్షన్ సైతం తీసుకున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలపై పలు రాజకీయ పార్టీలు సైతం ఘాటుగా స్పందించిన సంగతి తెలిసిందే. అయితే కొద్ది రోజుల వ్యవధిలోనే యూపీలోని రెండు కోర్టులకు రాహుల్ గాంధీ హాజరు కావాల్సి ఉంది.

## ధ్యానం లగ్జరీ కాదు.. అవసరం

**ఐక్యరాజ్యసమితి -నవభూమి:** కొందరు భావిస్తున్నట్టు ధ్యానం కొందరికి మాత్రమే పరిమితమైన విలాస ప్రక్రియ కాదని, అది ప్రతి ఒక్కరికీ అవసరమైనదని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో మతాలు,సరిహద్దులకు అతీతంగా దౌత్య సంబంధాలను పటిష్టపరిచే శక్తివంతమైన ఆయుధమే ధ్యానమని ఆయన ప్రకటించారు. మొట్టమొదటి ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఐరాసలోని భారత శాశ్వత మిషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కీలకోపన్యానం చేస్తూ ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరైనా ధ్యానం చేయవచ్చని, అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తూ ధ్యానంపై ఎవరికైనాఅభ్యంతరాలు ఉంటే వాటిని తొలగిస్తుందని చెప్పారు.ధ్యానం అన్ని మతాలకు, భౌగోళిక సరిహద్దులకు, వయో భేదాలకు అతీతమైనదని, ఇది అందరికీ ఎంతో ఉపయోగకరమైనదని రవిశంకర్ చెప్పారు.



## అభిమానులకు అల్లు అర్జున్ కీలక రిక్వెస్ట్..!

ప్రముఖ నటుడు అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా అభిమానులకు కీలక సూచన చేశారు. తన ఫ్యాన్స్ తమ అభిప్రాయాలను బాధ్యతాయుతంగా వ్యక్తపరచాలని, ఎవరినీ వ్యక్తిగతంగా కించపరిచే విధంగా పోస్టులు వేయవద్దని సూచించారు. ఫ్యాన్స్ ముసుగులో గత కొన్ని రోజులుగా ఫేక్ ఐడీ, ఫేక్ ప్రొఫైల్స్‌తో పోస్టులు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. నెగెటివ్ పోస్టులు వేస్తున్న వారికి దూరంగా వుండాలని నా ఫ్యాన్స్‌కు సూచించారు. సంధ్య థియేటర్ వ్యవహారం కొత్త మలుపు తీసుకున్నది. అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి అల్లు అర్జున్‌పై తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. థియేటర్‌లో ఒక తల్లి చనిపోయినా మానవత్వం లేకుండా రూఫ్‌టాప్ ఓపెన్ చేసి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయాడని విమర్శించారు. అయితే, పోలీసుల అనుమతి లేకుండానే థియేటర్‌కు వెళ్లి, రోడ్‌షో, ర్యాలీ నిర్వహించినట్లు వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని అల్లు అర్జున్ స్పష్టంచేశారు. అయితే, తనపై వస్తున్న విమర్శలపై అల్లు అర్జున్ తోసిపుచ్చారు. తొక్కిసలాట ఘటనలో తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని వాపోయారు. థియేటర్ వద్ద జరిగిన ఘటన చాలా దురదృష్టకరమని.. బాధిత కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నానని, చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.
తన ఇమేజ్‌ను డ్యామేజ్ చేసే ప్రయత్నం జరుగుతుందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.





## స్కూల్ ఈవెంట్లో జాన్వీ వింత వేషం?

జాన్వీ కపూర్ ఇటీవల దేవర చిత్రంతో పాన్ ఇండియా స్టార్ గా ఎదిగింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద దాదాపు 400కోట్లు వసూలు చేసింది. తన తల్లిగారైన శ్రీదేవిని పెద్ద స్టార్ ని చేసిన పరిశ్రమలో ఇంత పెద్ద గ్రాండ్ స్టార్ట్ జాన్వీలో ఆనందం నింపింది. తదుపరి మరో టాలీవుడ్ అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ సరసన బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ నటిస్తున్న సంగతి తెలిసిందే. వరుసగా టాలీవుడ్ అగ్ర హీరోల సరసన ఈ బ్యూటీ అవకాశాలు అందుకుంటోంది. అదే సమయంలో జాన్వీ కపూర్ ముంబైలో ర్యాంప్ షోలు, ఈవెంట్లలోను అదరగొడుతోంది. తాజాగా ముంబైలో అత్యంత వైభవంగా జరుగుతున్న ధీరూభాయి అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలో జాన్వీ కపూర్ కళ్లుచెదిరే ట్రీటిచ్చింది. ఈ బ్యూటీ మిరుమిట్లు గొలిపే డిజైనర్ దుస్తుల్లో మెరుపులు మెరిపించింది. మిరుమిట్ల పింక్ కలర్ మినీ డ్రెస్ లో జాన్వీ చాలా అద్భుతంగా కనిపించింది. మెరిసే హీల్స్ మెరిసే గ్లామ్ మేకప్‌తో అందరి దృష్టిని తనవైపు తిప్పేసుకుంది. అయితే ఒక స్కూల్ ఈవెంట్లో ఈ తరహా వస్త్రధారణ సరికాదని కొందరు నెటిజనులు భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. ఇదే ఈవెంట్ లో పలువురు అందాల భామలు గ్లామరస్ దుస్తుల్లో కనిపించినా జాన్వీ కొంత హై ఎండ్ గ్లామర్ ని ఎలివేట్ చేసే దుస్తుల్లో కనిపించిందని వాదిస్తున్నారు. ఇదేమీ రెగ్యులర్ ర్యాంప్ షో కాదు.. ఫ్యాషన్ షో అసలే కాదు. పేరెంట్‌తో కలిసి పిల్లలు ఒక ఆహ్లాదకర వాతావరణంలో ఈవెంట్ ని తిలకించే సందర్భం. ఇలాంటి వేదికకు కూడా జాన్వీ ఇంత గ్లామరస్‌గా రావాలా? అంటూ ప్రశ్నిస్తున్నారు కొందరు. ప్రస్తుతం జాన్వీ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. అంబానీ స్కూల్‌లో చదవలేదు: ఆసక్తికరంగా జాన్వీ కపూర్ తాను ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకోలేదని గతంలో ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. ముంబైలోని ఎకోల్ మోండియాల్ వరల్డ్ స్కూల్‌లో చదువుకున్నానని, అయితే ప్రతిష్టాత్మక అంబానీ స్కూల్‌లో చదివిన తన స్నేహితుల కారణంగా తాను కూడా అదే స్కూల్ లో చదివానని అనుకుంటారని కూడా తెలిపింది. బాలీవుడ్‌లో చాలామంది స్టార్ కిడ్స్ అంబానీ స్కూల్‌లోనే విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ఆ తర్వాత మాస్టర్స్ కోసం విదేశాల బాట పడుతున్నారు.


## రష్మిక 2024.. నెం.1 హీరోయిన్‌గా సెండాఫ్!

రష్మిక మందన్న.. పాన్ ఇండియా స్థాయిలో టాప్ హీరోయిన్ ఎవరంటే చాలా మంది ఆమె పేరునే కచ్చితంగా చెప్తారన్న విషయంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. తన అందం, అభినయంతో వేరే లెవెల్ లో మెప్పిస్తున్న రష్మిక.. వరుస అవకాశాలు అందుకుంటున్నారు. నాన్ స్టాప్ షూటింగ్స్ తో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. . ఛలో మూవీతో టాలీవుడ్ లోకి వచ్చారు. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. అనేక బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నారు. పుష్ప చిత్రంతో నేషనల్ క్రష్ గా



మారిపోయారు. పాన్ ఇండియా రేంజ్ లో తన ఫ్యాన్ బేస్ ను పెంచుకున్నారు. ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మారారు. రష్మిక యానిమల్ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని 2023ను ముగించిన రష్మిక.. ఇప్పుడు వేరే లెవెల్ హిట్ తో 2024కు సెండాఫ్ ఇస్తున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా వచ్చిన పుష్ప 2: ది రూల్ తో రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన రష్మిక.. అదిరిపోయే హిట్ ను సొంతం చేసుకున్నారు. శ్రీవల్లి 2.0గా అందరినీ మెప్పించారు. తన అద్భుతమైన యాక్టింగ్ తో సర్వత్రా ప్రశంసలు అందుకున్న రష్మిక.. అన్ని భాషల్లో తన సత్తా ఏంటో చూపించారు. అగ్ర కథానాయికగా ఆమె స్థానాన్ని మరోసారి సుస్థిరం చేసుకున్నారు. అలా పుష్ప-2 విజయంతో 2024లో రష్మిక క్రేజ్ మరో ఎత్తుకు చేరిందని చెప్పాలి. కొన్నాళ్లపాటు ఇండస్ట్రీని రష్మిక ఏలడం పక్కా! %బాశ్రీంశీ =ఖుం% - బాహుబలి రికార్డుకు అడుగుదూరంలో పుష్ప 2 అయితే రష్మిక.. ప్రస్తుతం తన కెరీర్ లో హైయెస్ట్ స్టేజ్ లో ఉన్నారు. త్వరలో మరిన్ని పాన్ ఇండియా చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అదే సమయంలో లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతో సందడి చేయనున్నారు. ఇప్పుడు ది గర్ల్ ఫ్రెండ్ మూవీతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా ఆ సినిమా టీజర్ రిలీజ్ అవ్వగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. దాంతోపాటు శేఖర్ కమ్ముల తెరకెక్కిస్తున్న కుబేరలో కూడా యాక్ట్ చేస్తున్నారు రష్మిక. తమిళ, తెలుగు మూవీ రెయిన్ బోలో నటిస్తున్నారు. బాలీవుడ్ లో సల్మాన్ ఖాన్ తో కలిసి సికిందర్ లో హీరోయిన్ గా కనిపించనున్న రష్మిక.. చావా ప్రాజెక్టును పూర్తి చేస్తున్నారు. అలా వచ్చే ఏడాది వివిధ సినిమాలతో థియేటర్లలో రానున్నారు నేషనల్ క్రష్. మొత్తానికి 2024ను హిట్ తో ముగించిన అమ్మడు.. 2025లో ఫుల్ గా సందడి చేయనుండడం పక్కా.

## మహేష్ బాబు.. అదిరిపోయే లుక్




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. దివంగత కృష్ణ వారసుడిగా సినిమాల్లోకి వచ్చినా.. తనదైన గుర్తింపు సంపాదించుకున్నారు. స్పెషల్ ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకున్నారు. రిజల్ట్ తో సంబంధం లేకుండా తన చిత్రాలతో మెప్పిస్తున్నారు. హీరోగా ఇప్పటి వరకు 28 సినిమాలు చేశారు. 29 ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతున్నారు. దర్శకధీరుడు రాజమౌళితో తన కొత్త మూవీ చేయనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతుండగా.. మరికొద్ది రోజుల్లో షూటింగ్ ప్రారంభం కానుంది. అనౌన్స్మెంట్ తప్ప మరో అప్డేట్ ఇప్పటి వరకు రాకపోగా.. నెట్టింట రకరకాల వార్తలు వైరల్ అవుతూనే ఉన్నాయి. %బాశ్రీంశీ =ఖుం% - బాహుబలి రికార్డుకు అడుగుదూరంలో పుష్ప 2 ఆఫ్రికా బ్యాక్ డ్రాప్ లో సినిమా ఉంటుందని.. రెండు భాగాలుగా తెరకెక్కుతుందని ప్రచారం సాగుతోంది. సినిమాలో హీరోయిన్ గా ప్రియాంక చోప్రా నటించనుందని టాక్ వినిపిస్తోంది. కొందరు ఫారిన్ యాక్టర్స్‌ను రంగంలోకి దించనున్నారని తెలుస్తోంది. అన్ని వివరాలను త్వరలో ప్రెస్ మీట్ పెట్టి జక్కన్న, మహేష్ అనౌన్స్ చేయనున్నారని టాక్. అయితే %బావీదీ% 29 మూవీ రావడానికి చాలా టైమ్ పట్టేలా ఉంది. ఇంతలో ముఫాసా మూవీకి మహేష్ బాబు వాయిస్ ఓవర్ అవ్వడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయిపోతున్నారు. బ్లాక్ బస్టర్ హిట్ హాలీవుడ్ మూవీ లయన్ కింగ్ కు సీక్వెల్ గా వచ్చిన ముఫాసాలో మహేష్ వాయిస్ ను థియేటర్లలో ఎంజాయ్ చేస్తున్నారు అభిమానులు. అదే సమయంలో ఇప్పుడు సోషల్ మీడియాలో అనే ఇంగ్లీష్ మ్యాగజైన్ కవర్ పేజీ వైరల్ గా మారింది. యూనివర్సరీ ఎడిషన్ కవర్ పేజ్ పై దర్శనమిచ్చారు మహేష్ బాబు. బ్లూ జీన్స్, బ్లాక్ కలర్ టీషర్ట్ వేసుకున్న మహేష్.. హ్యాండ్సమ్ హంక్ గా కనిపిస్తున్నారనే చెప్పాలి. లాంగ్ హెయిర్, గుబురు గడ్డంతో ఉన్న మహేష్.. రిఫ్రెషింగ్ లుక్ లో కనిపిస్తున్నారు. అయితే నిర్వాహకులు.. మ్యాగజైన్ కవర్ పేజీని షేర్ చేసి ఇంట్రెస్టింగ్ క్యాప్షన్ ఇచ్చారు. మహేష్.. టాలీవుడ్ గోల్డెన్ స్టాండర్డ్ అంటూ రైటప్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మహేష్ లుక్ అదిరిపోయిందని అభిమానులు చెబుతున్నారు. ఎంతైనా మహేష్ అందమే వేరని అంటున్నారు.

## గేమ్ చేంజర్‌లో తెలుగు రాష్ట్రాల ఇన్సిడెంట్స్



'గేమ్ చేంజర్' మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ ని యూఎస్‌లో డల్లాస్ వేదికగా గ్రాండ్ గా నిర్వహించారు. ఈ ఈవెంట్ లో మూవీ ప్రమోషన్స్‌ని మేకర్స్ స్టార్ట్ చేశారు. యూఎస్ డిస్టిబ్యూటర్ రాజేష్ ఈ ఈవెంట్ ని ఆర్గనైజ్ చేసినట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున జరిగిన ఈ ప్రీరిలీజ్ ఈవెంట్ లో సినిమాకి వర్క్ చేసిన వారందరూ మేగ్జిమమ్ పాల్గొన్నారు. ఇందులో రామ్ చరణ్ స్టేజ్ పైన డాన్స్ పెర్ఫార్మెన్స్ చేసి ప్రేక్షకులని అలరించారు. ఇదిలా ఉంటే ఈ చిత్రాన్ని దిల్ రాజు ఏకంగా 200 కోట్లకి పైగా బడ్జెట్ తో నిర్మించిన సంగతి తెలిసిందే. మూవీ ప్రమోషన్స్ కోసం కూడా అయన గట్టిగానే ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రీరిలీజ్ ఈవెంట్ లో నిర్మాత దిల్ రాజు సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ' తెలుగు రాష్ట్రాలలో నిజమైన ఇన్సిడెంట్స్ 'గేమ్ చేంజర్' మూవీలో కనిపిస్తాయి. అవన్నీ కూడా మీకు చాలా రిలేట్ అవుతాయి. మీతో క్లాప్స్ కొట్టిస్తాయి. నిజానికి అవన్నీ కూడా శంకర్ గారు నాలుగేళ్ల క్రితమే స్క్రిప్ట్ లో రాసుకున్నారు. అయితే ఆ సంఘటనలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. అందుకే ఈ చిత్రం కచ్చితంగా మీ అందరికి కనెక్ట్ అవుతుంది' అని అన్నారు. హైవోల్టేజ్ ఎలిమెంట్స్ ఈ చిత్రంలో చాలా ఉంటాయి. యావత్ భారతదేశంలో ప్రతి ఒక్కరికి ఈ మూవీ ఒక కిక్ ఇస్తుందని దిల్ రాజు గొప్పగా చెప్పారు. ఆయన మాటల బట్టి సినిమాపైన చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నారని అర్ధమవుతోంది. అలాగే శంకర్ మరల తనలోని పవర్ఫుల్ రైటర్ ని బయటకి తీసుకొచ్చి బలమైన సామాజిక అంశాలని ఈ చిత్రంలో ఆవిష్కరించబోతున్నాడని తెలుస్తోంది. 'భారతీయుడు 2'తో రానటువంటి సక్సెస్ ని 'గేమ్ చేంజర్' తో శంకర్ అందుకునే అవకాశాలు ఉన్నాయని దిల్ రాజు మాటల బట్టి అనిపిస్తోంది. శంకర్ కూడా సాలిడ్ సక్సెస్ అందుకొని బౌన్స్ బ్యాక్ అవ్వాలని గట్టిగా ప్రయత్నం చేస్తున్నారు. ఇక 'ఆర్ఆర్ఆర్' లాంటి పాన్ ఇండియా హిట్ తర్వాత రామ్ చరణ్ నుంచి సోలోగా రాబోతున్న మూవీ ఇదే కావడంతో ఫ్యాన్స్ ఈ సినిమాపై చాలా హోప్స్ పెట్టుకున్నారు. దీంతో పాన్ ఇండియా రేంజ్ లో రామ్ చరణ్ మార్కెట్ ఎంత ఉందనేది కూడా డిసైడ్ అయిపోతుంది. మరి సినిమా ఎలాంటి టాక్ సొంతం చేసుకుంటుందో చూడాలి.

## రెజ్లింగ్ లెజెండ్ రే మిస్టీరియో సీనియర్ కన్నుమూత



ప్రపంచ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లర్ అయిన రే మిస్టీరియో సీనియర్ మరణించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న 66 ఏళ్ల రే మిస్టీరియో పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. దాంతో ఆయన అభిమానుల్లో తీవ్ర విషాదం నెలకొంది. రే మిస్టీరియో దాదాపు 30 ఏళ్లపాటు రెజ్లింగ్‌లో రాణించారు. 1976లో వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో అడుగు పెట్టిన రే మిస్టీరియో.. 2009లో రెజ్లింగ్‌కు అధికారికంగా రిటైర్‌మెంట్ ప్రకటించాడు. సుదీర్ఘకాలం తన ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించాడు. ఆయన మరణంపట్ల చాలామంది సంతాపం తెలుపుతున్నారు. కాగా రే మిస్టీరియో %అఒఎ% వరల్డ్ మిడ్ వెయిట్ ఛాంపియన్షిప్‌ను రెండుసార్లు గెలిచాడు. ఇటీవల ఈ స్టార్ రెజ్లర్ రే మిస్టీరియో తండ్రి రాబర్ట్ కూడా మరణించాడు. ఆయన మరణం నుంచి ఆ కుటుంబం ఇంకా తేరుకోకముందే ఆ ఇంట్లో మరో విషాదం చోటుచేసుకుంది. రే మిస్టీరియో బాగా బరువు తగ్గడంతో ఆస్పత్రి పాలయ్యారట. ఈ తరుణంలోనే ఆయన చికిత్స పొందుతూ మరణించారు. రే మిస్టీరియో అసలు పేరు మిగ్యూల్ ఏంజెల్ లోపేజ్ డియాస్. రే మిస్టీరియో కొడుకు ప్రస్తుతం రెజ్లింగ్‌లోనే ఉన్నాడు. తండ్రి వారసత్వంలో జూనియర్ రే మిస్టీరియో కూడా రెజ్లింగ్‌లో దుమ్ము లేపుతున్నాడు. సీనియర్ రే మిస్టీరియో సోమవారం జరగనున్నట్లు సమాచారం.

## అండర్ 19 ఆసియా మహిళల టీ20 చాంపియన్‌గా భారత్



కౌలాలంపూర్: మహిళల అండర్-19 ఆసియాకప్ టోర్నీలో యువ భారత్ అదరగొట్టింది. టోర్నీలో అపజయమెరుగని నిక్కీ ప్రసాద్ సారథ్యంలోని భారత జట్టు కౌలా లంపూర్‌లో జరిగిన ఫైనల్‌లో బంగా దేశ్‌ను మట్టికరిపించింది. దీంతో ఆసియా క్రికెట్ కౌన్సిల్ తొలిసారిగా నిర్వహిస్తున్న టోర్నీని టీమ్‌ఇండియా సొంతం చేసుకున్నది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 117 పరుగులకు పరిమితమయింది. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేకపోయిన బంగ్లా జట్టు 76 రన్స్‌కే ఆలౌట్ అయింది. దీంతో 41 రన్స్‌తో విజయం సాధించిన యువ భారత్ టోర్నీని విజేతగా నిలిచింది.
టాస్ గెలిచిన బంగ్లాదేశ్.. భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అయితే బ్యాటర్లు విఫలమవడంతో 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 117 రన్స్‌కే పరిమితమైంది. అయితే కష్టాల్లో ఉన్న జట్టును తెలంగాణ యువ కెరటం గొంగడి త్రిష మరోసారి ఆదుకుంది. 5 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 41 బాల్స్‌లోనే 52 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. మరో బ్యాటర్ మైథిలి వినోద్ 12 బాల్స్‌లోనే 17 పరుగులు రాబట్టింది. ఇక చేజింగ్‌కు దిగిన బంగ్లా బ్యాటర్లు భారత బౌలర్లను ఎదుర్కొలేకపోయారు. దీంతో 18.3 ఓవర్లలో 76 రన్స్‌కే ఆలౌట్ అయ్యారు.

## టీమ్‌ఇండియాకు షాక్.. రోహిత్ శర్మ మోకాలికి గాయం



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో బాక్సింగ్ డే టెస్టుకు ముందు భారత్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో సూపర్‌ఫామ్‌మీదున్న ఓపెనర్ కేఎల్ రాహుల్ ఇంజ్యూరీ అవగా.. తాజాగా కెప్టెన్ రోహిత్ శర్మ కూడా గాయపడ్డాడు. మెల్‌మోర్న్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా హిట్‌మ్యాన్‌కి గాయమైంది. త్రోడౌన్ స్పెషలిస్ట్ దయాను ఎదుర్కొనే క్రమంలో రోహిత్ ఎడమ మోకాలికి బాల్ బలంగా తగిలింది. దీంతో అతడు నొప్పితో విలవిలలాడినట్లు పలు రిపోర్టులు పెర్కొన్నాయి. వెంటనే అతనికి ఫిజియో ఐస్ ప్యాక్‌ను తెచ్చి మోకాలి మర్ధన చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అయితే రోహిత్ గాయంపై బీసీసీఐ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. కాగా, శనివారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో కేఎల్ రాహుల్ కుడిచేతికి బంతి బలంగా తాకిన విషయం తెలిసిందే. దీంతో వెంటనే ఫిజియో ప్రాథమిక చికిత్స అధించాడు. అయితే రాహుల్ గాయం అంత తీవ్రమైనది కానట్లు తెలుస్తున్నది. ఇక రోహిత్ బాక్సింగ్ డే టెస్ట్‌కు దూరమైతే సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్‌లో ఎవరినో ఒకరిని తుది జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల 26 నుంచి బాక్సింగ్ డే టెస్టు ప్రారంభం కానుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరుజట్లు 1-1తో సమానంగా ఉన్నాయి. మూడో టెస్టు డ్రాగా ముగిసింది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**